RNI.No. APTEL/2014/57702
ESTD: 1999
www.voodayam.com
Postal Regd. No. GTR/117/2025-27




# వుదయం




గుంటూరు | 23 -01-2026 శుక్రవారం | సంపుటి : 12 | సంచిక : 330 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal
Follow us on

## ఎపి పట్ల

# దిగ్గజ సంస్థల ఆసక్తి

### రాష్ట్రంలో కంపెనీల స్థాపనకు అవకాశాలు పెరుగుతున్నాయి

- టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ తో చంద్రబాబు భేటీ
- ఏపీలో టాటా గ్రూప్ ప్రాజెక్టులు వేగవంతం చేయాలి



**దావోస్ :** ఏపీనీ బ్రాండ్ ఇమేజ్ చేయడానికి, కొత్త పాలసీలపై మార్కెట్‌లో అంచనా వేయడానికి దావోస్ పర్యటన దోహదం చేస్తుందని ఎపి చంద్రబాబు నాయుడు అభిప్రాయపడ్డారు. దావోస్‌లో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ ఏడాది దావోస్ పర్యటనపై ముఖ్యమంత్రిని.. చంద్రశేఖరన్ అడిగి తెలుసుకున్నారు. ప్రపంచ పారిశ్రామిక రంగ పోకడలు, పారిశ్రామిక వేత్తల ఆలోచనలు తెలుసుకోవడానికి ఇదో మంచి వేదిక అని సీఎం అన్నారు. 2025 దావోస్ పర్యటనలో జరిపిన చర్చల్లో ఇప్పటికే రూ.2.50 లక్షల కోట్ల పెట్టుబడులు గ్రౌండ్ అయ్యాయని చంద్రబాబు చెప్పారు. మూడు రోజులు వేర్వేరు సమావేశాల ద్వారా గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, ఏఐ, అగ్రికల్చర్, టూరిజం వంటి రంగాల్లో రాష్ట్రం సాధిస్తున్న విజయాలు వివరించామన్నారు. గతంతో పోలిస్తే భారత్ పట్ల ప్రపంచ దిగ్గజ సంస్థలు ఎక్కువ ఆసక్తి చూపుతున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. యువశక్తి, సమర్థ నాయకత్వం, పాలసీల కారణంగా నేడు ప్రతీ రంగంలో భారత్‌లో కంపెనీల స్థాపనకు అవకాశాలు పెరుగుతున్నాయని సీఎం అభిప్రాయపడ్డారు. వివిధ రంగాల్లో ప్రపంచ దిగ్గజ కంపెనీల ఆలోచనలు, తన అనుభవాలను టాటా సన్స్ చైర్మన్ పంచుకున్నారు. విశాఖలో టీసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్, అమరావతి క్వాంటం వ్యాలీ, కర్నూలులో తలపెట్టిన సోలార్ పవర్ ప్రాజెక్టుల పురోగతిపై చర్చించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా చేపట్టే కార్యక్రమాల నిర్వహణపై టాటా ట్రస్ట్ నుంచి ప్రత్యేకంగా అధికారులను పంపి దీనిపై చర్చిద్దామని చంద్రశేఖరన్ చెప్పారు. రాష్ట్రంలో టాటా గ్రూపు చేపట్టిన టూరిజం ప్రాజెక్టులు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలో 3 స్పోర్ట్స్ సిటీలు నిర్మించే ఆలోచనలో ఉన్నామని, ఈ రంగంలో పెట్టుబడులకు అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో టాటా గ్రూప్ ప్రాజెక్టులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి కోరగా అన్నింటినీ సమీక్షించి ప్రాజెక్టుల పూర్తికి సహకరిస్తామని టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ తెలిపారు.

## మాట నిలబెట్టుకున్న

# డిప్యూటీ సీఎం

### కోటప్పకొండ - కొత్తపాలెం రోడ్డును ప్రారంభించిన పవన్ కళ్యాణ్

> గిరిప్రదక్షణ మార్గం లే అవుట్ పరిశీలన..
> త్రికోటేశ్వర స్వామి దర్శనానంతరం ఆలయ ప్రాంగణంలో కొండ చుట్టూ గిరిప్రదక్షణ మార్గం నిర్మాణానికి సంబంధించి రూపొందించిన లే అవుట్ ని పరిశీలించారు. పల్నాడు రేంజ్ డీఎఫ్‌ఓ జి. కృష్ణప్రియ అటవీ మార్గంలో రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయాల్సిన ప్రదేశాన్ని చూపించారు.

- రూ. 3.9 కోట్ల పంచాయితీరాజ్ నిధులతో రోడ్డు నిర్మాణం
- శివరాత్రిలోపు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీ నిలబెట్టుకున్న ఉప ముఖ్యమంత్రి
- గిరిప్రదక్షణ మార్గం నమూనా లే అవుట్, కోటప్పకొండ జింకలపార్క్ పరిశీలన





**వుదయం, కోటప్పకొండ :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి వారి భక్తులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. కోటప్పకొండ – కొత్తపాలెం గ్రామాల మధ్య పంచాయతీరాజ్ శాఖ నిధులతో నిర్మించిన నూతన రహదారిని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. గురువారం కోటప్పకొండ క్షేత్ర దర్శనం అనంతరం కొండ దిగువన ఉన్న శివస్థూపం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రోడ్డుపై నడుస్తూ నాణ్యతను పరిశీలించారు. రూ.3.9 కోట్ల నిధులతో 8 కిలోమీటర్ల మేర ఈ నూతన రహదారిని నిర్మించారు. గత అసెంబ్లీ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్ బాబు భక్తుల సౌకర్యార్థం ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు అర్జీ ఇచ్చారు. శివరాత్రి ఉత్సవాల లోపు రోడ్డు నిర్మిస్తామని ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. కోటప్పకొండ – కొత్తపాలెం మధ్య నిర్మించిన ఈ రోడ్డుతో శివరాత్రి ఉత్సవాలకు వచ్చే సుమారు లక్షన్నర మంది భక్తుల ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. కొత్తపాలెం గ్రామ పరిసరాల్లోని రైతులకు, గోనేపూడి పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బందులు తొలగనున్నాయి. రోడ్డు ప్రారంభోత్సవం సందర్భంగా గోనేపూడి పాఠశాల విద్యార్థులు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిసి తమ కోసం రహదారి సౌకర్యం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. గోనేపూడి జిల్లా పరిషత్ పాఠశాలకు క్రీడా మైదానంతోపాటు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, జనసేన నరసరావుపేట ఇంచార్జ్, రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలాని, జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా తదితరులు పాల్గొన్నారు.

**గిరిప్రదక్షణ మార్గం లే అవుట్ పరిశీలన..**

త్రికోటేశ్వర స్వామి దర్శనానంతరం ఆలయ ప్రాంగణంలో కొండ చుట్టూ గిరిప్రదక్షణ మార్గం నిర్మాణానికి సంబంధించి రూపొందించిన లే అవుట్ ని పరిశీలించారు. పల్నాడు రేంజ్ డీఎఫ్‌ఓ జి. కృష్ణప్రియ అటవీ మార్గంలో రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయాల్సిన ప్రదేశాన్ని చూపించారు. అటవీశాఖ నుంచి ఇవ్వాల్సిన అనుమతుల ప్రక్రియను వివరించారు. కోటప్పకొండ గిరిప్రదక్షణకు వచ్చే భక్తుల సంఖ్య రాను రాను పెరుగుతున్న నేపథ్యంలో త్వరితగతిన గిరిప్రదక్షణ మార్గం నిర్మాణ ప్రక్రియ పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారులకు ఆదేశించారు.

**వనవిహారి పార్క్ సందర్శన..**

అనంతరం కోటప్పకొండ ఘాట్ రోడ్డులో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వనవిహారి జింకల పార్కును ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సందర్శించారు. పార్కులోనికి వెళ్లి జింకలకు స్వయంగా ఆహారం అందించారు. ఈ జింకల పార్కులో మచ్చల జింకలు ఉన్నాయని, జింకల సంరక్షణకు, వాటికి ఇబ్బందులు కలగకుండా పర్యాటకుల సందర్శనకు ఏర్పాట్లు చేసినట్టు అటవీశాఖ అధికారులు ఆయనకు వివరించారు. వనవిహారి పార్కుకు అనుసంధానంగా ఉన్న అటవీ భూభాగాన్ని పార్కులో ఉన్న వివిధ రకాల పక్షి జాతుల వివరాలు తెలియజేశారు. పార్కులో ఉన్న వృక్ష జాతుల వివరాలు, వాటి వల్ల కలిగే ఉపయోగాలను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అటవీశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పార్క్ సందర్శన నిమిత్తం ఏర్పాటు చేసిన ట్రైన్ ను పరిశీలించి, దాని నిర్వహణ తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# మసిపై విచారణ

### నైనీ బొగ్గు గనుల టెండర్ల 'బాగోతం'పై దర్యాప్తుకి కమిటీ

### మంత్రి కిషన్ రెడ్డి ఆదేశాలపై నియమించిన కేంద్ర ప్రభుత్వం

- కమిటీ సభ్యులుగా కోల్ డైరెక్టర్ మర్పల్లి వెంకటేశ్వర్లు, డిప్యూటీ డైరెక్టర్ చేతనా శుక్లా
- గత నవంబర్ 28న వెలువడిన టెండర్ నోటీసు విశ్లేషణకు నిర్ణయం





**వుదయం, హైదరాబాద్ బ్యూరో :** రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోన్న ఒడిశాలోని నైని బొగ్గు గనుల రద్దుపై కేంద్రం కీలక నిర ్ణయ ం తీసుకుంది. కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు నైని బొగ్గు గనుల రద్దుపై విచారణకు కేంద్రం కమిటీ వేసింది. కోల్ డైరెక్టర్ మర్పల్లి వెంకటేశ్వర్లు, డిప్యూటీ డైరెక్టర్ చేత్న శుక్లాతో ప్రత్యేక కమిటీ వేసింది. ఈ ఇద్దరు కేంద్ర సభ్యుల బృందం త్వరలోనే తెలంగాణలోని సింగరేణిని సందర్శించనుంది. నైని కోల్ బ్లాక్ టెండర్ రద్దుకు గల కారణాలపై విచారణ జరపనుంది. ఇందులో భాగంగా సింగరేణి నైని కోల్ బ్లాక్ మైన్ డెవలపర్, ఆపరేటర్ నియామకానికి సంబంధించి గతేడాది నవంబర్ 28న వెలుబడిన టెండర్ ఆహ్వాన నోటీసును విశ్లేషించనుంది. తవ్వకాలకు సంబంధించిన ఎండీఓలు మరియు ఔట్ సోర్సింగ్ పనుల కోసం నోటీస్ ఇన్వైటింగ్ టెండర్ తయారీలో మసిపై విచారణ ఇతర బొగ్గు కంపెనీలు అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేయనుంది. విచారణ తర్వాత కమిటీ మూడు రోజుల్లో కేంద్రానికి తన నివేధికను సమర్పించాల్సి ఉంది.

మిగతా 2లో

### మేడారం అందాల హెలీ దర్శనం

7 నుంచి 10 నిమిషాలు హెలికాప్టర్‌లో.. టికెట్ 5 వేలు

2

### తెలంగాణకు బీసీ సీఎం కావడం తథ్యం

పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్



### కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీలు నిర్వీర్యం

మాజీ మంత్రి హరీశ్ రావు



2

# భారీ ఎన్‌కౌంటర్ 15 మంది మృతి

### జార్ఖండ్‌లో హోరా హోరీ, మృతిచెందిన మావోయిస్టులలో అనల్‌దా, 5 కోట్ల రివార్డు

### దట్టమైన సరందా అడవులలో హోరాహోరీ భయంగుప్పిట్లో గ్రామాలు



**రాంచీ, జనవరి 22 :** గురువారం జార్ఖండ్‌లోని సరందా అడవులలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 15మంది మావోయిస్టులు మరణించారు. చోటా నగ్రా పోలీస్ స్టేషన్ పరిధిలో కుంబాది గ్రామంలో భద్రతా దళాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పులలో మావోయిస్టు నాయకుడు పతిరామ్ మాంఝీ అలియాస్ అనల్ దా ఉన్నారు. ఇతడి తలపై ఆరు రాష్ట్రాలలో మొత్తం 5 కోట్ల రివార్డు ఉంది. దాదాపు 50 లక్షల రూపాయలు రివార్డు కలిగిన మరొక మావోయిస్టు కూడా ఇదే ఆపరేషన్‌లో మరణించారని పోలీసు అధికారులు వెల్లడించారు.

మరణించినవారిలో సెంట్రల్ కమిటీ సభ్యుడు సిపిఐ (మావోయిస్టు) అనల్ దా అలియాస్ పతిరాం మాంఝీగా గుర్తించినట్టు జార్ఖండ్ పోలీసు కేంద్ర కార్యాలయం నుంచి విడుదలైన ప్రకటన పేర్కొంది. భద్రతా దళాలు గాలింపు చర్యలు జరుపుతున్న సమయంలో 15 మృతదేహాలను, భారీ స్థాయిలో ఆయుధాలను, రోజువారీ ఉపయోగానికి అవసరమైన వస్తువులను కనుగొన్నారని ఆ ప్రకటన తెలిపింది. దట్టమైన సరందా అడవులలో భద్రతా దళాలు మావోయిస్టు వ్యతిరేక డ్రైవ్‌లో భాగంగా గాలింపు చర్యలు జరుపుతుండగా, మాటు వేసి ఉన్న మావోయిస్టులు కాల్పులు ప్రారంభించారని, దళాలు కూడా ఎదురు కాల్పులు ప్రారంభించడంతో, దీనితో తీవ్రమైన కాల్పుల యుద్ధం జరిగిందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. రెండు వర్గాల మధ్య ఈ కాల్పులు ఉదయం నుంచి జరుగుతున్నాయని పోలీసుల ప్రకటన చెప్తోంది. కాగా, ఈ కాల్పులు, ప్రతి కాల్పులు దగ్గరలో ఉన్న గ్రామాలలోని వారిని వణికించాయి. సుదీర్ఘకాలం ఈ కాల్పులు సాగడంతో భయం, ఆందోళన కలుగుతున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. అత్యంత క్లిష్టమైన భూభాగం, అడవినీ కలిగిన సరందా ప్రాంతం ఎప్పటి నుంచో మావోయిస్టుల కంచుకోట. భద్రతా దళాలు ఈ ప్రాంతం మొత్తాన్ని చుట్టుముట్టి, తీవ్రమైన గాలింపు చర్యలు ప్రారంభించారు. అడవిలో మావోయిస్టులు పెద్ద సంఖ్యలో ఐఇడిలు పాతి పెట్టినందున దళాలు ఆచితూచి అడుగులు వేయవలసి వచ్చిందని పోలీసులు చెబుతున్నారు. ముఖ్యంగా, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి నిర్మూలించడంతో జార్ఖండ్‌లో మావోయిస్టుల ఉనికి సరందా అడవులకు మాత్రమే పరిమితమైంది. కల్హాన్, సరందా ప్రాంతాలలో తలపై కోటి రూపాయల రివార్డు కలిగిన మిసిర్ బెస్రా సహా మావోయిస్టు అగ్రనాయకులు అక్కడ ఉన్నారనే సమాచరంతో ఉమ్మడి ఆపరేషన్ నవంబర్ 2022 నుంచి కొనసాగుతోంది.



# ప్రజా భవన్‌కు భోజనానికి రండి

### తనతో కలిసి పాదయాత్ర చేసిన ఆదిలాబాద్ మహిళలతో డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి

**వుదయం, హైదరాబాద్ బ్యూరో :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేలా రెండేళ్ల క్రితం తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగస్వాములైన ఆదిలాబాద్ జిల్లాకు చెందిన పలువురు గ్రామస్తులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ముచ్చటించారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో ఉన్న ఆయన ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం దేవుగూడ గూడెంకు చేరుకున్నారు. పాదయాత్రలో తనకు భోజనం పెట్టడంతో పాటు కొన్నికిలోమీటర్ల మేర పాదయాత్రలో పాల్గొన్న ఆ గూడెంకు చెందిన లక్ష్మీబాయి, గంగు భాయ్‌ను గుర్తుపెట్టుకున్న భట్టి వారిని పలకరించారు. వారిని పక్కన కూర్చోబెట్టుకుని నాటి ఫోటోలు చూపిస్తూ ఆనాటి విషయాలను గుర్తు చేశారు. తాను కూర్చున్నది, వారు చెప్పిన సమస్యల గురించి ప్రస్తావించారు. జిల్లా అధికారులతో కలిసి ఆయన గూడెం గ్రామస్తులతో భేటీ అయ్యారు ఇంకా సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

మిగతా 2లో



# గవర్నర్ ఉల్లంఘనపై సుప్రీంకు?

### ఆలోచిస్తున్నట్టు సిద్ధ రామయ్య ప్రకటన

**బెంగళూరు :** శాసనసభను ఉద్దేశించి తొలి ప్రసంగం చేయవలసిన గవర్నర్ల వైఖరి పట్ల దక్షిణాది రాష్ట్రాలలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమిళనాడు, కేరళ తర్వాత గురువారం కర్నాటక గవర్నర్ వార్తలలోకి ఎక్కారు. శాసన సభను ఉద్దేశించి రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిన ఉపన్యాసాన్ని చదువవలసిన గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ తన స్వంత ఉపన్యాసాన్ని ఇచ్చి సభ నుంచి బయటపడడంతో అక్కడి ప్రభుత్వం మండిపడుతోంది.
రాష్ట్ర గవర్నర్ రాజ్యాంగం నిర్దేశించిన తన విధులను, బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమవుతున్నారని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆరోపించారు. ప్రభుత్వం తయారు చేసిన పూర్తి ఉపన్యాసాన్ని చదవకుండా రాజ్యాంగాన్ని ఉల్లంఘించి, కేంద్ర ప్రభుత్వం చేతుల్లో తోలు బొమ్మలా వ్యవహరించారని ఆరోపించారు. ప్రతి ఏడాదీ గవర్నర్ ఉమ్మడి సెషన్‌ను ఉద్దేశించి, రాష్ట్ర కేబినెట్ తయారు చేసిన ఉపన్యాసాన్ని చదవాలి. అది రాజ్యాంగ బద్ధం. ఎందుకంటే, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 176, ఆ 163 ప్రకారం,

మిగతా 2లో



# రికార్డు కొనుగోళ్లు

- ధాన్యం దిగుబడి కొనుగోలులో చరిత్ర
- 25 ఏండ్లలో రికార్డ్ సృష్టించిన తెలంగాణ
- డిమాండ్ కు అనుగుణంగా విదేశాలకు ధాన్యం ఎగుమతి
- ధాన్యం కొనుగోళ్లతో 14.20 లక్షల మంది రైతులకు లబ్ధి
- బోనస్ తో కలిపి రూ. 18,532.98 కోట్ల మద్దతు ధర చెల్లింపు
- వరి కొనుగోలులో అగ్రస్థానంలో నిజామాబాద్, నల్లగొండ
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**వుదయం, హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణ.. దేశానికి అన్నపూర్ణగా మారిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కితాబిచ్చారు. ధాన్యం దిగుబడితో పాటు ఖరీఫ్ సీజన్ లో కొనుగోళ్లలోనూ తెలంగాణ దేశచరిత్రలోనే ఆల్ టైం రికార్డ్ నమోదు చేసుకుందని ఆయన వెల్లడించారు. గడిచిన ఏండ్లలో ఇదే అత్యధిక రికార్డ్ అని ఆయన చెప్పారు. 2025-26 రబీ సీజన్ ధాన్యం కొనుగోలుకు పౌర సరఫరా శాఖ రూపొందించిన ప్రణాళికలపై గురువారం బేగంపేట ఐ.ఏ.ఎస్.ఆఫీసర్స్ అసోసియేషన్ బిల్డింగ్ లో జరిగిన సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు.

మిగతా 2లో

# మేడారం.. విహంగ వీక్షణం

**వనదేవతల జాతర ఆధ్యాత్మిక చూసేల హెలికాప్టర్ సేవలు**



**వుదయం, హైదరాబాద్ బ్యూరో :**

మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లే భక్తులకు రాష్ట్ర పర్యాటక శాఖ తీపికబురు చెప్పింది. జాతర సమయంలో భక్తుల రద్దీ, మేడారం ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని చూసే అదృష్టాన్ని కల్పించింది. నేటి నుంచి భక్తుల కోసం హెలికాప్టర్ సేవలు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించింది. తాడ్వాయి మండలం ఎలుబాక నుంచి మేడారం ఏరియల్ వ్యూ చూసేందుకు హెలికాప్టర్ నడపనున్నట్లు తెలిపింది. ఈ మేరకు మంత్రి సీతక్క.. ములుగులో టూరిజం శాఖకు చెందిన జాయ్ సేవలు ప్రారంభించారు. ఒక్కొక్కరికి రూ.5 వేలతో ఏడు నిముషాల పాటు ఏరియల్ వ్యూ చూసే అవకాశం కల్పించారు. మేడారం జాతరలో ఏరియల్ వ్యూ హెలికాప్టర్ జాయ్ రైడ్ సేవలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ సేవలు తెలంగాణ పర్యాటక శాఖ సహకారంతో ప్రైవేట్ ఏవియేషన్ కంపెనీలు, థంబీ ఏవియేషన్ సంస్థ ద్వారా నిర్వహిస్తున్నట్లు వివరించింది. కాగా ఈ హెలికాప్టర్ జాయ్ రైడ్.. అడ్వెంచర్స్ ఇష్టపడే వారికి, ఫొటోగ్రఫీ ఔత్సాహికులకు అద్భుత అనుభవమని చెప్పవచ్చు. రద్దీలో చిక్కుకోకుండా జాతర సౌందర్యాన్ని వీక్షించే అవకాశం ఉంటుంది. ఈ ఏడాది మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఈ నెల 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల పాటు జరగనుంది. రెండేళ్లకోసారి జరిగే జాతర సమయంలో మేడారం జన సంద్రాన్ని తలపిస్తుంది. కేవలం తెలంగాణ నుంచి మాత్రమే కాకుండా చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు వచ్చి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకుంటారు.

**ఏరియల్ వ్యూ జాయ్ రైడ్ వివరాలు...**

ఇది కేవలం మేడారం జాతర ప్రదేశంపైనే హెలికాప్టర్లో చిన్న సర్క్యూట్ రైడ్
ఈ రైడ్ సమయం 7 నుంచి 10 నిముషాలు ఉంటుంది
జాతర సందడి, భక్తుల సమూహాలు, అటవీ ప్రాంతం, దేవతల గద్దెలు ఆకాశం నుంచి చూసే అద్భుత అవకాశం
ఒక్కో హెలికాప్టర్లో 5 నుంచి 6 మంది ప్రయాణికులు ఉండొచ్చు
అవసరమైన సెఫ్టీ ప్రమాణాలు, శిక్షణ తీసుకున్న పైలట్లు ఉంటాయి
ఆన్ లైన్లో www.helitaxii.com లేదా www.thum-byaviation.com వెబ్సైట్లో ఈ సేవలు బుక్ చేసుకోవచ్చు. లిమిటెడ్ స్లాట్స్ ఉంటాయి.

# ఫోన్ ట్యాపింగ్ నేరం కాదు

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**
**దేశం, ప్రజల భద్రత కోసం చేస్తారు**
**ప్రభుత్వానికి కావాల్సిన సమాచారాన్ని సేకరిస్తారు**
**అది పోలీసు వ్యవస్థ కనుసన్నల్లోనే జరుగుతుంది**
**మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ప్రభుత్వాలకు సంబంధం ఉండదు**



**వుదయం, సిరిసిల్ల :**

ఫోన్ ట్యాపింగ్ నేరమేమి కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. దేశం, ప్రజల భద్రత కోసం ట్యాపింగ్ చేయడం సహజమన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. పోలీసు వ్యవస్థ కనుసన్నల్లోనే అది జరుగుతుందని అన్నారు. ప్రభుత్వానికి కావాల్సిన సమాచారాన్ని తీసుకొచ్చే క్రమంలో పోలీసులు ట్యాపింగ్ చేయడం సహజమన్నారు. ఫోన్ ట్యాపింగ్తో మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ప్రభుత్వాలకు సంబంధం ఉండదని తేల్చి చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులపై కేటీఆర్ స్పందించారు. గురువారం సిరిసిల్లలో మీడియాతో మాట్లాడారు. ఇది పూర్తిగా ట్రాష్ కేసు.. ఇందులో ఏం ఉండదని కొట్టిపారేశారు. నేడు విచారణకు వెళ్తానన్నారు. అసలు ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో ముందు విచారించాల్సింది ప్రస్తుత డీజీపీ శివధర్రెడ్డినే అన్నారు. ఆయనను వదిలేసి మమ్మల్ని పిలిస్తే ఏం వస్తదని ప్రశ్నించారు. ఇప్పుడు ప్రతిపక్షాల ఫోన్లను రేవంత్ రెడ్డి కూడా ట్యాపింగ్ చేయిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. రేపు బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక తాము విచారణ జరిపిస్తే వీళ్లంతా కూడా జైలుకు పోతారని అన్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్రెడ్డి, ఉత్తమ్ కుమార్రెడ్డిలు ఇద్దరూ తమ ఫోన్లు ట్యాపింగ్కు గురవుతున్నాయని అన్నారు. మరి వారి వ్యాఖ్యలపై ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. హామీల అమలును తప్పించుకోవడానికే రేవంత్.. రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. సిట్.. రేవంత్ సిట్ అంటే కూర్చుంటది.. స్టాండ్ అంటే నిల్చుంటదని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం పేరుతో కొన్ని రోజులు డ్రామా.. ఈ కార్ రేసు కొన్నిరోజులు, గొర్రెల స్కామ్ అంటూ కొన్ని రోజులు, ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ అంటూ కొన్ని రోజులు డ్రామా చేసి వదిలేస్తారని చెప్పారు. ఒడిశాలోని నైనీ బొగ్గు గని టెండర్ కు సంబంధించిన సింగరేణి కుంభకోణాన్నిబయటపెట్టినందుకే కాంగ్రెస్ ప్రభుత్వం హరీశ్రావుకు, తనకు నోటీసులు ఇచ్చిందన్నారు., ప్రభుత్వాన్ని అస్థిర పర్చాలనే కుట్రలు ఎవరైనా చేస్తే దాని నుంచి ప్రభుత్వాలను కాపాడటం కోసం 1952 (నెహ్రూ కాలం) నుంచి నేటి వరకు నిఘా వ్యవస్థలు చేస్తాయని అన్నారు.

# ఆయిల్ పామ్ విస్తీర్ణం పెంపునకు చర్యలు

**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల**
**లక్ష్యాలు చేరుకోని ఆయిల్ పామ్ కంపెనీల జోన్లు రద్దు**
**నిర్దిష్ట లక్ష్యాలు చేరుకోకపోతే ఫెడ్ సంస్థ జోన్లూ రద్దు**

**వుదయం, హైదరాబాద్ బ్యూరో :**

రాష్ట్రంలో ఆయిల్ ఫాం సాగు విస్తీర్ణం పెంపే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం ఆశించిన స్థాయిలో లేని జిల్లాల్లో ఉన్న ఆయిల్ పామ్ కంపెనీల జోన్లను వెంటనే రద్దు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదే సమయంలో ఆసక్తి కలిగిన ఇతర కంపెనీలకు ఇవ్వాలని సూచించారు. గురువారం సచివాలయంలో టీజీ ఆయిల్ ఫెడ్, మార్క్ ఫెడ్, విత్తనోత్పత్తి సంస్థల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేటాయించిన లక్ష్యాలను చేరుకోకపోవడంతో కరీంనగర్, ఆసిఫాబాద్, వరంగల్ , హన్మకొండ జిల్లాల్లోని ప్రైవేట్ ఆయిల్ పామ్ కంపెనీలకు సంబంధించిన జోన్లను ఇప్పటికే రద్దు వాటిని ఆయిల్ ఫెడ్ సంస్థకు అప్పగించినట్లు తెలిపారు. నిర్ధిష్ట లక్ష్యాలను చేరుకోవడంలో ఆయిల్ ఫెడ్ సంస్థ కూడా విఫలమైతే ఆ సంస్థకు సంబంధించిన జోన్లను కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు ఆయిల్ పామ్ విస్తీర్ణాన్ని పెంచడమే ప్రభుత్వఉద్దేశ్యమన్నారు. అందుకోసం ఎలాంటి కఠిన నిర్ణయాలైన తీసుకుంటామన్నారు. ఆయిల్ పామ్ ప్లాంటేషన్ త్వరితగతిన విస్తరణ కోసం అవసరమైన చోట అవుట్ సోర్సింగ్ఉద్యోగులను చేర్చుకోవాలని ఆయిల్ ఫెడ్ ఎండీకి సూచించారు. అవసరమైన పనిముట్ల వినియోగంతో రైతులకు సాగు ఖర్చు ఆదా అవుతుందన్నారు.



రైతులు సాగు కోసం చేసే ఖర్చును తగ్గించడానికి అవసరమైన అన్ని అవకాశాలను పరిశీలించాలన్నారు. ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ తర్వాత వచ్చే వ్యర్థాల నుండి ఉప ఉత్పత్తులను తయారుచేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కల్లూరుగూడం, బీచుపల్లిలోని ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ల పనులను వేగవంతం చేయాలన్నారు. ఆయిల్ పామ్ సాగులో దిగుబడి పెంచడం కోసం ఆయిల్ పామ్ రైతులకు ట్రైకోడర్మా, గానోడెర్మా నిరోధక బయో ఫర్టిలైజర్లు అయిన వీఎయం, మెగ్నీషియం, సల్ఫర్ మొదలైన వాటిని 50 శాతం సబ్సిడీతో రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన వ్యవసాయ యంత్ర సేవల కోసం కస్టమ్ హైరింగ్ సెంటర్లను పామ్ ఆయిల్ రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయిల్ ఫెడ్ ఎండీకి సూచించారు.

ఆయిల్ పామ్ రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి పామ్ ఆయిల్పై ప్రస్తుతం ఉన్న దిగుమతి సుంకం 16.5 శాతం నుంచి గతంలో మాదిరిగా 44 శాతానికి పెంచాలని కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, శివరాజ్ సింగ్ చౌహాన్ చపియూష్ గోయల్తో పాటు ప్రధాని మోడీకి కూడా లేఖ రాసినట్లు పేర్కొన్నారు.

మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన జొన్న, మొక్కజొన్న ధాన్యానికి వెంటనే టెండర్లు పిలిచి అమ్మాలని మార్క్ ఫెడ్ అధికారులను ఆదేశించారు. ప్రొక్యూర్ మెంట్, సీడ్ వెరైటీలు, స్టోరేజీల నిర్వహణలకు సంబంధించి ఇంకా పాత పద్ధతులనే అవలంభిస్తున్నామని, పెరుగుతున్న సాంకేతికతను దృష్టిలో ఉంచుకొని కొత్త విధానాలను రూపొందించాలన్నారు. ప్రభుత్వానికి కూడా నష్టం రాకుండా ప్రణాళికలు తయారుచేసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాములలో ఎక్కువ కాలం స్టోరేజీ చేయకుండా, పంట పాడవకముందే మంచి ధర రాగానే అమ్ముకోవాలన్నారు. విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా నాణ్యత కలిగిన అధిక దిగుబడి వచ్చే విత్తనాలను తయారుచేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని విత్తనాభివృద్ధి సంస్థ ఎండీకి సూచించారు. ప్రైవేట్ కంపెనీలకు ధీటుగా విత్తనాభివృద్ధి సంస్థ కూడా విత్తనాలను ఉత్పత్తి చేయాలన్నారు. సీజన్కు ముందే రైతు సాగుచేసే విస్తీర్ణాన్ని అంచనా వేసి, అందుకు అనుగుణంగా విత్తనాలను కొనుగోలు చేయాలని అన్నారు. ఈ సమీక్షలో వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, సీడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆయిల్ ఫెడ్, విత్తనాభివృద్ధి సంస్థల ఎండీ యాస్మిన్ బాషా, అధికారులు పాల్గొన్నారు.

# విజిలెన్స్ విచారణ జరపండి

**సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్**



**వుదయం, హైదరాబాద్ బ్యూరో :**

2014 నుంచి ఇప్పటి వరకు తెలంగాణలో బొగ్గు టెండర్లు... తీసుకున్న అనాలోచిత నిర్ణయాలపై విచారణ జరిపి.. జరిగిన అవినీతిని బయటపెట్టాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కేంద్ర కేబినెట్ లో కీలకంగా ఉన్నారన్నారు. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర బొగ్గు గనుల శాఖ కూడా ఆయన పరిధిలోకే వస్తుందని చెప్పారు. వెంటనే విజిలెన్స్తో విచారణ జరిపించి... సింగరేణిలో జరిగిన అవినీతిని బయటపెట్టాలని కిషన్రెడ్డిని డిమాండ్ చేశారు. శాఖలో ఏ అవినీతి జరిగింది..? ఏ కుంభకోణాలు జరిగాయో మీ వద్ద ఉండే అధికారులతో విచారణ జరిపి రిపోర్టును సీబీఐకి అప్పగించాలన్నారు. ఉదయం లేస్తే పనికిరాని ఆరోపణలతో ప్రజల దృష్టిమరల్చేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ముందు తెలంగాణకు రావాల్సిన బకాయిలను, నిధులను తీసుకురావాలని కిషన్రెడ్డిని డిమాండ్ చేశారు.

# తెలంగాణకు బీసీ సీఎం పక్కా

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్గౌడ్**



**వుదయం, హైదరాబాద్ బ్యూరో :**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రజా ప్రభుత్వం బీసీలకు న్యాయం చేస్తోందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్గౌడ్ స్పష్టం చేశారు. బీసీ నాయకుడు సీఎం అయ్యే సమయంలో కచ్చితంగా అవుతారని చెప్పారు. భవిష్యత్తులో బీసీలకు చాలా అవకాశాలు వస్తాయన్నారు. గురువారం ఆయన గాంధీ భవన్లో మీడియాతో మాట్లాడారు. అవకాశం ఉన్న ప్రతీ చోట బీసీలకు పదవులు ఇస్తూ వెళ్తున్నామని చెప్పారు. కష్టపడి పనిచేస్తే ఎవరి వాటా వాళ్లకు వస్తుందని.. దీనిని ఎవరూ ఆపలేరని అన్నారు. రాబోయే రోజులు అన్నీ బీసీలవే అని కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్కు కౌంటర్ ఇచ్చారు. దేవుళ్ల పేరిట రాజకీయాలు దేశానికి మంచిది కాదని, కులం, మతం అనేవి మన పిల్లలకు భవిష్యత్తును తీసుకురావని అన్నారు. రాముడు, అంజనేయుడి పేరు చెప్పి బీజేపీ వాళ్లు ఓట్లు దండుకుంటున్నారని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామన్నారు. దేవుళ్లతో రాజకీయాలను ముడి పెట్టవద్దని అన్నారు.

# సింగరేణిపై కేంద్రానికి అజమాయిషి లేదు

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**



**వుదయం, హైదరాబాద్ బ్యూరో :**

బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నట్లు సింగరేణి లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అంతకుముందు మంత్రి కిషన్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లు సహకరిస్తామని హామీ ఇచ్చారు. కానీ సింగరేణి విషయంలో రాష్ట్రాలపై కేంద్రానికి ఎలాంటి అజమాయిసీ లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణిది కీలక పాత్ర అని చెప్పారు. గురువారం హైదరాబాద్లోని నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. బొగ్గు కుంభకోణం విషయంలో బీఆర్ఎస్ నేతలు పదే పదే సీబీఐ చేత ఎంక్వయిరీ చేయించాలని డిమాండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. తెలంగాణలోకి సీబీఐ రాకుండా నిషేధించిందే బీఆర్ఎస్ అని గుర్తుచేశారు. సింగరేణిపై ప్రభుత్వాలు అదనపు భారాన్ని మోపుతున్నాయని అన్నారు. కొత్త నిబంధన పెట్టడం ముమ్మాటికీ తప్పేనన్న కేంద్రమంత్రి ఒక వేళ పెట్టినా సెల్ఫ్ డిక్లరేషన్ సరిపోతుందని అభిప్రాయపడ్డారు. గత పదేళ్లు సింగరేణిలో దోపిడీ జరిగిందనీ ఇప్పుడు కాంగ్రెస్ పాలనలోనూ జరుగుతోందని ఆరోపించారు.

# గవర్నర్ ఉల్లంఘనపై సుప్రీంకు?

మొదటి పేజీ తరువాయి..

గవర్నర్ ప్రభుత్వం లేదా కేబినెట్ తయారు చేసిన స్పీచ్ను చదవాలని సిద్దరామయ్య విలేకరులకు చెప్పారు. నేడు, కేబినెట్ తయారు చేసిన ఉపన్యాసాన్ని చదవడానికి బదులుగా, తాను తయారుచేసుకున్న ఉపన్యాసాన్ని చదివారని, ఇది భారత రాజ్యాంగ నిబంధనలకు వ్యతిరేకం అని ముఖ్యమంత్రి ఆరోపించారు. ఇది ఆర్టికల్ 176, 163 ఆర్టికళ్లను స్పష్టంగా ఉల్లంఘించడమే, కనుక ఇది గవర్నర్ ఉపన్యాసం కాదు. రాజ్యాంగం ప్రకారం ఆయన తన విధులను నెరవేర్చలేదు. అని ముఖ్యమంత్రి విమర్శించారు. కనుక, తాము గవర్నర్ వైఖరికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్నామని, ఈ విషయంపై సుప్రీం కోర్టుకు వెళ్లవచ్చా లేదా అనే విషయాన్ని పరిశీలిస్తున్నామని ఆయన అన్నారు.

యుపిఎ కాలం నాటి ఎంజిఎన్ఆర్జిఎను కేంద్ర రద్దు చేయడాన్ని ప్రస్తావిస్తూ చేసిన వ్యాఖ్యానాల పట్ల అభ్యంతరాలను తెలుపుతూ, కర్నాటక శాసనసభలో ఇవ్వవలసిన ఉపన్యాసాన్ని ఇచ్చేందుకు బుధవారం గెహ్లాట్ వ్యతిరేకించారు. ప్రభుత్వం తయారు చేసిన ఉపన్యాసంలో కేంద్రాన్ని, దాని విధానాలను ప్రస్తావిస్తూ మొత్తం 11 పారాగ్రాఫులలో విమర్శలు గవర్నర్ను ఇరుకున పెట్టినట్టు ఉన్నాయి. ఆయన వాటిని తొలగించాలని కోరారు.

# ప్రజా భవన్కు భోజనానికి రండి

మొదటి పేజీ తరువాయి..

ఈ క్రమంలో అంగన్వాడి కేంద్రం, ప్రభుత్వ పాఠశాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని, పీఏసీఎస్ సబ్ సెంటర్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ సందర్భంగా గంగుభాయ్ తో భట్టి ప్రత్యేకంగా మాట్లాడారు. పాదయాత్రలో తనతో పాల్గొన్న గంగుబాయి, లక్ష్మీ భాయ్ భోజనం పెట్టారన్నారు. తన చేతిలో చేయి వేసి కొన్ని కిలోమీటర్లు నడిచారన్నారు. ప్రభుత్వం వస్తుందని ఆశీర్వదించి పంపారని చెప్పారు. వారు ఆశీర్వదించినట్టుగా ప్రజా ప్రభుత్వం వచ్చిందనీ వారిద్దరినీ హైదరాబాద్ లో తాను ఉంటున్న ప్రజాభవన్ కు భోజనానికి రావాల్సిందిగా ఆహ్వానిస్తున్నానని తెలిపారు. వారు హైదరాబాద్ కు వచ్చేందుకు, తిరిగి వెళ్లేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తానని భట్టి విక్రమార్క తెలిపారు.

# మసిపై విచారణ

మొదటి పేజీ తరువాయి..

ఇతర బొగ్గు కంపెనీలు అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేయనుంది. విచారణ తర్వాత కమిటీ మూడు రోజుల్లో కేంద్రానికి తన నివేధికను సమర్పించాల్సి ఉంది.




# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలి

**హైదరాబాద్ జిల్లా సమీక్షలో ఇన్ ఛార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్**

**వుదయం, హైదరాబాద్ :**

సంక్షేమ పథకాల అమలులో హైదరాబాద్ జిల్లాను ముందంజలో నిలపాలని జిల్లా ఇన్ ఛార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించారు. గురువారం హైదరాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అధ్యక్షతన నిర్వహించిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలు, పురోగతిపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లా పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా అధికారులు నిబద్ధతతో ప్రత్యేక కృషి చేయాలని మంత్రి సూచించారు. హైదరాబాద్ నగర స్వభావాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక విధానంతో ప్రణాళికలు రూపొందించి అమలు చేయాల్సిన అవసరం ఉందని మంత్రి స్పష్టం చేశారు. జిల్లాలో జనాభా వృద్ధి, ఉపాధి కోసం వలసలు, సేవల ఆధారిత ఆర్థిక వ్యవస్థను పరిగణనలోకి తీసుకొని విద్య, ఆరోగ్యం, గృహాలు, రవాణా, భద్రత, ప్రజాసేవలను అధికారులు సమన్వయంతో కలిసి అమలు చేయాలని మంత్రి సూచించారు. సంక్షేమం, పథకాల అమలు, పింఛన్లు, వృద్ధులు, దివ్యాంగులకు సంబంధించిన సంక్షేమం, 2బిహెచ్కే గృహాలు, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, విద్యా రంగం, రెసిడెన్షియల్ పాఠశాలలు హాస్టళ్లు, మధ్యాహ్న భోజన పథకం, అంగన్వాడీ కేంద్రాలు, షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి వంటి పథకాల అమలును మంత్రి సమీక్షించారు. ఆరోగ్య రంగంలో ఆరోగ్యశ్రీ కవరేజ్, లబ్దిదారుల పరిధి, ఆసుపత్రుల నెట్వర్క్, బస్తీ దవాఖానాలు, ప్రజారోగ్య సౌకర్యాలకు సంబంధించిన అంశాలపై సంబంధిత వైద్యాధికారులు వివరించారు. అలాగే రవాణా, పట్టణ విస్తరణ అంశాలపై విస్తృతంగా సమీక్ష జరిగింది. ట్రాఫిక్ నియంత్రణ, రోడ్ సేఫ్టీ చర్యలు, నగరంలోని అన్ని ప్రాంతాలకు ఆర్టీసీ ప్రజా రవాణాను మరింత బలోపేతం చేయడం, కొత్త బస్ మార్గాల ప్రారంభం ద్వారా కనెక్టివిటీ మెరుగుపరచడం, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కల్పించే మహాలక్ష్మి పథకం అమలు వంటి అంశాలను మంత్రి పరిశీలించారు. ఎలక్ట్రిక్ వాహనాలు ప్రోత్సాహం, ప్రజా ప్రదేశాల్లో ఈవీ చార్జింగ్ మౌలిక వసతుల ఏర్పాటు విషయాలపై అమలు తీరును మంత్రి సమీక్షించారు. ఉపాధి మరియు ఆర్థిక రంగాల పరంగా చేనేత, వస్త్ర పరిశ్రమలు, ఉపాధి మరియు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, సహకార సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, స్లమ్ స్థాయి సమాఖ్యలపై సమీక్షించబడ్డాయి. సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ జితేందర్రెడ్డి, డి ఆర్ వో వెంకటాచారి, సిపిఓ డాక్టర్ సురేందర్, జిల్లా సంక్షేమ అధికారులు జి ఆశన్న, అక్కేశ్వరరావు, ఇలియాస్ అహ్మద్, ప్రవీణ్ కుమార్, కోటాజి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీలు నిర్వీర్యం

**మాజీ మంత్రి హరీశ్ రావు**



**వుదయం, మెదక్ :**

ఆరు గ్యారంటీలు.. 420 హామీలతో రాష్ట్రంలో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తన పాలనలో మున్సిపాలిటీలను నిర్వీర్యం చేసిందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. పట్టణాల్లో అభివృద్ధిని గాలికి వదిలేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కార్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, అమలు కాని హామీలపై విసిగిపోయి పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. గురువారం మెదక్ లోని తన నివాసంలో సంగారెడ్డి, నర్సాపూర్, పటాన్చెరు నియోజకవర్గాలకు చెందిన పలువురు కీలక నాయకులు భారీ సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, పటాన్చెరువు బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి, ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సంగారెడ్డి, నర్సాపూర్, పటాన్చెరుతో సహా అన్ని మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలను చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లడానికి, చెత్త ఎత్తడానికి కూడా నిధులు లేని దుస్థితి నెలకొందన్నారు. ఇస్నాపూర్, గుమ్మడిదల వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో కూడా మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు.

# మినీ దావోస్గా హైదరాబాద్

మొదటి పేజీ తరువాయి..

ప్రపంచ ఆర్థిక సదస్సులోని తెలంగాణ పెవిలియన్లో సీఎం నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్కు చెందిన ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్ మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జర్గెన్స్, ఫోరం డిజిటల్ ఎకానమీ స్ట్రాటజీ హెడ్ మంజు జార్జ్ తో గురువారం సమావేశమైంది. ఈ సందర్భంగా తెలంగాణలో పారిశ్రామిక ప్రగతికి ఉన్న సానుకూల అవకాశాలు, అనుకూల వాతావరణం, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, విధానాలను ప్రపంచానికి చూపించాలన్న ఆలోచనలను సీఎం పంచుకున్నారు. అందుకు అనుగుణంగా హైదరాబాద్లో తదుపరి చర్యలపై సమావేశం నిర్వహించి సమీక్షించడం ద్వారా పరస్పర సమన్వయం మరింత పెరుగుతుందని చెప్పారు. హైదరాబాద్లో జూలై, ఆగస్టు నెలల్లో సమావేశం నిర్వహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఆ సదస్సు ప్రతినిధుల ముందు ప్రతిపాదించారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్, మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్మ్యాప్, లక్ష్యాలను సీఎం ఈ భేటీలో సమగ్రంగా వివరించారు. హైదరాబాద్లో జరిగిన బయోఏషియా 2024లో ప్రారంభించిన సీఐఎఫ్ఆర్ (సెంటర్ ఫర్ ది ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్) పురోగతిపై చర్చలు జరిపారు. ఆరోగ్యం, లైఫ్ సైన్సెస్ రంగాలకు సంబంధించి వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ భారత్లో ప్రారంభించిన తొలి థీమాటిక్ సెంటర్ అదేనని గుర్తు చేశారు. సీఐఎఫ్ఆర్ ఆదర్శవంతమైన మోడల్గా గుర్తింపు సాధించిందన్నారు. పరిశ్రమల అభివృద్ధి ప్రణాళికలో ఉత్తమ పద్ధతులపై సీఐఎఫ్ఆర్ చేస్తున్న పరిశోధనల సమాచారాన్ని తెలంగాణ ప్రభుత్వంతో పంచుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మూడు జోన్ల నమూనాను విశ్లేషించారు. క్యూర్, ప్యూర్, రేర్ ఆర్థిక అభివృద్ధి వ్యూహంతో పాటు భారత్ ఫ్యూచర్ సిటీ ఏర్పాటును వివరించారు. ఇది నెట్-జీరో గ్రీన్ఫీల్డ్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టుగా, దేశంలో సుస్థిర అభివృద్ధికి రోల్ మోడల్ సిటీగా నిలుస్తుందన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ఏరోస్పేస్, డిఫెన్స్, బయో-డిజైన్, సాఫ్ట్వేర్, ఫార్మా రంగాల్లో హైదరాబాద్ కు ఉన్న అనుకూలతలను వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. దీంతో తెలంగాణ విజన్ లక్ష్యాలు పరస్పర సహకారానికి అవకాశం కల్పించేలా ఉన్నాయని జెరెమీ జర్గెన్స్ ప్రశంసించారు. తెలంగాణ ఆర్థిక వృద్ధి ప్రయాణంలో కలిసి వస్తామనే సంకేతాలు ఇచ్చారు.



**భారత్ ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్...**

తెలంగాణను ఏఐ డేటా సెంటర్ హబ్గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక పెట్టుబడిని సాధించింది. 'తెలంగాణ రైజింగ్'బృందం దావోస్లో యూపీసీ వోల్ట్ సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. యూపీసీ వోల్ట్ సీఈవో హాన్ డీ గ్రూట్, యూపీసీ రిన్యూవబుల్స్ ఏపీఏసీ సహ వ్యవస్థాపకుడు స్టీవెన్ జ్వాన్, యూపీసీ రిన్యూవబుల్స్ ఇండియా సీఈవో అలోక్ నిగమ్ తో సీఎం సమావేశమయ్యారు. నెదర్లాండ్స్ కు చెందిన యూపీసీ రిన్యూవబుల్స్ గ్రూప్, వోల్ట్ డేటా సెంటర్స్ కలిసి యూపీసీ వోల్ట్ సంస్థగా ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఈ సంస్థ భారత్ ఫ్యూచర్ సిటీలో వంద మెగావాట్ల సామర్థ్యంతో ఏఐకు అనుకూలమైన డేటా సెంటర్ నెలకొల్పనుంది. ఈ ప్రాజెక్టుకు ఐదేళ్లలో రూ.5వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ డేటా సెంటర్కు అవసరమైన విద్యుత్ సరఫరాకు వంద మెగావాట్ల సామర్థ్యంతో ప్రత్యేక పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలోనే 3వేల మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయి. డేటా సెంటర్ ప్రారంభమైన తర్వాత మరో 800 మందికి ఉద్యోగ అవకాశాలుంటాయి. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దడంలో ఆధునిక డిజిటల్ మౌలిక వసతులు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. పర్యావరణ పరిరక్షణతో పాటు అభివృద్ధిని సాధించడమే రాష్ట్ర లక్ష్యమని స్పష్టం చేశారు. ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. అధునాతన ఏఐ డేటా సెంటర్ల ఏర్పాటుకు అవసరమైన ప్రోత్సాహకాలు, సౌకర్యాలు తమ ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. నెట్ జీరో సిటీ అభివృద్ధే తెలంగాణ విజన్ లో భాగమని అన్నారు.

# రికార్డు కొనుగోళ్లు

మొదటి పేజీ తరువాయి..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్ల వ్యవధిలో అనుసరించిన విధానాల ఫలితమే ధాన్యం దిగుబడి, కొనుగోళ్లలో సంచలనాత్మక రికార్డ్ నమోదు చేసుకుందని చెప్పారు. పౌరసరఫరాలు, నీటిపారుదల, వ్యవసాయ శాఖలు పరస్పరం సమన్వయం చేసుకోవడంతో పాటు తెలంగాణ రైతాంగం భాగస్వామ్యంతో ఈ విజయం సాధ్యమైందన్నారు. దేశ చరిత్రలోనే ఇంత పెద్ద స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసిన దాఖలాలు దేశంలోని మరే ఇతర రాష్ట్రాల్లో లేవన్నారు. 2020-21 లో నమోదైన 70.2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు రికార్డ్ ను అధిగమించి తాజాగా జరిగిన ఖరీఫ్ సీజన్ లో 71.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిన తెలంగాణ దేశ చరిత్రలో కొత్త అధ్యాయం సృష్టించిందన్నారు. మద్దతు ధరతో పాటు సన్నాలకు తొలి సారిగా తమ ప్రభుత్వం అందిస్తున్న బోనస్ తో కలిపి 14.20 లక్షల మంది రైతులకు మొత్తం రూ. 18,532.98 కోట్లు చెల్లించామన్నారు. ఖరీఫ్ సీజన్ లో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు, సలహాలు, సూచనలను అధికారులు పాటించడంతో పటు ప్రణాళికా రాష్ట్ర వ్యాప్తంగా 8,548 కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించారన్నారు. రైతులు ఎక్కడ ఇబ్బంది పడకుండా కొనుగోలు ప్రక్రియ ముగిసిందని ఆయన వివరించారు.

**విదేశాలకూ మన ధాన్యం...**

అధిక దిగుబడి, రికార్డ్ స్థాయిలో కొనుగోలు చెసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి భారత ఆహార సంస్థతో పాటు ప్రజాపంపిణీ వ్యవస్థ కు సరఫరా చేస్తామని మంత్రి చెప్పారు. అదే సమయంలో తెలంగాణ బియ్యానికి అంతర్జాతీయ మార్కెట్ లో ఉన్న డిమాండ్ కు అనుగుణంగా విదేశాలకు ఎగుమతి చేసేందుకు విధి విధానాలను రూపొందిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉన్న ధాన్యాన్ని పండించేందుకు రైతులను ప్రోత్సహిస్తామనీ అలాగే అంతర్జాతీయ మార్కెట్ కు బియ్యాన్ని ఎగుమతి చెసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ. 38వేల కోట్లు నేరుగా రైతుల ఖాతాలో జమ చేయడం రికార్డ్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతాంగం విషయంలో అనుసరించిన విధానాలతో సంచలనాత్మక ఫలితాలు సాధించినట్లు వివరించారు. ప్రస్తుతం అర్హులైన నిరుపేదలందరికీ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని మంత్రి తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుకు నెలకు ఆరు కిలోల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 3.17 కోట్ల మందికి ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్నామని, చెప్పారు. సన్నబియ్యం పంపిణీ మీద రూ.13,650 కోట్లు ఖర్చు పెడుతున్నట్టు వివరించారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో ఉన్న నాణ్యతా లోపాలు గుర్తించడంతో పాటు అక్రమంగా బ్లాక్ మార్కెట్ కు తరలిపోయే విధానానికి కళ్లెం వేసి నాణ్యతా ప్రమాణాలపై కఠిన నిబంధనలు అమలులోకి తెచ్చామన్నారు.

**మౌలిక సదుపాయాలపై ఫోకస్...**

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పెరుగుతున్న నేపద్యంలో అందుకు అనుగుణంగా నిల్వ చేసేందుకు మౌలిక సదుపాయాల ఆధునీకరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ధాన్యాన్ని నిల్వచేసే గోదాముల సామర్థ్యం 29 లక్షల మెట్రిక్ టన్నుల వరకు పరిమితం అయ్యిందన్నారు. కేంద్రప్రభుత్వం సహకారంతో పాటు ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో ధాన్యం నిలువ ఉంచే గోదాములను సైలో పద్దతిలో ఆధునికరించే ఆలోచనతో ఉన్నామన్నారు. ఆధునికీకరణతో తేమ శాతం నియంత్రణలో ఉండడంతో పాటు నష్టానివారణ చర్యలు చేపట్టవచ్చన్నారు. ప్రారంభంలో ఆధునీకరణకు ఖర్చు ఎక్కువే అయినప్పటికీ నిల్వ చేసిన బియ్యం చెడిపోకుండా ఉంటే అది ప్రయోజనం కలిగిస్తుందన్నారు. బీహార్ వంటి రాష్ట్రాల నుండి వలస వచ్చే కార్మికులపై తెలంగాణలో రైస్ మిల్లులు ఆధారపడుతున్నాయనీ ఇటీవల ఆ రాష్ట్రంలో ఎన్నికలు జరిగితే వలస వచ్చిన కార్మికులు వారి వారి స్వస్థలాలకు వెళ్లిపోవడంతో కొనుగోళ్ల ప్రక్రియకు ఆటంకాలు ఏర్పడ్డాయని మంత్రి చెప్పారు. ఆ పరిస్థితి తిరిగి ఉత్పన్నం కాకుండా ఉండేందుకు స్థిరమైన కార్మిక వ్యవస్థ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వం రూపొందించిన నిబంధనలు పాటించిన మిల్లర్లకు సంపూర్ణ సహాయ సహకారాలు ఉంటాయని తప్పిదాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సిబ్బంది కూడా రాజకీయ వత్తిళ్లకు లొంగకుండా నిబంధనల అమలులో కఠినంగా ఉండాలన్నారు. డిఫాల్ట్ అయిన మిల్లులకు ధాన్యం కేటాయింపు ప్రసక్తే లేదన్న మంత్రి ,పౌర సరఫరాల శాఖ రూపొందించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాల్సిందేనన్నారు. పెరుగుతున్న ధాన్యం ఉత్పత్తి కనుగుణంగా ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకుని రాష్ట్రంలో మిల్లుల పరిశ్రమని ప్రోత్సహించేందుకు విధివిదానలను త్వరలో ప్రకటిస్తామన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా మరిన్ని నిత్యావసర సరుకుల సరఫరాకు ప్రభుత్వం ఆలోచన చేస్తుందని మంత్రి చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో డ్రైయర్లు, పాడి క్లినర్ల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు.

## ఇంటర్ ప్రాక్టికల్ పేరుతో కాలేజీల్లో అక్రమాలు

- కార్పొరేట్ ప్రైవేట్ జూనియర్ కళాశాలల పై విచారణ జరిపించాలి
- ఆర్ఐఓ వెంకటేశ్వర్లుకు వినతి




**కడప, జనవరి 22, (వుదయం ప్రతినిధి)** జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్స్ పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న కార్పొరేట్ ప్రవేట్ జూనియర్ కళాశాలలపై విచారణ జరిపించాలని కోరుతూ గురువారం పిడిఎస్ యు ఆధ్వర్యంలో వైయస్సార్ కడప జిల్లా కేంద్రంలో ఇంటర్ ప్రాంతీయ అధికారి ఆర్ఐఓ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పిడిఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 27 తేదీ నుండి అన్ని జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ప్రారంభం నేపథ్యంలో వైఎస్ఆర్ కడప జిల్లాలో కడప నగరం, మైదుకూరు, పులివెందుల, బద్వేల్, జమ్మలమడుగు ప్రాంతాలలో ఉన్న కార్పొరేట్ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు మార్కులు అధికంగా వేస్తామని చెప్పి ఒక్కో విద్యార్థులు దగ్గర ఎటువంటి రసీదులు ఇవ్వకుండా 2000 రూపాయలు నుంచి 3000 వేలు వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీని వల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. కావున కార్పొరేట్ ప్రైవేట్ జూనియర్ కళాశాలలను ఆకస్మిక తనిఖీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు మనోజ్,ఉషమా, గఫార్ అహ్మద్, శివ , చందు,క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

- స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ దంపతులు
- స్కంద జోలాలి పవళింపు సేవ పాట ఆవిష్కరించిన ఎమ్మెల్యే
- స్వామి సన్నిధిలో స్కంద జోలాలి పాట ఆలపించిన గాయని రమ్య బెహరా





**అవనిగడ్డ జనవరి22 (వుదయం ప్రతినిధి):** సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా భాసిల్లుతున్న మోపిదేవి శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఉదయం అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ముఖ్య అతిధులుగా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దంపతులు విచ్చేయగా వారికి దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల ఈఓ దాసరి శ్రీరామ వరప్రసాదరావు, వేద పండితులు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.ముందుగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ – విజయలక్ష్మి దంపతులు, మండలి వెంకట్రామ్ – సాయి సుప్రియ దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను ప్రారంభించి సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని పెండ్లి కుమారునిగా అలంకరించేందుకు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. బ్రహ్మశ్రీ కొమ్మూరి ఫణి కుమారశర్మ బ్రహ్మత్వం, బ్రహ్మశ్రీ బుద్ధు పవన్ కుమార్ శర్మ ప్రధాన అర్చకత్వంలో ఆలయ వైదిక సిబ్బంది స్వామివారిని పెండ్లి కుమారునిగా అలకరించారు.

### స్కంద జోలాలి పాట ఆవిష్కరణ

ఈ సందర్భంగా సుప్రసిద్ధ సినీ గాయని రమ్య బెహరా మోపిదేవి దేవస్థానంలో ప్రతిరోజు పవళింపు సేవలో వినిపించేందుకు ఆలపించిన "స్కంద జోలాలి.. సుబ్రహ్మణ్య జోలాలి..." భక్తి పాటను సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చేతులమీదుగా సమర్పించారు.ఈ ఏడాది జరుగుతున్న సుబ్రహ్మణ్య షష్ఠి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత ప్రత్యేకమైనవని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ అన్నారు. మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిపై అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రముఖ సినీ నిర్మాత హైదరాబాదుకు చెందిన అట్లూరి నారాయణరావు రూ.కోటికి పైగా వ్యయంతో నూతన టేకు రథం తయారు చేయించటం, ప్రముఖ గాయని రమ్య బెహరా స్వామివారి పవళింపు సేవ కోసం "స్కంద జోలాలి" గీతాన్ని ఆలపించి స్వామికి అంకితం చేయడం శుభ పరిణామం అన్నారు.



## ప్రజల సమస్యల ప్రజా దర్బార్

### ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి

**ప్రొద్దుటూరు, జనవరి 22 , (వుదయం ప్రతినిధి)** ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక నెహ్రూ రోడ్డులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరిస్తూ సమస్యలను తెలుసుకుంటూ త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



## స్విమ్స్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్

### వైద్యాధికారి డాక్టర్ బి.రామాంజనేయులు

**చిట్టమూరు, జనవరి 22, వుదయం ప్రతినిధి:** టీటీడీకి చెందిన తిరుపతి శ్రీవెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో గురువారం చిట్టమూరు మండలంలోని గుణపాటిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్టు వైద్యాధికారి డాక్టర్ బి.రామాంజనేయులు తెలిపారు. ముందుగా క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాలు, మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతున్నాయి. బిపి, షుగరు పరీక్షలతోపాటు పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. మహిళలు, పురుషులు విశేషంగా విచ్చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నట్లు తెలిపారు. స్విమ్స్ డైరెక్టర్ మరియు వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటి మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్, నోడల్ ఆఫీసర్లు డాక్టర్ టివిడి.ప్రత్యూష, డాక్టర్ ఎం.లలిత్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో స్విమ్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, సర్పంచ్ వై.పోలయ్య, స్థానిక నాయకులు బి.అంకబాబు, మధురెడ్డి, ఎంపిహెచ్ఈఓ కె.నాగయ్య, సూపర్వైజర్ జి.గీతావాణి, ఎంఎల్ హెచ్ పిలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రపంచ స్థాయి హెమటాలజీ సేవలను అందించడమే లక్ష్యం

### ప్రముఖ డాక్టర్ అశోక్ కుమార్




**కడప, జనవరి 22, (వుదయం ప్రతినిధి)** ప్రొద్దుటూరుకు చెందిన 65 సంవత్సరాల వృద్ధురాలు బ్లడ్ క్యాన్సర్తో బాధపడుతుండగా సోమాజిగూడ యశోద హాస్పిటల్లో మల్టిపుల్ మైలోమా అని డాక్టర్ అశోక్ కుమార్ నిర్ధారించారు. ఈ వ్యాధికి 4 నెలల కీమోథెరపీ ఇచ్చి వ్యాధి తగ్గిందని నిర్ధారించుకున్న తర్వాత ఆటోలాగస్ బోన్ మారో ట్రాన్స్ప్లాంటేషన్ విజయవంతంగా నిర్వహించారు. గురువారం కడప నగరం యశోద మెడికల్ సెంటర్ లో ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 5 సం ల తర్వాత ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. హెమటాలజి,బోన్ మారో ట్రాన్స్ ప్లాంట్ యూనిట్లో లుకేమియా లింఫోమాస్ మల్టీపుల్ మైలోమా అప్లాస్టిక్ అనీమియా తలసీమియా సికిల్ సెల్ డిసీస్ వంటి కాన్సర్, రక్త రుగ్మతులకు పెద్దలు,పిల్లలకు సమగ్ర చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.బోన్ మారో ట్రాన్స్ ప్లాంటేషన్ తో ఇప్పటి వరకు 450 మందికి పైగా విజయవంతమైన బీఎంటీ లను నిర్వహించినట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా ప్రపంచ స్థాయి హెమటాలజి సేవలను అందించడమే లక్ష్యంగా యశోద హాస్పిటల్స్, సోమాజిగూడ ముందుకు సాగుతోందని స్పష్టం చేసారు. అలాగే ప్రతి నాల్గవ గురువారం యశోద మెడికల్ సెంటర్ కడప నందు అందుబాటులో ఉండగలరన్నారు. కార్యక్రమంలో మేనేజర్ సి.శ్రీనివాస రెడ్డి, యు. పెంచలయ్య, అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్,సెంటర్ ఇన్చార్జి సుబ్బారెడ్డి, సి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. సలహాలకు ఈ నెంబర్స్ 9154535818, 9063126579 సంప్రదించాలన్నారు.



## జనసేన నాయకుడు కృష్ణబాబుకు పితృవియోగం

### నాగ పోతురాజు భౌతిక కాయానికి ఎమ్మెల్యే నివాళి

**అవనిగడ్డ జనవరి22 (వుదయం ప్రతినిధి):** కోడూరు మండలం మాచవరం గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు రెడ్డౌతు కృష్ణబాబుకు పితృవియోగం కలిగింది. గురువారం ఉదయం అవనిగడ్డలో కృష్ణబాబు తండ్రి నాగ పోతురాజు మృతి చెందారు. వారి భౌతికకాయాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సందర్శించి నివాళులు అర్పించారు. కృష్ణబాబును పరామర్శించి, నాగ పోతురాజు మృతి పట్ల తన ప్రగాఢ సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



## సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత

- ఫిబ్రవరి 10 నుంచి ,23 మహాశివరాత్రి ఉత్సవాలు
- పెద్ద ఎత్తున సామాన్య భక్తులకు పెద్ద పీట వేస్తూ దర్శనం కల్పించేలా అన్ని చర్యలు
- జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్

**శ్రీకాళహస్తి, జనవరి 22, వుదయంప్రతినిధి:** గత సంవత్సరం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందని ఈ సంవత్సరం కూడా అదే తరహాలో బ్రహ్మోత్సవాలలో సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇస్తూ.. పటిష్టంగా ఏర్పాట్లు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. దేవస్థానం పాలక మండలి ఈ వో మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాలని, బ్రహ్మోత్సవాలలో వివిధ అవసరాలను వివరించి అధికారులకు ప్రత్యేక సూచనలు ఇవ్వాలని కలెక్టర్ ను కోరారు. ఆలయ తరపున సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యతవిస్తూ మంచి వాతావరణంలో దర్శన భాగ్యం కల్పించేలా అందరి సహకారంతో ముందుకెళ్లడం జరుగుతుందని తెలిపారు. సామాన్య భక్తులకు దర్శనం కల్పిస్తూ విఐపి లకు నిర్దేశించిన సమయాలను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. గురువారం స్థానిక శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలోని ఆలయ ఆవరణం లో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు – 2026 నిర్వహణపై వివిధ శాఖల సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్ , ఎస్.పి సుబ్బరాయుడు , ఆలయ ఈవో బాబిరెడ్డి, ఆలయ చైర్మన్ కొట్టె సాయి ప్రసాద్, ఆర్డీఓ శ్రీకాళహస్తి భాను ప్రకాష్ రెడ్డి, పాలక మండలి సభ్యులతో కలసి జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గత సంవత్సరం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందని, ఈ సంవత్సరం కూడా బ్రహ్మోత్సవాలు అన్ని శాఖల సమన్వయంతో కొత్తగా ఏర్పాటు అయిన బోర్డు సభ్యులు సహకారం, సలహాలతో నిర్వహించేలా ఏర్పాట్లు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ ఫిబ్రవరి 10 వ తేదీ నుండి ఫిబ్రవరి 23 వ తేదీ వరకు అన్ని ఏర్పాట్లపై ఈ రోజు చైర్మన్, ఆలయ ఈ ఓ , కొత్తగా నియమితులైన 17 మంది బోర్డు సభ్యుల ఆధ్వర్యంలో ఈ రోజు బ్రహ్మోత్సవాలపై సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలిపారు. శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్ పి గారు సూచనలు ఇవ్వడం జరిగిందని, వారి సూచనలకు అనుగుణంగా ఈ సంవత్సరం కొత్తగా ఏర్పాటైన ఆలయ బోర్డు ఏర్పాటు అయిందని, బ్రహ్మోత్సవాల్లో భాగంగా బోర్డు సభ్యులు ద్వారా కావలసిన అన్ని సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. గత సంవత్సరం లాగా ఈ సంవత్సరం కూడా ఘనంగా ఉత్సవాలు జరిగేలా సామాన్య భక్తులకు పెద్ద పీట వేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో నూతనంగా ఏర్పడ్డ ట్రస్ట్ బోర్డు సభ్యులు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పై సందర్భంగా సలహాలు, సూచనలు తెలియజేశారు. సమావేశ అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీ సుబ్బారాయుడు తో కలిసి శ్రీ కాళహస్తీశ్వర స్వామి, జ్ఞాన ప్రసూనాంబ దేవిని దర్శించుకొన్నారు.. దర్శనం అనంతరం ఆలయ ఈవో, చైర్మన్ తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాలు జిల్లా కలెక్టర్, ఎస్పీకి అందజేశారు. ఈ సమన్వయ సమావేశంలో పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, పోలీస్ అధికారులు అదనపు ఎస్పీ రవి మనోహరచారి, డీఎస్పీ, సంబంధిత జిల్లా అధికారులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## నేడు సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్ష

**ప్రొద్దుటూరు టౌన్, జనవరి 22, (వుదయం ప్రతినిధి)** నేతాజీ సోషల్ క్లబ్ కడప జిల్లా వారు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 129వ జన్మదినాన్ని పురస్కరించుకుని నేడు కడప జిల్లాస్థాయిలో పదో తరగతి విద్యార్థిని విద్యార్థులకు సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్ష కార్యక్రమాన్ని స్థానిక కృష్ణ దేవాలయం ఫంక్షన్ హాల్ నందు నిర్వహిస్తున్నట్లు నేతాజీ సోషల్ క్లబ్ జిల్లా కన్వీనర్ భాస్కరరావు తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రతిభా పరీక్షలో ప్రథమ బహుమతిగా రూ.5000 , రెండవ బహుమతిగా రూ.4000 , మూడో బహుమతిగా రూ.3000 రూపాయలు, 15 కన్సోలేషన్ బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతాజీ సోషల్ క్లబ్ అధ్యక్షులు గురుకుమార్ మాట్లాడుతూ ఈ ప్రతిభా పరీక్షలో జిల్లావ్యాప్తంగా ఇప్పటికే దాదాపు 150 మంది పాఠశాలల విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు తెలియజేశారు. సోషల్ క్లబ్ వ్యవస్థాపకులలో ఒకరైన మైలవరం ఎంఈఓ చిట్టిబాబు మాట్లాడుతూ పరీక్ష నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రోత్సాహకంగా ఒక రైటింగ్ ప్యాడ్ మరియు పెన్ అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి షాబుద్దీన్, జింకా సుబ్రహ్మణ్యం, నాగరాజు, కృష్ణ మోహన్ రావు, ఫయాజుద్దీన్, వన్నప్ప, సుబ్బయ్య, జమాల్ రెడ్డి పాల్గొన్నారు.



## స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న నాయకుడు కృష్ణారావు

### ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు

**అవనిగడ్డ జనవరి22 (వుదయం ప్రతినిధి):** విద్యార్థి దశలోనూ, యుక్త వయసులోనూ భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న మహోన్నత నాయకుడు ఎంవీ కృష్ణారావు అని ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, దివిసీమ గాంధీ స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం అవనిగడ్డ వంతెన సెంటరులో కృష్ణారావు విగ్రహానికి శత జయంతి కమిటీ ఆధ్వర్యంలో చైర్మన్ వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.మండలి వెంకట కృష్ణారావు శత జయంతి కమిటీ, గాంధీ క్షేత్రం, మండలి అభిమానుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, జనసేన ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గాజుల శంకరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, టీడీపీ టౌన్ అధ్యక్షులు అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, పీఏసీఎస్ చైర్మన్లు యలవర్తి చిన్నా, మాదివాడ రత్నారావు, యర్రంశెట్టి సుబ్బారావు, గాంధీ క్షేత్రం ప్రధాన కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, దివిసీమ లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మానేపల్లి కోటయ్య, గాంధేయవాది గరికపాటి సీతారామయ్య, ప్రముఖ న్యాయవాది బొప్పన వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు, దివిసీమ లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, టీసీ అధ్యక్షుడు రేపల్లె రవీంద్ర, దేవస్థానం డైరెక్టర్ అన్నపరెడ్డి వెంకటేశ్వరమ్మ, కూటమి నాయకులు బండే రాఘవ, బచ్చు శ్రీహరి, సిద్ధినేని అశోక్ నాయుడు, కమ్మిలి సాయిభార్గవ్, దేగల రాఘవ, పులిగడ్డ బాలు శ్రీనివాస్, లింగం బాబూరావు, సిద్ధాబత్తుల హరినాథ బాబు, అడపా వెంకటేశ్వరరావు, ముళ్లపూడి శ్రీను, బాలమ్మ, గరికపాటి హరిబాబు, చెన్ను గాంధీ, చెన్ను బాబూరావు, పుల్లగోరు రాజేంద్ర, మండలి రామ్మోహన రావు, భోగాది బాలకృష్ణ, గుగ్గిలం శ్యాంకుమార్, బడే సుబ్బారావు, షేక్ మొగల్ మురాద్ బేగ్, బాబావలీ, వాహేదుల్లా, గుడివాక నరహరి, బచ్చు ఆదినారాయణ, దామెర్ల సతీష్, యాసం శ్రీరాములు, మెగావత్ గోపి, మైలా హరిబాబు, కంచర్ల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల అంత్యక్రియలకు శ్రీ కంచి పరమేశ్వర రెడ్డి ఆర్థిక భరోసా



**ఆత్మకూర్ రూరల్ వు(దయం ప్రతినిధి) జనవరి 22వ తేదీ** ఆత్మకూరు మండల రూరల్ వ్యాప్తంగా పేదల కర్మకాండల నిమిత్తం రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేసిన శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, నిత్యాన్నదాత, శ్రీ కంచి పరమేశ్వర్ రెడ్డి . ఆత్మకూరు మండల పరిధిలోని పేద ప్రజలకు నిత్యాన్నదాతగా పేరుగాంచిన శ్రీ కంచి పరమేశ్వర రెడ్డి గారు మరో మానవతా సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. పేద కుటుంబాల్లో మరణించిన వారి అంత్యక్రియల నిర్వహణ కోసం రూ.10,000 ఆర్థిక సహాయం అందించనున్నట్లు ప్రకటించి, ఆ హామీని కార్యరూపంలోకి తీసుకొచ్చారు.ఆత్మకూరు మండలంలోని ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలు నిమిత్తం 10000 ఆర్థిక సహాయాన్ని అందజేయడం చాలా సంతోషంగా ఉంది. శ్రీ కంచి పరమేశ్వర రెడ్డి గారికి వారి గ్రామస్తుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



## మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

**విజయవాడ, జనవరి 22, వుదయం ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ 2026 డైరీ ఆవిష్కరణ గురువారం రాష్ట్ర రాజధాని అమరావతిలో జరిగింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమోహన్ ఆధ్వర్యంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ పి .సంపత్ కుమార్ లు వేరువేరుగా డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఉద్యోగుల సమస్యలను అసోసియేషన్ నాయకులు ఉన్నతాధికారులకు వివరించడంతో పాటు ఉద్యోగులకు ఇటీవల పదోన్నతులు కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాయుడు బాబు, కోశాధికారి వెంకటేష్, అసోసియేషన్ రాష్ట్ర నాయకులు నాయుడుపేట పురపాలక సంఘం మేనేజర్ ఉరుకుందమ్మ, పిడుగురాళ్ల పురపాలక సంఘం మేనేజర్ అభిదాబీ, మాచర్ల పురపాలక సంఘం మేనేజర్ చాంద్ బాషా, పుట్టపర్తి పురపాలక సంఘం రెవెన్యూ ఆఫీసర్ నరసింహులు, భీమవరం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## సిరివెన్నెల విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

### 25న అనకాపల్లిలో సీతారామశాస్త్రి విగ్రహం ఆవిష్కరణ



**అవనిగడ్డ జనవరి22 (వుదయం ప్రతినిధి):** ప్రముఖ సినీ గీత రచయిత పద్మశ్రీ సిరివెన్నెల సీతారామశాస్త్రి కాంశ్య విగ్రహావిష్కరణ ఈ నెల 25వ తేదీ అనకాపల్లిలో తానా సాహిత్య విభాగం తానా ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాదుకు ఆహ్వానం లభించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారంతో 25వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు అనకాపల్లి గాంధీ నగర్లో విగ్రహ ఆవిష్కరణ, సాయంత్రం 4గంటలకు పెంటకోట కన్వెన్షన్ సెంటర్లో సభా కార్యక్రమం ఏర్పాటు చేశారు. సభాధ్యక్షులుగా మాజీ మంత్రివర్యులు, అనకాపల్లి శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ, ముఖ్య అతిధిగా పార్లమెంట్ సభ్యులు, అనకాపల్లి రైల్వే స్టాండింగ్ కమిటి చైర్మన్ సిఎమ్.రమేష్, విగ్రహావిష్కర్తగా ప్రముఖ సినీ దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్, గౌరవ అతిధులుగా మాజీ డిప్యూటి స్పీకర్, అవనిగడ్డ శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్, తానా పూర్వాధ్యక్షులు (2011-2013), తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ ప్రసాద్ తోటకూర, తానా పూర్వాధ్యక్షులు (2021-2023) లావు అంజయ్య చౌదరి, జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు విచ్చేయనున్నారు.

## బీసీలపై వైసీపీ కక్ష

- అణచివేసేందుకే హత్యలు, ప్రత్యక్ష దాడులు
- జగన్ అండతోనే బరితెగింపు
- ఆప్కాఫ్ చైర్మన్ యాటగిరి రాంప్రసాద్

**కడప, జనవరి 22, (వుదయం ప్రతినిధి)** మొదటి నుంచి జగన్ కు, వైసీపీ నేతలకు బీసీలంటే గిట్టదని....అధికారంలో ఉన్నప్పుడు జగన్ అండతో పలువురు బీసీ నేతలను అత్యంత కిరాతకంగా హత్యలు చేయడంతో పాటు మరి కొందరిపై అక్రమ కేసులు బనాయించడం లాంటి చర్యలకు పాల్పడ్డారని.. అధికారం కోల్పోయమన్నా అక్కసుతో అదే ధమనకాండకు పాల్పడు తున్నారని ఆప్కాఫ్ (AFCOF)ఛైర్మన్ యాటగిరి రాంప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. విద్య, నైపుణ్యం, పారిశ్రామిక రాయితీ, ఆదరణ లాంటి పథకాలను రద్దుచేసి బిసిలకు తీరని అన్యాయం చేసిన బీసీ ద్రోహి జగన్ అని మండిపడ్డారు. బడుగు, బలహీన వర్గాలపై జగన్ అండతో హత్యలు, దాడులకు ప్రయత్నిస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని చట్టరీత్యా చర్యలు తీసుకొంటుందని స్పష్టం చేసారు. జగన్, ఆయన పార్టీని ప్రజలు ఎప్పటికి ఆదరించరని భూస్థాపితం కావడం తథ్యమని పేర్కొన్నారు.

## ఇబ్బందులకు గురి చేసే వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలి

### ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా మహిళా అధ్యక్షురాలు జ్యోతి



**కడప, జనవరి 22, (వుదయం ప్రతినిధి)** గిరిజనులైన తమ వారిపై దాడి చేయడమే కాకుండా తమను ఇబ్బందులకు గురి చేసే విధానాలపై పోలీసులు తక్షణ చర్యలు చేపట్టాలని ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా మహిళా అధ్యక్షురాలు జ్యోతి కోరారు.ఈ మేరకు ఆమె జిల్లా ఎస్పీని కలిసి తమ సమస్యను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 14వ తేది తమ వారిపై జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సోదరుడు శివ నారాయణరెడ్డితోపాటు మరికొందరికి ఈ సంఘటనతో సంబంధం ఉందన్నారు. తాము ఏ పార్టీకి చెందిన వారం కాదని, గిరిజన తెగకు సంబంధించిన వారమన్నారు. తమ వారిపై అకారణంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. ఈ విషయంగా బాధితులైన వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. ఈ విషయంగా తాను బా«ధిత వర్గం తరుపున జిల్లా ఎస్పీని కలిస్తే ఆయన జమ్మలమడుగు డీఎస్పీ, ఇతర పోలీసు అధికారులకు న్యాయం చేయాలని ఆదేశించారన్నారు. అయితే డీఎస్పీ, పోలీసు అధికారులు తమ పట్ల అనైతికంగా ప్రవర్తిస్తూ దుర్భాషలాడుతున్నారన్నారు. అన్ని విధాల వెనుకబడిన తమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహారించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తమకు న్యాయం చేయాలని మాత్రమే తాము కోరుతున్నామన్నారు. మధ్యలో వచ్చిన తనపై సైతం శంకర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డిలు లక్ష్యంగా చేసుకుని ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటాలు కొనసాగుతాయని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మాజీ సైనికుల ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు

**ప్రొద్దుటూరు, జనవరి 22, (వుదయం ప్రతినిధి)** డిఫెన్స్ ఎక్స్ సర్వీస్ మెన్ అసోసియేషన్ ప్రొద్దుటూరు డివిజన్ ఆధ్వర్యంలో సోమవారం గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని డివిజన్ ప్రెసిడెంట్ నెట్ల బాల వీరారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ హైస్కూలు గ్రౌండ్ కు చేరుకోవాలని ప్రార్థిస్తున్నాను .కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ హైస్కూలు గ్రౌండ్ లో జాతీయ జండా వందనం, గాంధీ రోడ్ లో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం, టీ బీ రోడ్ లో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం జనరల్ బాడీ సమావేశం నిర్వహించడం జరుగుతుందనీ వివరించారు. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, యర్రగుంట్ల, పరిసర ప్రాంత సైనికుల, మాజీ సైనికులకు పాల్గొనాలని కోరారు.

## విద్య బలమైన ఆయుధం

### మెటీరియల్, స్టేషనరి వితరణలో వక్తలు




**కావలి, జనవరి 22, వుదయం న్యూస్:** టి.వి.ఎస్. మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ తోట వెంకటేశ్వర్లు తన సొంత నిధులతో కావలి పట్టణంలోని కచేరిమిట్ట నందు మీకోసం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రాయపాటి దిలీప్ కుమార్ స్థాపించిన బ్లెస్స్ హోమ్ నందు చదువుతున్న విద్యార్థులకు (స్టేషనరి) 10వ తరగతి స్టడీ మెటీరియల్, ప్యాడ్లు, పెన్నులు, నోటు పుస్తకాలు మొదలగు వాటిని పంపిణీ చేయడం జరిగింది. గురువారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన దగదర్తి మండల విద్యాశాఖ అధికారి మంధా భాస్కరరావు, చైర్మన్ తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్య బలమైన ఆయుధమని విద్యార్థులు విద్య విలువ తెలుసుకొని, ఇచ్చిన ప్రతి వస్తువును సక్రమంగా వినియోగించుకొని, ముఖ్యంగా యు.టి.ఎఫ్ సంఘం యొక్క 10వ తరగతి మెటీరియల్ ను క్షుణ్ణంగా అభ్యసించి మంచి మార్కులు తెచ్చుకోవాలని విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో, సెక్రెటరి గాదిరెడ్డి హరినాథ్, మీకోసం స్వచ్ఛంధ సంస్థ' వ్యవస్థాపక అధ్యక్షులు రాయపాటి దిలీప్ కుమార్, రాచగిరి బాబ్జి, ట్రస్ట్ శ్రేయోభిలాషులు అమిరిశెట్టి హజరతయ్య, పి.వి.ఎన్ సుధాకరరావు, గుణకల శివయ్య, గాదిరెడ్డి మురళీకృష్ణ, ఎం. వి. ఎన్. ప్రసాదరావు, జాగో స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.కె. జమీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో జాతీయ భద్రత వారోత్సవాలు

**అవనిగడ్డ జనవరి22 (వుదయం ప్రతినిధి):** గురువారం ఏపీఎస్ఆర్టీసీ అవనిగడ్డ డిపోలో రెడ్ క్రాస్ సొసైటీ, అవనిగడ్డ వారి సౌజన్యంతో సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షల కార్యక్రమం నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో దంత వైద్యులు చేబ్రోలు హరిబాబు దంత వైద్య పరీక్షలు నిర్వహించగా పలువురు సిబ్బందికి పేస్టులు, బ్రష్ లు ఉచితంగా అందచేసినారు.. అదేవిధంగా వంగర శేషగిరిరావు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు.. డిపోలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు ఈ వైద్య పరీక్షలను వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమానికి రెడ్ క్రాస్ సొసైటీ అవనిగడ్డ శాఖ తరుపున వైస్ ప్రెసిడెంట్ గరికిపాటి హరిప్రసాద్, కోడూరు శ్రీనివాసరావు, వంగర శేషగిరిరావు పాల్గొన్నారు కార్యక్రమంలో ఏపీ ఎస్ఆర్టీసీ అవనిగడ్డ డిపో మేనేజర్ కే.హనుమంతరావు, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలక్ష్మి, సూపరింటెండెంట్ శ్రీధర్, యూనియన్ నాయకులు మరియు ఇతర కార్మికులు పాల్గొన్నారు.. ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పలువురు డిపో మేనేజర్ కె.హనుమంతరావుని అభినందించారు.




## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

### మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వరద



**ప్రొద్దుటూరు, జనవరి 22, (వుదయం ప్రతినిధి)** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాల రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని కామనూరు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, గ్రామ సర్పంచ్ షేక్ షమీం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారని వారు విద్యార్థుల కు నాణ్యమైన విద్యను అందించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.గురవి రెడ్డి, కడప జిల్లా ఏపీసి సమగ్ర శిక్ష యస్.ప్రేమంత్ కుమార్, ఎంఈఓ లు సావిత్రమ్మ సావిత్రమ్మ, శోభారాణి, తాసిల్దార్ గంగయ్య, నాయకులు నంద్యాల ఆనంద్ భార్గవ్ రెడ్డి, నంద్యాల హరినాథ్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లక్ష్మణ్, ఎంపీటీసీలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



"రాష్ట్ర గవర్నర్ రాజ్యాంగం నిర్దేశించిన తన విధులను, బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమవుతున్నారు. ప్రభుత్వం తయారు చేసిన పూర్తి ఉపన్యాసాన్ని చదవకుండా రాజ్యాంగాన్ని ఉల్లంఘించి, కేంద్ర ప్రభుత్వం చేతుల్లో తోలుబొమ్మలా వ్యవహరించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 176, ఆర్టికల్ 163 ప్రకారం, గవర్నర్ ప్రభుత్వం లేదా కేబినెట్ తయారు చేసిన ఉపన్యాసాన్ని చదవాలి. అందుకు విరుద్ధంగా ఆ ప్రసంగాన్ని విమర్శించడం కొన్ని భాగాలను వదిలేసి చదువడం వంటివి 176, 163 రాజ్యాంగ అధికరణలను స్పష్టంగా ఉల్లంఘించడమే. కనుక ఇది గవర్నర్ ఉపన్యాసం కాదు. రాజ్యాంగం ప్రకారం ఆయన తన విధులను నెరవేర్చలేదు. గవర్నర్ వైఖరికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్నాము, సుప్రీం కోర్టుకు వెళ్లవచ్చా లేదా అనే విషయాన్ని పరిశీలిస్తున్నాము."

సిద్దరామయ్య, కర్ణాటక మఖ్యమంత్రి

## వే'మన'పద్యం

తప్పు లెన్నువారు తండోపతండంబు
లుర్వి జనులకెల్ల నుండు తప్పు
తప్పు లెన్నువారు తమ తప్పు లెరుగరు!
విశ్వదాభిరామ! వినురవేమ!



## సంపాదకీయం

# పౌర హక్కులపై 'సర్' ప్రభావం

ఓటర్ల జాబితాల సమగ్ర సవరణ (సర్) ఒక ప్రహసనంగా మారిపోయిందని చెప్పడానికి అనేక ఉదాహరణలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సవరణ ప్రక్రియపై భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలు కేంద్ర ఎన్నికల సంఘానికి కనువిప్పు తేవాలి. ఓటర్ల జాబితాల సమగ్ర సవరణ అప్పటికే ఓటరు అయిన వ్యక్తి పౌర హక్కులపై తీవ్ర పరిణామాలు కలిగిస్తుంది. అందుచేత పారదర్శకమైన సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నుంచి ఎందుకు ఆశించకూడదు అని జస్టిస్ సూర్యకాంత్ గురువారం నాడు ఈ కేసు విచారణ సందర్భంగా అన్నారు. ఇందులో ఓటర్లసవరణ అంటే యధేచ్ఛగా ఓటర్లను తీసివేయడం, చేర్చడం కాదనే స్పష్టీకరణ ఉంది. అంతేకాదు. ఓటర్ల జాబితాల సవరణ విషయంలో ఎన్నికల సంఘానికి విస్తృత, తిరుగులేని అధికారాలున్నప్పటికీ అవి ఎదురులేనివి, సమీక్షకు అతీతమైనవి కావని కూడా సుప్రీం ధర్మాసనం బుధవారం నాడు తెలియజేసింది. పశ్చిమ బెంగాల్ సవరించిన జాబితాల్లో సహజమైన తేడాలు న్నాయని ఎన్నికల సంఘం చెప్పింది, అయితే ఇద్దరు ఓటర్లకు 200 మందికి పైగా పిల్లలున్నట్టు కూడా ఉంది, ఇది సైన్స్ కి విరుద్ధం అని చెప్పి కోర్టు ఇసి కి మొట్టికాయలు వేసింది. ఓటర్ల జాబితాలపై గంగా జలాలు జల్లి పవిత్రీకరించే సర్ కార్యక్రమాన్ని ఇ సి ఇంతవరకు 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో చేపట్టింది. తొలి దశ ఒక్క బీహార్ కే పరిమితం అయింది. అక్కడ ఎన్నికలకు ముందు సర్ ను చేపట్టడం తీవ్ర వివాదాస్పదం అయిన సంగతి తెలిసిందే. రెండో దశను 12 రాష్ట్రాలలో ప్రారంభించింది. ఒక్క రెండో దశలోనే 51 కోట్ల మంది ఓటర్ల జాబితాలను సవరించాలని ఉద్దేశించారు పౌరుల హక్కులకు భంగం వాటిల్లకుండా ఎప్పటికప్పుడు సుప్రీం కోర్టు దిశానిర్దేశం చేస్తున్నది. అయినా సవరించినట్టు చెబుతున్న జాబితాల్లో తప్పుల తడకలతో బాటు విస్మయ పరిచే విషయాలు చాలా ఉన్నాయి. ఒకే పేరు ఒకే అడ్రస్ తో అనేక చోట్ల దర్శనం ఇవ్వడం వంటివి సాధారణం.ఒక్కో రాష్ట్రంలో లక్షల సంఖ్యలో ఓటర్లను తొలగించారు. ఒక్క మధ్య ప్రదేశ్ లోనే 42.74 లక్షల ఓట్లను తొలగించారు. ఇందులో ఓట్లు గల్లంతైన వారి గోడు వినేది ఎవరు, వీరి అర్జీలను స్వీకరించడానికి ఇసి అంగీకరించింది. కాని అందులో సైతం అక్రమాలు ఎన్ని చోటు చేసుకొంటాయో! అడిగే వారికి చెప్పేవారు లోకువ, 10 కి పైగా సాక్ష్య పత్రాలు అడగడం వాటిని పూరించడం చేతకాక ఓటర్లు గందరగోళానికి లోను కావడం జాబితాల సవరణ విధిని తప్పనిసరిగా లోపభూయిష్టం చేస్తుంది. ఇది దేశ పౌరుల మీద చెప్పనలవి కాని దాడి. మధ్య ప్రదేశ్ లో రియాస్ ఖాన్ అనే వ్యక్తి వెళ్ళబుచుకొన్న గోడు ఇంతా అంతా కాదు. భోపాల్ లోని ఇత్వారా లో ఈయన కుటుంబం వందేళ్లుగా ఉంటున్నది. సవరించిన జాబితాలో ఈయన కుటుంబ సభ్యుల పేర్లు ఉన్నాయి గాని ఈయన పేరు గల్లంతు అయింది.

భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ చెప్పినట్టు పారదర్శకత లేని పనులు ప్రమాదకరమైనవి. ఈ ప్రక్రియను పూర్తి చేశామని చేతులు దులుపుకుంటే కుదురదు. ఈ పవిత్రీకరించిన జాబితాలలో ఓట్లు కోల్పోయిన వారి ఫిర్యాదులను పరిష్కరించడానికి ఏళ్ళు పూళ్ళు పట్టిపోతుంది. కోర్టుల్లో పడే కేసులను ఒక కొలిక్కి తేవడానికి ఎంత సుదీర్ఘ కాలం తీసుకొంటుందో చెప్పలేము. శాస్త్రీయత, పారదర్శకత లేని కృషి వికటిస్తుంది. ప్రజాస్వామ్యం నవ్వుల పాలవుతుంది.

## రచనలు పంపండి



వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# బంగారం ఎందుకిలా విర్రవీగుతోంది?

*బంగారం, వెండి ధరలు చుక్కలను దాటడానికీ, ప్రభుత్వాలు వాటి నిల్వలను సేకరించడానికీ కారణం డాలరేనా? అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మారకంగా డాలర్ అదృశ్యం కానుందా? అందుకు సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. బంగారు ధరలు చుక్కలనంటడానికి రిటైల్, వ్యవస్థాగత పెట్టుబడిదారులు ప్రధాన పాత్ర పోషించినప్పటికీ, కేంద్ర బ్యాంకులు స్థిరంగా బంగారాన్ని కొనుగోలు చేస్తుండడం ప్రధాన కారణమని చెప్పవచ్చు.*

అభివృద్ధి చెందిన దేశాలుగా నిన్నటి వరకూ చెలామణి అయిన అమెరికా, యూరోప్ దేశాలు ఆర్థిక సంక్షోభం దిశగా కదులుతున్నాయా? రష్యా- ఉక్రెయిన్ నేపథ్యంలో పాశ్చాత్య దేశాలు తీసుకున్న నిర్ణయాలే ఈ పరిస్థితికి కారణమా? రష్యా మీద గుడ్డి ద్వేషంతో వ్యవహరిస్తూ, అక్కడి నుంచి చౌకగా వచ్చే చమురు, గ్యాస్ సరఫరా చేసే పైప్‌లైన్ స్వయంగా ధ్వంసం చేసి, తమ తలకి తామే కొరివి పెట్టుకున్నాయా? ఒక్క ఇంధన లేమి కారణంగా జర్మనీ సహా పలు దేశాలలో పరిశ్రమలు మూతపడుతున్నాయి, ద్రవ్యోల్బణం తీవ్రంగా పెరిగిపోతోంది, ప్రజల జీవన పరిస్థితులు దుర్భరమవుతున్నాయి. నిన్నటి వరకూ యూరో, డాలర్ అండతో చెలరేగిపోయిన దేశాలు నేడు అప్పుల ఊబిలో కూరుకుని, తమ కరెన్సీ విలువను కోల్పోనున్నామనే విషయాన్ని గ్రహిస్తున్నాయా? అందుకే, ట్రంప్ అలా చెలరేగిపోతున్నారా?

బంగారం, వెండి ధరలు చుక్కలను దాటడానికీ, ప్రభుత్వాలు వాటి నిల్వలను సేకరించడానికీ కారణం డాలరేనా? అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మారకంగా డాలర్ అదృశ్యం కానుందా? అందుకు సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. బంగారు ధరలు చుక్కలనంటడానికి రిటైల్, వ్యవస్థాగత పెట్టుబడిదారులు ప్రధాన పాత్ర పోషించినప్పటికీ, కేంద్ర బ్యాంకులు స్థిరంగా బంగారాన్ని కొనుగోలు చేస్తుండడం ప్రధాన కారణమని చెప్పవచ్చు. పెరిగిన ధరల వద్ద కూడా, ప్రపంచవ్యాప్తంగా ద్రవ్య అధికారులు బంగారాన్ని సేకరించడాన్ని కొనసాగించడమన్నది, ఆర్థిక, భౌగోళిక రాజకీయ అనిశ్చితి పెరిగిన కాలంలో వ్యూహాత్మక మూల ఆస్తిగా బంగారం శాశ్వత పాత్రను నొక్కి చెబుతుంది. ఈ మార్పులో చెప్పుకోదగిన దేశాలు భారత్, చైనాలు. ఇరు దేశాలూ కూడా క్రమంగా యుఎస్ ట్రెజరీలను తగ్గించుకుంటూ, బంగారాన్ని సేకరించడంపై దృష్టిపెట్టారు. ఇది స్వల్పకాలిక పోర్ట్‌ఫోలియో సర్దుబాట్లకు బదులుగా రిజర్వ్ నిర్వహణా వ్యూహాలను తీవ్రంగా పునఃసమతుల్యం చేయడాన్ని సూచిస్తుంది.

### ఆర్‌బిఐ పాత్ర

యుఎస్ ప్రభుత్వ రుణం నుంచి వైవిధ్యీకరించుకో



వాలన్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కావాలని చేసుకున్న విధాన ఎంపిక భారతదేశంలో పరిణామం చెందుతున్న రిజర్వ్ నిధుల కూర్పును ప్రతిబింబిస్తుంది. కాగా, ఇటీవలే యుఎస్ ఆర్థిక శాఖ విడుదల చేసిన డాటా ప్రకారం, భారత్ వద్ద ఉన్న అమెరికా ట్రెజరీ నిల్వలు 200 బిలియన్ డాలర్లకన్నా తగ్గి, అక్టోబర్ 2025 నాటికి 190 బిలియన్‌లకు చేరుకుంది. ఇది, అంతకు ముందు సంవత్సరంలో ఉన్న నిల్వలతో పోలిస్తే 50.7 బిలియన్ డాలర్లు తగ్గడాన్ని ప్రతిఫలిస్తుంది.

ఇదే కాలంలో ఆర్‌బిఐ స్థిరంగా బంగారు సేకరణపై దృష్టి పెట్టింది. ఆర్‌బిఐ డాటా ప్రకారం, అక్టోబర్ 2025 నాటికి బ్యాంకు వద్ద 880.18 మెట్రిక్ టన్నుల బంగారు నిల్వలు ఉన్నాయి. విశేషమేమిటంటే, భారతదేశ మొత్తం విదేశీ మారక నిల్వలు 685 బిలియన్ డాలర్ల వద్ద స్థిరంగా ఉన్న సమయంలో ఈ పెరుగుదల కనిపించడం వెనుక ఉన్నది భవిష్యత్తు పట్ల అప్రమత్తతే. కాగా, ఆర్‌బిఐ ఈ నిర్ణయం, సైద్ధాంతికమైనదానికన్నా రిస్క్ మేనేజ్‌మెంట్‌కి సంబంధించిందని ఆర్థికవేత్తలు వాదిస్తున్నారు. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలపై విత్తపరమైన ఒత్తిళ్లు అంతర్జాతీయ బాండ్ రిటర్న్‌లను పెంచి, ట్రెజరీలలో ఉన్న నిల్వల విలువలను తగ్గించి, నష్టాలకు దారి తీసే అవకాశం ఉంది. ఈ రిస్కును పరిమితం చేసేందుకే కేంద్ర బ్యాంకులు బంగారం దిశగా వెడుతున్నాయి.

చైనాలో కూడా ఇదే విధానాన్ని అనుసరించడం గమనించినప్పుడు డాలర్‌కు ముప్పు వాటిల్లిందనే విషయం స్పష్టమవుతోంది. అక్కడి పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా గణాంకాల ప్రకారం, నెలనెలకూ బంగారం సేకరణను పెంచుకుంటూ ప్రస్తుతం 74.15మిలియన్ ఔన్సుల నిల్వలను సమకూర్చింది. ప్రస్తుతం అమెరికా ప్రభుత్వ బాండ్లు కలిగిన దేశాలలో అత్యధిక మొత్తమైన 1.2 ట్రిలియన్ డాలర్ల విలువైన బాండ్లను కలిగి ఉండగా, యుకె, బెల్జియం, ఫ్రాన్స్ , కెనెడా, యుఎఇ కూడా తగిన మొత్తంలో యుఎస్ బాండ్లను ఖరీదు చేశాయి. జపాన్ తర్వాతి స్థానంలో యుకె, చైనాలు ఉన్నా యి. కాగా, చైనా, బ్రెజిల్, భారత్, హాంగ్‌కాంగ్, సౌదీ అరేబియా ఏటికేడాది తమ బాండ్లను వదిలించుకోవడంలో నిమగ్నమై ఉన్నాయి. ప్రస్తుతం నెలకొన్ని భౌగోళిక రాజకీయ క్లిష్టపరిస్థితులు, ట్రంప్ పోకడలు, యుద్ధాలు, బ్రిక్స్ నానాటికీ బలపడే అవకాశాలు కనిపిస్తున్న నేపథ్యంలో డాలర్ విలువకు ముప్పు వాటిల్లుతుం దని పలువురు ఆర్థికవేత్తలు అంటున్నారు. ఈ నేపథ్యంలోనే భవిష్యత్ ప్రమాదాలు, పతనాల నుంచి తమను తాము కాపాడుకోవడానికి ప్రతి దేశం వెండి, బంగారు నిల్వలను ఉంచుకుంటోంది. భవిష్యత్తులో ఆ నిల్వలను బట్టే దేశ కరెన్సీకి విలువ ఉండే అవకాశం ఉంది. రేపటి రోజున వెండి, బంగారాలు, అరుదైన ఖనిజాల ఉనికే ఆయా దేశా ల కరెన్సీ విలువను బలపడేలా చేయనుందన్నది వాస్తవం.

# వైద్యులకు ప్రసార నియమాలు

ప్రజలకు వైద్యం చేసే డాక్టర్లు పాటించవలసిన నీతి నియమాలను ప్రభుత్వం 2002లో రూపొందించింది. అయితే ఈ ఇంటర్ నెట్ యుగంలో సోషల్ మీడియా వ్యాప్తిని దృష్టిలో పెట్టుకొని ఆగస్టు, 2023 లో డాక్టర్ల జాతీయ కమిషన్ వాటిలో కొన్ని మార్పులను చేపట్టింది. వాటి ప్రకారం - డాక్టర్లు సోషల్ మీడియాలో ప్రసారం చేసుకొనే వీడియోల్లో ఎలాంటి తప్పుడు సమాచారం ఉండకూడదు. రోగిని ఆశ గొలిపేలా లేదా బెదరగొట్టేలా మాట్లాడకూడదు. తమ వద్ద చికిత్స తీసుకున్న రోగి వివరాలు, లక్షణాలు బహిరంగ పరచకూడదు. మీడియా ప్రోగ్రాంలో ప్రశ్న వేసే వారి వివరాలు బయట పెట్టొద్దు. వారికి ప్రిస్క్రిప్షన్ మాదిరిగా వాడవలసిన మందులు ప్రోగ్రాంలో సూచించకూడదు. చికిత్స తీసుకోవాలంటే వ్యక్తిగతంగా కాని, ఆన్ లైన్లో గాని సంప్రదించమని మాత్రమే చెప్పాలి. రోగి ఫోటోలను, ఆయన మెడికల్ రిపోర్టులను తెరపై చూపించకూడదు. తమ పక్కన పేషంట్లను నిలబెట్టుకొని వారిచే డాక్టర్ చికిత్సపై అభిప్రాయాన్ని, వ్యాఖ్యానాలను కోరవద్దు. తమ చికిత్స ద్వారా ఆరోగ్యవంతులైన వారి ఫోటోలను, వారు రాసిన అభిప్రాయాలను తెరపై చూపవద్దు. తమకు తెలిసిన వైద్య విషయాలు, చికిత్సలో వస్తున్న నూతన విధానాలు ప్రజలకు విషయ పరిజ్ఞానం పెంచేందుకు చెప్పవచ్చు తప్ప ఇతర విషయాలు అందులో చేర్చవద్దు. వెబ్ సైట్లలోనే కాకుండా వ్యక్తిగత వాట్సాప్, ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్ లకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయి.

నేషనల్ మెడికల్ కమిషన్ మరియు దేశంలోని ఇండియన్ మెడికల్ అసోషియేషన్ శాఖలు వారి సభ్య వైద్యులు ఈ నిబంధనలు కచ్చితంగా పాటించేలా కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలున్నాయి. గీత దాటిన వారికి ఉల్లంఘన యొక్క స్వభావం, తీవ్రతలను బట్టి వివిధ రకాల జరిమానాలు ఉంటాయి. ఈ చర్యలు హెచ్చరికలు, జరిమానాలే కాకుండా సస్పెన్షన్ లేదా మెడికల్ లైసెన్స్ రద్దు దాకా వెళ్ళవచ్చు. ఈ నిబంధన అతిక్రమణ ఎవరి దృష్టికైనా వస్తే అందుబాటులో ఉన్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కు ఫిర్యాదు చేయవచ్చు. అయితే వీటి పట్ల డాక్టర్లు గాని, ప్రజలు గాని పెద్దగా ఆసక్తి చూపడం లేదు. చర్యలు చేపట్టిన దాఖలాలు కూడా తక్కువే. ఇద్దరు వైద్యుల ఫొటోలు, వారి ఫోన్ నంబర్లు ఇస్తూ ముంబైలోని హాస్పిటల్ 'టైమ్స్ ఆఫ్ ఇండియా' లో ప్రకటన ఇచ్చినందుకు ఆ వైద్యులకు ముంబై మెడికల్ కౌన్సిల్ నోటీసులు పంపింది. '40 ఏళ్లుగా దేశంలోనే అత్యంత నమ్మకమైన ఆరోగ్య సంరక్షణ ఇస్తున్నది' అని ఒక ప్రముఖ హాస్పిటల్ ఇచ్చిన పత్రికా ప్రకటనను చెన్నై మెడికల్ కౌన్సిల్ తప్పు పట్టింది. 2013 లో ఢిల్లీ మెడికల్ కౌన్సిల్ ఇలాంటి పత్రికా ప్రకటన్లను తప్పు పడుతూ అదే చోట అంతే సైజులో సవరణ ప్రకటనను ఆయా హాస్పిటళ్లతో ఇప్పించింది. ఆ ప్రకటనలో కనిపించిన డాక్టర్లపై చర్యలు చేపట్టింది. తమిళనాడు, మహారాష్ట్ర ప్రభుత్వాలు ఇలా వందకు పైగా డాక్టర్లపై చర్యలు తీసుకున్నాయి.

డాక్టర్లు మందులు, వైద్య పరికరాలకు చెందిన



వ్యాపార ప్రకటనల్లో పాల్గొనకూడదని వారి ప్రొఫెషనల్ కండక్ట్ లో ఉంది. డాక్టర్ యొక్క పేరు, సంతకం, ఫోటో వైద్య సేవల, ఉత్పత్తుల, ఆసుపత్రుల ప్రచారానికి వాడకూడదు. డాక్టర్ గది తలుపుకు ఉండే బోర్డుపై కూడా ఆయన పేరు, చదువు తప్ప ఫోటో ఉండకూడదు. ఇది వృత్తి పట్ల డాక్టర్లు పాటించవలసిన నీతికి సంబంధించిన విషయం. ఇలా నీతి నియమాలు ఎన్ని ఉన్నా వీటి ఉల్లంఘన ఏ స్థాయిలో జరుగుతుందో చెప్పనవసరం లేదు. ఈ మధ్య కొందరు మేము డాక్టర్లం అంటూ సంతాన ప్రాప్తి, మోకాళ్ళ నొప్పుల నివారణ కలిగిస్తామంటూ స్వయంగా ప్రకటనలిస్తున్నారు. టీవీల్లో ఎంతో కాలంగా వస్తున్న 'డాక్టర్ సలహాలు' కార్యక్రమాలు ఇప్పుడు వాణిజ్య ప్రకటనలుగా రూపాంతరం చెందాయి.

ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా సౌలభ్యంతో డాక్టర్లు స్వయంగా తమ వివరాలు తెలుపుతూ వీటి ద్వారా ఉధృతంగా ప్రచారం చేసుకుంటున్నారు. సొంత వెబ్ సైట్లు ఏర్పడ్డాయి. ఎవరిష్టమైన సమాచారం వారు పోస్టు చేసుకుంటున్నారు. కరోనా కాలం నుంచి ఆన్ లైన్ డాక్టర్ కన్సల్టేషన్ పెరిగిపోయింది. మాట్లాడేది మనం ఎంచుకున్న పేరు, అర్హతలు, అనుభవం గల డాక్టరేనా అనేది స్పష్టపడదు. ఇవేమి పట్టించుకోని విధంగా సోషల్ మీడియా ఫాలోయింగ్ పెరిగిపోతోంది. డాక్టర్, హాస్పిటల్ సైట్లో ఉండే వీడియోల్లో చెప్పే మాటల్లో నిజమెంతో గాని చూసి నమ్మేవారి సంఖ్య ఎక్కువే ఉంటోంది. అయితే ఈ విషయంలో అందరు డాక్టర్లను, మొత్తం సమాచారాన్ని తప్పు పట్టే అవకాశం లేదు. ఎందరో వైద్య నిపుణులు ప్రజలకు సరైన సమాచారం ఈయడానికి, చికిత్స విధానాన్ని తెలపడానికి, సర్జరీకి ముందు, తర్వాత జాగ్రత్తలు వివరించడానికి దీనిని వాడుతున్నారు. దీని వల్ల రోగికి ముందస్తుగా ఎన్నో వివరాలు తెలిసే అవకాశం ఉంటుంది. అయితే సందట్లో సడేమియాలా ఈ అవకాశాన్ని దుర్వినియోగ పరుస్తూ మాయమాటలు చెప్పేవారు కూడా డాక్టర్ల ముసుగులో ఎక్కువయ్యారు. ఒక ఆరోగ్య సమస్యపై గూగుల్ లో వెదికితే చాలు వాసన పట్టేసినట్లు అన్ని రకాల సామాజిక మాధ్యమాలు ఆ సమాచారంతో మన వెంట పడతాయి. ఇలా డాక్టర్ల నైతిక నిబంధనలకు, వర్తమాన నడవడికలు పొంతన కుదరకుండా పోయింది. సోషల్ మీడియా ఉధృతిని అడ్డం పెట్టుకొని వైద్యం పేరిట కోట్లాది రూపాయల దోపిడీ జరుగుతోంది. మాట్లాడే వారు డాక్టరా కదా తెలియదు. పంపే మందులు ఎలాంటివో తెలియదు. కనుక వైద్య వృత్తిలో ఉన్నవారు సొంత ప్రచారం కోసం అబద్దాలు ప్రచారం చేయవద్దు. మోడల్స్ గా పనిచేసేవారు టివి తెరపై డాక్టర్ల రూపంలో అబద్దాలు చెబితే వారిపై చట్టపర చర్యలు తీసుకోవాలి. సామాజిక మాధ్యమాల్లో వైద్య ప్రచారం కూడా సైబర్ నేరాల జాబితాలో చేరకుండా జాగ్రత్తలు అవసరం. దీనికోసం అసలైన వైద్యులు తమ నేటికా సూత్రాలను సరిగ్గా పాటిస్తే అంతా సర్దుకుంటుంది.



బి.నర్సన్
9440128169

# 'వరి'స్తే వదలరు : నలుపు ఎరుపు ధాన్యాలు

మోహన

దేశవ్యాప్తంగా 74 శాతం కంటే ఎక్కువ మంది మహిళలు వ్యవసాయ పనుల్లో ఉన్నారు. సగటున రెండున్నర ఎకరాల పొలంలో స్త్రీలు 557 గంటలు నాట్లు వేస్తారు. 640 గంటలు కలుపు తీస్తారు. 384 గంటలు నీటి పని చూస్తారు. 984 గంటలు కుప్పలేసి నూర్చుతారని ఒక సర్వే అంచనా. వ్యవసాయ పనులలో, ఆహారోత్పత్తిలోని అన్ని దశల్లోనూ నిత్యం చెమట చిందించే వారంతా మహిళా రైతులే. అయినా వీళ్లను రైతులుగా గుర్తించరు.ఒక రైతు కుటుంబం దగ్గరకు వెళ్లి, ఈ ఇంట్లో రైతు ఎవరని అడిగితే, ఆ ఇంటామె ఎంత శ్రమ చేసినప్పటికీ మగవాళ్లనే రైతులుగా చూపించడం కామన్. కానీ, జక్కుల తిరుపతి ఇంటికి వెళ్లి అడిగితే, తన భార్యే రైతు, నేను ఆమె దగ్గర కూలీని అని గర్వంగా చెబుతాడు. వరి అంటే పచ్చని పైరు, తెల్లని బియ్యమనే అందరికీ తెలుసు. కానీ, నల్లని, ఎర్రని పైరులు కూడా ఉన్నాయి. అరుదుగా పండిస్తున్నారు. ఈ బియ్యం వల్ల ఆరోగ్యానికి ఎన్నో లాభాలు ఉన్నాయట. అందుకే డిగ్రీ వరకు చదివిన జక్కుల రేణుక సిద్దిపేట జిల్లా, తొగుట మండలం లింగాపూర్‌లో 3 ఎకరాల్లో నల్ల వరిని సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్నారు.'' పంటలు వేసే ముందు, మా నేలను ప్రకృతి సాగుకు అనువుగా మార్చాం. భూమి లోపలి పొరలలో నివసించే వానపాములు, భూమి నుండి 3 మీటర్ల వరకు తొలచుకుంటూ వెళ్ళి, నేలల్లో బొరియలు చేస్తూ, మట్టిని తిరగతోడి నేలను గుల్ల పరుస్తాయి. దీనివల్ల వర్షం పడినపుడు నీరు పల్లానికి జారిపోకుండా పొలంలోనే ఇంకుతుంది. వానపాములు విసర్జించే వ్యర్థాలతో పంటలకు కావాల్సిన పోషక పదార్థాలు సమకూరుతాయి. అయితే రసాయనిక ఎరువులు విచ్చలవిడిగా వాడుతుండడంతో ఇవి కనుమరుగవుతున్నాయి. భూమిని సారవంతం చేసే ఇతర సూక్ష్మజీవులు కూడా నశించిపోతున్నాయి.అందుకే, మేం కెమికల్స్ జోలికి పోకుండా, పశువుల పేడ, మూత్రాన్ని సేకరించి అందులో శనగపిండి, బెల్లం కలిపి జీవామృతాన్ని తయారు చేసి, వారానికోకసారి పొలంలో చల్లుతున్నాం. దీని వాసనకు వానపాములు అభివృద్ధి చెందాయి. అవి, 90 శాతం మట్టిని 10 శాతం వ్యవసాయ వ్యర్థ పదార్థాలను ఆహారంగా తీసుకుంటాయి. వర్మీ కంపోస్టు వల్ల మిత్ర సూక్ష్మజీవులు పెరిగి భూమిలో సారం పెరుగుతుంది. దీంతో పంటలకు చీడపీడలను తట్టుకునే శక్తి ఎక్కువగా ఉంటుంది.'' అని భూసారం ప్రాముఖ్యతను వివరించారు రేణుక. కషాయాలు తయారు చేయడంలో ఆమె భర్త తిరుపతి ఆమెకు సహకరిస్తున్నారు. మూడు ఎకరాలు 51 రకాలు(సబ్ప్రస్తుతం నాలుగైదు రకాల పాలిష్ బియ్యానికే ప్రజలు అలవాటు పడ్డారు. ఫలానా బియ్యంతో వండితేనే ముద్ద దిగుతుందని చాలా మందంటారు. అయితే వరిలో 51 రకాల వంగడాలు పండిస్తున్నారు రేణుక. ఇందులో చాలావరకు నాటు రకం విత్తనాలే. రెండేళ్ల క్రితం ఆమె,'భారత్ బీజ్ స్వరాజ్' సంస్థ నుండి, కాలా బట్టి(నల్ల బియ్యం), చింతలూరు సన్నాలు, దశుమతి రకం, చిట్టి ముత్యాలు విత్తనాలను సేకరించి పండిరచింది. వాటికి డిమాండ్ ఏర్పడటంతో ప్రస్తుతం 3 ఎకరాలను చిన్న కమతాలుగా మార్చి 51 రకాల వరి విత్తనాలు అభివృద్ధి చేశారు. ఈ సాగు ఎక్కడ మొదలైంది?(సబ్ పూర్వం రైతులు, అవసరమైన పోషకాలు, ప్రత్యేక ఔషధ విలువలు కలిగిన ఆహార ధాన్యాలను సంప్రదాయ పద్ధతిలో సంకర పరిచి, తరతరాలుగా కాపాడారు. హరిత విప్లవంతో, అధిక దిగుబడినిచ్చే వంగడాలు అందుబాటులోకి రావడంతో, సంప్రదాయ వంగడాలు కనుమరుగయ్యాయి. అలాంటి వాటిలో 'నల్లధాన్యం' 'ఎర్రధాన్యం' ముఖ్యమైనవి. కరువు ప్రాంతాల్లో కూడా దిగుబడినివ్వడం వీటి ప్రత్యేకత. మొక్కలే కాదు, ధాన్యం కూడా కారు నలుపులో, ఊదా రంగులో ఉంటాయి. వండిన అన్నం కూడా అదే రంగులో రుచిగా ఉంటుంది. గంజి వార్చి తాగితే పోషకాలు అధికంగా అందుతాయి. మణిపూర్, బెంగాల్, అసోం, ఒడిశా రాష్ట్రాల్లో స్వల్ప విస్తీర్ణంలో ఈ పంటను సాగు చేస్తున్నారు. కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణల్లోనూ అక్కడక్కడా వీటిని సాగు చేయనారంభించారు. నాలుగు నెలల పంట (సబ్ )రెండేళ్ల నుంచి రేణుక ఈ రైస్‌ను శ్రీవరి విధానంలో సాగు చేస్తు న్నారు. సాధారణంగా వరికి ఒక ఎకరానికి 50 నుండి 60కిలోల విత్త నాలు అవ సరం. శ్రీ పద్ధ తిలో 2 కిలోల విత్తనం సరిపోతుంది. కలుపు నివారణ సులువు. ఎకరానికి 20 బస్తాల (75 కిలోలు) వరకు దిగుబడి వస్తోంది. పంటకాలం 4 నెలలు. సుగంధాన్నిచ్చే రైస్ , రెడ్ రైస్ (నవర)ను కూడా సాగు చేస్తున్నారు. ఉచితంగా విత్తనాలు : '' సాధారణ వరి రకాలను పోల్చితే సగం దిగుబడి మాత్రమే వచ్చే ఈ వంగడాన్ని అరుదుగా పండిస్తున్నారు. కాబట్టి డిమాండ్ పెరిగి, కిలో బియ్యం రూ.150 కి పైగా ధర పలుకుతున్నది. ఎక్కువ మంది రైతులు పండిస్తే ధర తగ్గుతుంది. ఆరోగ్యవంతమైన సమాజం కోసం అలాంటి వారిని ప్రోత్సాహించడానికి 50రకాల వరి విత్తనాలు ఉచితంగా అందజేస్తాను. 9000269724 నంబర్‌లో సంప్రదించవచ్చు.'' అన్నారు రేణుక.తమతో పాటు ప్రకృతి సాగు చేస్తున్న రైతులతో త్వరలోనే నాటు వరి విత్తనాల జాతరను నిర్వహించాలనుకుంటున్నామని ఆమె అంటారు. పొలంలో మొలకెత్తిన అక్షరాలు ఆకుపచ్చని కాన్వాస్ పై నల్లని అక్షరాలు రాసినట్టుగా, వరిసాగులో నల్లవిత్తనాలతో బొమ్మలు వేయడం, పేర్లు రాయడాన్ని టాన్‌బో ఆర్ట్ అంటారు. ఈ కళను జపాన్ దేశపు రైతులు కనిపెట్టారు. తెలుగురాష్ట్రాల్లో ఇప్పటి వరకు ఎవరూ ప్రయత్నించని ఈ కళను మొదటిసారిగా తన భర్త తిరుపతి సహకారంతో రేణుక తన వ్యవసాయ క్షేత్రంలో ప్రదర్శించారు. ప్రధాని మోడీ, సీఎం కేసీఆర్, పేర్లను వరి పంటలో నల్లవరినారు తో రాశారు. త్వరలో సేంద్రియసాగు సూత్రాలను రాసి రైతుల్లో అవార్‌నెస్‌కు తోడ్పతామని అంటున్నారు. మణిపూర్ సంప్రదాయ వైద్యంలో నల్ల బియ్యాన్ని ఔషధంగా వాడతారు. సామూహిక ఉత్సవాల్లో ఈ రైస్‌తో వండిన 'చాక్‌హావో' అనే వంటకాన్ని వడ్డిస్తారు. బ్లాక్ రైస్‌లో అనేక పోషక విలువలతోపాటు విశిష్ట ఔషధ గుణాలు ఉన్నట్టు పరిశోధనల్లో తేలింది. రోగనిరోధక శక్తిని పెంచడం, కేన్సర్‌ను నిరోధించడం ఈ బియ్యం ప్రత్యేకత.'' బ్రౌన్, రెడ్ రైస్‌తో పోలిస్తే బ్లాక్‌రైస్‌లో కాల్షియం, ఐరన్, మెగ్నీషియం ,విటమిన్ బీ, విటమిన్ ఈ, కాల్షియం, పీచు పదార్థాలు వంటి పోషకాల మోతాదు అధికంగా ఉంటుంది. నల్లబియ్యం పాలిష్ పడితే తెల్ల గానే ఉంటాయి. పైపొర తీయకుండా వండుకొని తింటే, గ్లైసిడిన్ తక్కువగా ఉండటం వల్ల షుగర్ పేషెంట్లకు కూడా మేలు చేస్తుంది.'' అంటారు, నల్గొండ జిల్లా, వరి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, డాక్టర్ సీహెచ్ దామోదర్‌రాజు. జీవామృతంతో సాగుచేస్తున్న నల్ల బియ్యం గంజిని ముఖానికి రాసు కుంటే మచ్చలు, మొటిమలు తగ్గుతాయని, తలకు పట్టిస్తే వెంట్రుకలు బలంగా, అందంగా తయారవుతాయని, గుండె సమస్యల పరిష్కారంలో బాగా పనిచేస్తాయని పౌష్టికాహార నిపుణులంటున్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని మరో 50 మంది రైతులు ప్రకృతి సేద్యం చేస్తున్నారు. రసాయనాలు లేని పంటలను సాగుచేసి, లింగా పూర్‌ని ప్రకృతి పంటల గ్రామంగా మార్చడమే లక్ష్యంగా, ప్రకృతి నుంచి అడవి.. అడవి నుంచి వ్యవసాయం...అక్కడి నుంచి ఆహారం ఆహారం నుంచి ఆరోగ్యవంతమైన సమాజం కోసం శ్రమిస్తున్న ఈ జంటకు వరి కంకులు వంగి సలాం చేస్తున్నాయి.

**ఆమె విజయ సేద్యం**






నిన్నే కాస్త ఆగు...
ఎందుకింత ఉరకలు?
ఒక్క క్షణం కురిసి,
అంతలోనే పరుగు తీసే వానవెల్లిలా!

నిలిచి చూడవా,
ఈ గుండె తడిసిపోకముందే?
ఏదో చెప్పాలనుంది...
కనీసం ఒక ఊపిరి తీసుకోవాలనుంది!

నీ భారం దిగమింగలేక,
గుండె వేడెక్కిన నిప్పులా మండిపోతుంది.
అయినా నువ్వు తడిపిన ప్రతి బొట్టూ,
ఒక గాథను చెబుతోంది.

ఎందుకింత తొందర?
రెండు కన్నీటి చుక్కలు చాలు...
ఈ ఆర్తిని ఆరబెట్టడానికి!
కాని, అర్థంలేని ఉప్పొంగే కెరటాలు,
గుండె తడిచేంతే తప్ప...
గాయాలను మోయలేవు!

- జ్యోతి మువ్వల



# జాతీయం-అంతర్జాతీయం



### లోయలో పడిన ఆర్మీ వాహనం..

## 10 మంది మృతి



జమ్మూకశ్మీర్‌లోని దోడా జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. భద్రతా సిబ్బంది వెళ్తున్న ఓ వాహనం అదుపు తప్పి లోయలో పడింది. ఈ ఘటనలో 10 మంది ఆర్మీ సిబ్బంది ప్రాణాలు కోల్పోగా మరి కొందరు గాయపడ్డారు. భదేర్వాహ్‌చంబా రోడ్డులోని ఖన్నీ పర్వత ప్రాంతంలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. లోయలో పడిపోయిన బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో 17 మంది భద్రతా సిబ్బంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. వెంటనే రంగంలోకి దిగిన ఆర్మీ, పోలీసులు సంయుక్తంగా రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. గాయపడిన వారిని ఉధంపూర్ మిలిటరీ ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు పేర్కొన్నారు.

## ముంబయి మేయర్ పదవి మహిళకే

### గందరగోళానికి దారితీసిన లాటరీ



ముంబయికి ఓ మహిళ మేయర్‌గా రానున్నారు. అయితే ఈ ఎంపిక ప్రక్రియ మాత్రం వివాదాస్పదమైంది. ఈ పోస్ట్‌ను ఏ కేటగిరీకి కేటాయించాలనే దానిపై లాటరీ తీశారు. ఫలితాల్లో 'జనరల్ మహిళ' కేటగిరీ ఎంపికైంది. ఈ లాటరీ ప్రక్రియ, ఫలితంపై ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన అభ్యంతరం వ్యక్తంచేసింది. ఇది గందరగోళ పరిస్థితులకు దారితీసింది. మేయర్ పదవిని ఏ కేటగిరీకి కేటాయించాలనే దానిని నిర్ణయించేందుకు రాష్ట్రప్రభుత్వం లాటరీ సిస్టమ్‌ను అనుసరిస్తుంది. డ్రా పూర్తయిన తర్వాత బీఎంసీలోని అర్హులైన కార్పొరేటర్లు నామినేషన్లు వేసేందుకు వీలవుతుంది. ఈ లాటరీ ప్రక్రియ తర్వాత పుణె, ధూలే, బీఎంసీ, నాందేడ్, నవీ ముంబయి, మాలేగావ్, మీరా భయందర్, నాసిక్, నాగ్‌పూర్ మేయర్ పోస్టులు మహిళలకు రిజర్వ్ అయ్యాయి. అయితే ముంబయి మేయర్ పదవిపై మాత్రం ఉద్ధవ్ శివసేన అభ్యంతరం వ్యక్తంచేసింది. బీఎంసీని (ముంబయి) ఓబీసీ కేటగిరీ కింద ఎందుకు పరిగణించలేదని మాజీ మేయర్ కిశోరి ఫడ్నేకర్ ప్రశ్నించారు. గతంలో రెండు దఫాలు కూడా ఈ పోస్టు ఓపెన్ కేటగిరీలోనే ఉందని గుర్తుచేశారు.

## ప్రపంచంలో రెండో అత్యంత ట్రాఫిక్ రద్దీ నగరంగా బెంగళూరు



గత ఏడాదికి సంబంధించి ప్రపంచంలోనే అత్యంత ట్రాఫిక్ రద్దీ నగరంగా మెక్సికోలోని మెక్సికో సిటీ నిలిచింది. రెండో స్థానంలో కర్ణాటక రాజధాని బెంగళూరు ఉంది. ఈ నగరంలో 10 కిలోమీటర్ల ప్రయాణానికి సగటున 36 నిమిషాలకు పైగా సమయం పట్టినట్లు 'టామ్‌టామ్ ట్రాఫిక్ సూచీ2025 'లో వెల్లడైంది. డబ్లిన్ (ఐర్లాండ్), లోడ్జ్ (పోలండ్), పుణె (భారత్)లు టాప్5లో ఉన్నాయి. బెంగళూరులో సగటు రద్దీ స్థాయి 74.4 శాతంగా నమోదైంది. 2024తో పోలిస్తే 1.7 శాతం పెరిగింది. వాహనదారులు 15 నిమిషాల్లో సగటున 4.2 కిలోమీటర్ల దూరం ప్రయాణించారు. 10 కిలోమీటర్ల ప్రయాణానికి సగటున 36 నిమిషాల తొమ్మిది సెకన్ల సమయం పట్టింది. అత్యంత రద్దీ వేళల్లో సగటు వేగం గంటకు 13.9 కిలోమీటర్లకు పడిపోయిందని నివేదిక పేర్కొంది. ముఖ్యంగా 2025 మే 17న బెంగళూరులో ట్రాఫిక్ పరిస్థితి దారుణంగా ఉందని, ఆ రోజు సగటు రద్దీ స్థాయి 101 శాతంగా నమోదైనట్లు నివేదిక తెలిపింది. సాయంత్రం 6 గంటల సమయంలో వాహనదారులు 15 నిమిషాల్లో 2.5 కిలోమీటర్లే ప్రయాణించినట్లు వెల్లడించింది. ఈ జాబితాలో ముంబయి (18), దిల్లీ (23), కోల్‌కతా (29), జైపూర్ (30), చెన్నై (32), హైదరాబాద్ (47) స్థానాల్లో నిలిచాయి. హైదరాబాద్‌లో గంటకు సగటు వేగం 18.4 కిలోమీటర్లుగా ఉందని నివేదిక పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 500 నగరాల్లో, 3.65 ట్రిలియన్ కిలోమీటర్లకుపైగా ప్రయాణ డేటా ఆధారంగా ఈ నివేదిక రూపొందించినట్లు సంస్థ తెలిపింది.

## నష్టాలను నమోదు చేయనున్న ఎయిర్ ఇండియా

### ఎయిర్ స్పేస్ మూసివేతలతో పురోగతి

### టాటా గ్రూప్, సింగపూర్ లిమిటెడ్‌ల మధ్య ఉమ్మడి వెంచర్



**న్యూఢిల్లీ, జనవరి 22 (వుదయం):** గత ఏడాది జరిగిన ఘోరమైన ప్రమాదం, ఎయిర్ స్పేస్ మూసివేతలతో తిరిగి పురోగతి సాధించడం క్లిష్టమైన తరుణంలో ఎయిర్ ఇండియా లిమిటెడ్ రికార్డు స్థాయిలో వార్షిక నష్టాన్ని నివేదించనున్నట్టు పేరు చెప్పడానికి ఇష్టపడని ఆ సంస్థ వర్గాలు వెల్లడించాయి.

టాటా గ్రూప్, సింగపూర్ ఎయిర్‌లైన్స్ లిమిటెడ్‌ల మధ్య ఉమ్మడి వెంచర్ అయిన ఎయిర్ ఇండియా వైమానిక సంస్థ మార్చి 31 నాటికి కనీసం 150 బిలియన్ రూపాయల నష్టాన్ని నమోదు చేయనుంది. భారత్‌తో సైనిక సంఘర్షణ అనంతరం భారతీయ విమానాలకు తమ ఎయిర్‌స్పేస్‌ను పాకిస్తాన్ మూసివేసిన కారణంగా కూడా ఆదాయాలు మరింతగా పడిపోయాయి. ఎయిర్‌స్పేస్ మూసివేత కారణంగా, యూరోప్, యుఎస్‌లకు వెళ్లేందుకు విమానాలు చుట్టు తిరిగి వెళ్లవలసి వచ్చిందని వారన్నారు.

నిజానికి, జూన్‌లో 240మంది వ్యక్తుల మరణానికి కారణమైన డ్రీమ్‌లైనర్ విమాన ప్రమాదానికి ముందు ఎయిర్ ఇండియా తిరిగి లాభాలలోకి వస్తోంది. అయితే ఈ ప్రమాదం ఏళ్ల పురోగతిని వృధా చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో కార్యకలాపాల బ్రేక్ ఈవెన్‌ను సాధించాలని వ్యవస్థాపకులు లక్ష్యంగా పెట్టుకున్నారు, కానీ లాభదాయకత అన్నది ఇప్పుడు అందని పండే అయిందని ఆ వ్యక్తులు పేర్కొన్నారు.

విమానం ఎక్కేందుకు ప్రయాణీకులు భయపడడం, విమానాల జాప్యం, పోటీ వైమానిక సంస్థ ద్వారా భారీ రద్దులు వంటి పరిణామాలతో కల్లోలభరితమైన ఏడాదిని చవి చూడటం వల్ల భారతీయ విమానయానం నష్టాలను చవిచూస్తోంది. నిజానికి పోటీ సంస్థల మధ్య చోటు చేసుకున్న పరిణామాలు ద్వయాధిపత్య మార్కెట్ వ్యవస్థను వెలుగులోకి తీసుకువచ్చింది.

కాగా, ఈ వార్తను బయటపెట్టిన ఎకనమిక్ టైమ్స్ పత్రిక దీని పై వివరణ కోరినప్పుడు ఎయిర్ ఇండియా, టాటా గ్రూప్, సింగపూర్ ఎయిర్‌లైన్స్ స్పందించలేదు.

కాగా, మేనేజ్‌మెంట్ సమర్పించిన నూతన పంచవర్ష ప్రణాళిక ప్రకారం లాభాలు మూడవ ఏడాది వస్తాయి. కాగా, లాభాలు సాధించేందుకు దూకుడైన చర్యలను కోరుతూ బోర్డు దీనిని తిరస్కరించింది. ప్రభుత్వానికి దాఖలు చేసిన వివరాలను సంకలనం చేసే వాణిజ్య నిఘా సంస్థ ప్రకారం గత మూడు సంవత్సరాలలో ఎయిర్ ఇండియా 322.1 బిలియన్ రూపాయలను నష్టపోయింది. తిరిగి ప్రారంభం చేసేందుకు కనీసం 100 బిలియన్ రూపాయలను వైమానిక సంస్థ గత ఏడాది కోరినట్టు వార్తలు వచ్చాయి.

పెరుగుతున్న నష్టాలు ఇరు యాజమాన్యాలకు ఆందోళన కలిగించే అంశమే. ప్రస్తుతం సిఇఒగా ఉన్న కాంప్‌బెల్ విల్సన్ స్థానంలో మరొకరిని నియమించేందుకు టాటా గ్రూప్ అన్వేషణ సాగిస్తోంది. కాగా, ప్రమాదానికి సంబంధించిన నివేదిక విడుదల అయ్యే వరకూ ఈ అన్వేషణ కొనసాగనుంది.

పునర్వ్యస్థీకరణ ప్రణాళికలో భాగంగా ఎయిర్‌క్రాఫ్ట్ నిర్వహణను అంతర్గతంగా చేసేందుకు ఎయిర్ ఇండియాకు తోడ్పడుతున్నప్పటికీ, వైమానిక సంస్థ పనితీరు కారణంగా తన స్వంత ఆదాయాలు పడిపోవడాన్ని సింగపూర్ ఎయిర్‌లైన్స్ లిమిటెడ్ చవి చూస్తోంది. ఈ సంస్థ 2024లో విస్తారాను ఎయిర్ ఇండియాలో విలీనం చేసిన తర్వాత 25.1 శాతం వాటాను కొనుగోలు చేసింది.

## 'రహస్య ఆయుధం' వాడాం: ట్రంప్

వెనెజువెలాపై మెరుపుదాడి చేసి ఆ దేశ నేత నికోలస్ మదురో, ఆయన భార్యను అమెరికా దళాలు నిర్బంధించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో అగ్రరాజ్యం ఓ రహస్య ఆయుధాన్ని ఉపయోగించినట్లు కథనాలు వచ్చాయి. ఈ అంశంపై ట్రంప్ తాజాగా స్పందించారు. సీక్రెట్ సోనిక్ వెపన్‌ను వినియోగించినట్లు ధ్రువీకరించారు. తమవద్దే ఈ తరహా శక్తిమంతమైన ఆయుధం ఉందని.. మరే దేశం వద్ద ఇలాంటి సాంకేతికత లేదని అర్థం వచ్చేలా వ్యాఖ్యలు చేశారు.

''మన దగ్గర ఎవరికీ తెలియని ఆయుధాలు ఉన్నాయి. వాటి గురించి ఎక్కువగా మాట్లాడకపోవడమే మంచిదని భావిస్తున్నాను. అదొక అద్భుతమైన దాడి'' అని ట్రంప్ ఓ మీడియా సంస్థతో మాట్లాడారు. మదురోను కస్టడీలోకి తీసుకునేందుకు నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో యూఎస్ అత్యంత శక్తిమంతమైన ఆయుధాన్ని వాడిందని ఇటీవల ఆ మాజీ అధ్యక్షుడికి అత్యంత సన్నిహితంగా పనిచేసిన గార్డ్ చెప్పిన వివరాలు ప్రపంచాన్ని ఆశ్చర్యపర్చాయి.

''మా ముక్కుల నుంచి రక్తం కారడం మొదలైంది. కొందరు వాంతులు చేసుకున్నారు. ఇంకొందరు నేలపై పడిపోయారు. ఆ సోనిక్ ఆయుధం ముందు మేం నిల్చోలేకపోయాం. అగ్రరాజ్యంతో పోరాడగలమని ఎవరైనా అనుకుంటే అది భ్రమే అవుతుంది'' అని ఆందోళన వ్యక్తంచేశాడు. ఓ మీడియా సంస్థ ప్రచురించిన ఈ వ్యాఖ్యలను వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. దాంతో ఈ ఆయుధం వార్తలు ప్రపంచం దృష్టిని ఆకర్షించాయి.

### ఈయూ దేశాలపై టారిఫ్‌లు..

## వెనక్కి తగ్గిన ట్రంప్



గ్రీన్‌లాండ్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆచితూచి అడుగులు వేస్తున్నారు. దాని స్వాధీనానికి బలప్రయోగం చేయబోమని దావోస్ వేదికగా చెప్పిన ట్రంప్.. తాజాగా సుంకాల విషయంలో వెనక్కి తగ్గారు. నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టెతో ద్వైపాక్షిక సమావేశం అనంతరం ట్రంప్ ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు.

గ్రీన్‌లాండ్ విషయంలో తమకు మద్దతు తెలపని ఈయూ దేశాలపై అదనపు సుంకాలు విధిస్తానని గతంలో ట్రంప్ బెదిరింపులకు పాల్పడ్డారు. దీన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు తాజాగా తన సొంత ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు. ''నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టెతో చాలా ఫలప్రదమైన చర్చలు జరిగాయి. గ్రీన్‌లాండ్, ఆర్కిటిక్ ప్రాంత భవిష్యత్తు ఒప్పందానికి ఓ ఫ్రేమ్‌వర్క్ రూపొందించాం. ఇది కార్యరూపం దాల్చితే అమెరికాతో పాటు నాటో మిత్ర దేశాలకు కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. అందుకే సుంకాలపై నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నాం. ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రావాల్సిన సుంకాలను విధించడం లేదు. 'గోల్డెన్ డోమ్' నిర్మాణం పైనా చర్చలు కొనసాగుతున్నాయి. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్‌లు దీనికి సంబంధించిన చర్చలు జరుపుతున్నారు'' అని ట్రంప్ పేర్కొన్నారు. సుంకాలు విధించబోనంటూ ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని డెన్మార్క్ విదేశాంగ మంత్రి లార్స్ లోకే రాస్‌ముసెన్ స్వాగతించారు. ఇది చాలా సానుకూలమైన పరిణామంగా పేర్కొన్నారు.

## ఒడిశాలో పొగాకు ఉత్పత్తుల నిషేధం



**భువనేశ్వర్, జనవరి 22 (వుదయం):** పొగాకు ఉత్పత్తులపై ఒడిశా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నికోటిన్ కలిగి ఉండే గుట్కా, పాన్ మసాలా, జర్దా, ఖైనీ వంటి ఉత్పత్తుల తయారీ, విక్రయం, నిల్వ, రవాణాపై రాష్ట్రవ్యాప్తంగా పూర్తి స్థాయిలో నిషేధం విధించింది. ఈ మేరకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని, పొగాకు రహిత రాష్ట్రంగా ఒడిశాను తీర్చిదిద్దేందుకు సహకరించాలని పౌరులకు విజ్ఞప్తి చేసింది. ఒడిశాలో 42 శాతానికి పైగా పౌరులు సిగరెటేతర పొగాకును వినియోగిస్తున్నట్లు ఓ సర్వేలో తేలింది. ఇది జాతీయ సగటు కంటే అధికం. ఈ నేపథ్యంలో ఒడిశా ప్రభుత్వం పౌరుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకుంది.

## 'టీమ్ ఇండియా' అని పిలవొద్దు



### సుప్రీంకోర్టు పిటిషన్

బీసీసీఐ నేతృత్వంలో ఏర్పాటైన జట్టును 'టీమ్ ఇండియా'గా అభివర్ణించకుండా ప్రసారభారతికి ఆదేశాలివ్వాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలాంటి పిటిషన్లతో కోర్టులపై భారం మోపొద్దంటూ పిటిషనర్‌కు చురకలంటించింది. న్యాయవాది రీపక్ కన్సల్ ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ప్రైవేటు సంస్థ అయిన బీసీసీఐ నేతృత్వంలోని జట్టును 'టీమ్ ఇండియా' 'భారత జాతీయ జట్టు' అని పిలవడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని పేర్కొన్నారు. దీనికి కేంద్రం నుంచి కూడా ఎలాంటి అనుమతులు లేవని వాదించారు. దీనిపై ధర్మాసనం అసహనం వ్యక్తంచేస్తూ.. పిటిషన్‌ను కొట్టివేసింది. 'మీరు ఇంట్లో కూర్చుని ఇలాంటి పిటిషన్లు తయారుచేస్తున్నారు. ఈ పేరుతో మీకు వచ్చిన సమస్య ఏంటి?' అని ధర్మాసనం న్యాయవాదిని ప్రశ్నించింది. దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ ప్రతిచోటా ఆ జట్టు ఆడుతున్న విషయాన్ని ప్రస్తావించింది. ఈ పిటిషన్ దాఖలు చేయడం కోర్టు సమయంతో పాటు మీ సమయాన్ని కూడా వృథా చేయడమేనని మండిపడింది.

## గాజా శాంతి మండలిని ప్రారంభించిన ట్రంప్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గాజా శాంతి మండలిని ప్రారంభించారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో దీనిని అధికారికంగా ప్రకటించారు. ''ప్రతిఒక్కరు ఈ మండలిలో భాగం కావాలని కోరుతున్నాను. ఐరాసతో సహా అందరితో కలిసి పనిచేస్తాను'' అని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. మండలి సభ్య దేశాల్లో పాకిస్థాన్ ఉండటం గమనార్హం. గాజా పునర్నిర్మాణాన్ని, పాలనను పర్యవేక్షించడం కోసం కొన్నిరోజుల క్రితం అధ్యక్షుడు దీని ఏర్పాటు గురించి ప్రకటన చేసిన సంగతి తెలిసిందే.

ఈ మండలికి ట్రంప్ ఛైర్మన్. ఆ హోదాలో ఆయన కొంత మంది సభ్యులను మాత్రమే నియమిస్తారని తొలుత అంతా భావించారు. కానీ ఇప్పటివరకు ఆయన 50 మందికిపైగా దేశాధినేతలకు ఆహ్వానాలు పంపారు. ఇందులో భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సహా పలు దేశాల అధినేతలు ఉన్నారు. ఐరాస స్థానంలో ట్రంప్ ఈ గాజా శాంతి మండలిని తీసుకువస్తున్నారనే చర్చ నడుస్తోంది. '''ఐరాస ఎంతో చేయాల్సి ఉందన్నది నా భావన. అలా చేసుంటే ఈ శాంతి మండలి అవసరమే ఉండేది కాదు'' అని ఆయన చేసిన వ్యాఖ్యలతో ఇది గాజాకు పరిమితమైన మండలి కాదన్న విషయం స్పష్టమవుతోంది. ఇందులో శాశ్వత సభ్యత్వం పొందాలనుకునే దేశం ఒక బిలియన్ డాలర్లు (రూ.9వేల కోట్లకు పైగానే) చెల్లించాల్సి ఉంటుంది.

**హమాస్‌కు వార్నింగ్..**

గాజా శాంతి మండలికి సంబంధించి ట్రంప్ ఆధ్వర్యంలో పలువురు నేతలు సంతకాలు చేశారు. వారిలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు.. మిలిటెంట్ గ్రూప్ హమాస్‌కు వార్నింగ్ ఇచ్చారు. ''వారు ఆయుధాలు విడనాడేందుకు అంగీకరించకపోతే.. వారి అస్తిత్వానికే నష్టం'' అని హెచ్చరించారు. ఇజ్రాయెల్‌హమాస్ మధ్య ట్రంప్ కుదిర్చిన 20 సూత్రాల కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగానే దీనిని ఏర్పాటు చేశారు.

## ప్రపంచ అప్పు మమ్మల్ని కలవరపెడుతోంది

### అశ్వినీ వైష్ణవ్

**దావోస్, జనవరి 22 :** అభివృద్ధి చెందిన దేశాల రుణభారం, అవి కుప్పకూలే అవకాశం భారత్‌కు ఆందోళన కలిగించే విషయమని అని నిన్నటికి నిన్న కేంద్ర రైల్వేలు, సమాచార, ప్రసార, ఎలక్ట్రానిక్స్, ఐటి మంత్రి అశ్విని వైష్ణవ్ దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో మాట్లాడుతూ అన్నారు. ముఖ్యంగా జపాన్ బాండ్లలో వచ్చిన పెరుగుదలను సూచిస్తూ ఆయన ఈ మాట అన్నారు.

భారత ప్రభుత్వ మనసులో సంపన్న ప్రపంచపు భారీ అంతర్జాతీయ రుణం, అది ఎలా ఆవిష్కృతమవుతుందో అనే ఆందోళన ఉందని, మంగళవారం నాడు జపాన్‌లో తాజాగా జారీ చేసిన బాండ్ల పరిస్థితిని చూశామని, ఒకవేళ భారీ స్థాయిలో జరిగితే, మా దేశంపై దాని ప్రభావం ఎలా ఉంటుందన్నది మాకు ఆందోళన కలిగించే అంశమని ఆయన అన్నారు. జపాన్ 40 ఏళ్ల బాండ్ల రిటర్నులు నాలుగు శాతం దాటింది, 2007 తర్వాత ఇదే అత్యధికం. ఒక ప్రభుత్వం సాధారణంగా రిజర్వ్ కరెన్సీలో పేర్కొన్న బాండ్లను జారీ చేయడం ద్వారా తీసుకున్న అప్పు మొత్తం ఆ స్థాయిని దాటడం గత మూడు దశాబ్దాలలో ఇదే తొలిసారి. ప్రణాళికాబద్ధంగా పన్నుల కోత, ప్రధాని సనై తకాయిచి ఎన్నికలకు ముందు విశ్వసనీయమైన నిధులు లేకుండా ఖర్చు చేయడం పెట్టుబడిదారులను కలవర పెట్టింది. జపాన్ వంటి సురక్షితమైన మార్కెట్లలో అధిక రాబడి భారత్ వంటి ఉద్భవిస్తున్న మార్కెట్లలో ప్రభుత్వ బాండ్లు, ఈక్విటీలను తక్కువ ఆకర్షణీయం చేసి, పెట్టుబడి బయటకు వెళ్లేలా చేస్తుంది. ముఖ్యంగా మార్కెట్ అస్థిరంగా ఉన్నకాలంలో ఇది జరుగుతుంది.



ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించేందుకు రానున్న ఐదేళ్లలో భారత్ 68 శాతం వృద్ధి సాధించగలదని వైష్ణవ్ విశ్వాసం వ్యక్తం చేశారు. ముఖ్యంగా, ప్రభుత్వ పెట్టుబడి, కలుపుకుపోయే వృద్ధి, ఉత్పత్తి, ఆవిష్కరణ, సరళీకరణలనే నాలుగు స్తంభాల పై నిలిచిన ప్రభుత్వ సంస్కరణలు దీనిని సాధ్యం చేస్తాయన్నారు. మేం ఏర్పాటు చేసిన సాంకేతిక ఆధారంతో కలిపినప్పుడు రానున్న ఐదేళ్లలో 95 శాతం విశ్వసనీయ వ్యవధితో, భారత్ 68 శాతం వాస్తవ వృద్ధిని, 24 శాతపు ఒక మాదిరి ద్రవ్యోల్బణాన్ని, 1013 శాతం నామమాత్రపు వృద్ధిని సాధించగలదని ఆయన అన్నారు.

అయితే, ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం భారత్‌కు పెద్ద సవాలు కాదని, అసలు సవాలు, 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు తలసరి ఆదాయాలను పెంచడం, సంస్కరణల వేగాన్ని నిర్వహించడమన్న హార్వార్డ్ ప్రొఫెసర్ గీతా గోపీనాథ్ అన్న మాటలు నూటికి నూరు శాతం వాస్తవం. భూసేకరణ, భూమికి సంబంధించి అస్పష్టమైన రికార్డులు, న్యాయవ్యవస్థలో సంస్కరణలు ఇందుకు అడ్డంకులు కాగలవంటూ ఆమె హెచ్చరించారు.

### కిలో పుట్టగొడుగులు

## రూ.లక్ష

మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు చెందిన దేవికాసింగ్ తన ఇంట్లో వెయ్యి చదరపు అడుగుల విస్తీర్ణాన్ని పూర్తిస్థాయి ఆధునిక వ్యవసాయ క్షేత్రంగా మార్చేశారు. హిమాలయాల వంటి చల్లటి ప్రాంతాల్లో పండే కీడాజడీ (కార్డిసెప్స్) అనే అరుదైన పుట్టగొడుగుల సాగుతో రూ.లక్షలు గడిస్తున్నారు. ఈ పంటకు అవసరమైన తక్కువ ఉష్ణోగ్రత, తేమ, లైటింగు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీలో మాస్టర్స్ డిగ్రీ చేసిన దేవిక బయోటెక్ రంగంలో కొంతకాలం పని చేశారు. ఆ అనుభవంతో ఈ ప్రయోగాన్ని చేపట్టి విజయవంతంగా కొనసాగిస్తున్నారు. ఇంటి గ్రౌండ్ ఫ్లోర్‌ను రూ.14 లక్షల ఖర్చుతో మినీ ల్యాబుగా మార్చా. ఏడాదికాలం పరిశోధన తర్వాత ఈ పుట్టగొడుగుల సాగు ప్రారంభించా'' అని దేవిక వివరించారు.

## పెంపుడు కుక్క కోసం స్టేడియం ఖాళీ

### ఆ వివాదాస్పద అధికారి మళ్లీ దిల్లీకి..!



వివాదాస్పద ఐఏఎస్ అధికారి సంజీవ్ ఖిర్వార్‌కు కీలక పదవి దక్కింది. ఆయన్ను దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (MCD) కమిషనర్‌గా నియమిస్తూ కేంద్రం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. పెంపుడు కుక్క కోసం స్టేడియం ఖాళీ చేయించిన వ్యవహారంలో ఆయన కొన్నేళ్ల క్రితం వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. సంజీవ్ 1994 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఆయన భార్య రింకూ దుగ్గా కూడా విశ్రాంత ఐఏఎస్ అధికారి. ఈ ఐఏఎస్ జంట తమ పెంపుడు కుక్కతో వాకింగ్ చేసేందుకు దిల్లీలోని త్యాగరాజ్ స్టేడియంను ఉపయోగించుకుందని 2022లో తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. వీరి ఆదేశాల మేరకు స్టేడియం నిర్వాహకులు నిర్ణీత సమయం కంటే ముందే క్రీడాకారులను బయటకు పంపేవారు. ఆ తర్వాత ఈ అధికారులిద్దరూ పెంపుడు కుక్కతో అక్కడికి చేరుకొని వాకింగ్ చేసేవారు. ఆ వ్యవహారంపై మీడియాలో కథనాలు రావడంతో కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. భార్యాభర్తలను వేర్వేరు ప్రాంతాలకు బదిలీ చేసింది. తర్వాత రింకూపై వేటు వేసింది. బలవంతంగా ఉద్యోగం నుంచి సాగనంపింది.

అప్పుడు సంజీవ్‌ను లద్దాఖ్‌కు బదిలీ చేసిన ప్రభుత్వం.. తాజాగా ఆయన్ను వెనక్కి రప్పించింది. ఎంసీడీ పాలనాపరంగా, ఆర్థికంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోంది. త్వరలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఈ నేపథ్యంలో సంజీవ్ నియామకం జరిగింది.

### కొండపల్లి–విజయవాడ రైల్వే ట్రాక్ వెంబడి

# మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టండి

- దక్షిణ మధ్య రైల్వే జీఎంను కలిసి విజ్ఞప్తి చేసిన విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్
- ఉపగ్రహ రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎంపీ వినతి



**విజయవాడ జనవరి 22 వుదయం న్యూస్ బ్యూరో:**– కొండపల్లి రైల్వే స్టేషన్ నుంచి విజయవాడలోని కృష్ణ మిల్క్ యూనియన్ వరకు రైల్వే ట్రాక్ వెంబడి మురుగునీరు, వర్షపు నీరు పేరుకుపోయే సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ కోరారు. ఈ మేరకు సికింద్రాబాద్ రైల్ నిలయంలో గురువారం ఎంపీ కేశినేని శివనాథ్, బిజెపి మైలవరం నియోజకవర్గ ఇన్చార్జి నూతలపాటి బాల కోటేశ్వరరావు , ఇతర నాయకులు అధికారులతో రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవను కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ కొండపల్లి–విజయవాడ మధ్య కీలకమైన రైల్వే కారిడార్ వెంబడి శాస్త్రీయ డ్రైనేజీ వ్యవస్థ, క్రాస్ డ్రైనేజీ నిర్మాణాలు, ఛానెల్ కనెక్టివిటీ లేకపోవడం వల్ల వర్షాకాలంలోనే కాకుండా స్వల్ప వర్షపాతం సమయంలో కూడా నీరు నిలిచిపోతుందని తెలిపారు. దీని కారణంగా కొన్ని ప్రాంతాల్లో గట్టు కోతకు గురవడం, ట్రాక్ బలహీనపడటం, భద్రతా కారణాలతో రైళ్ల వేగం తగ్గించడం వల్ల కార్యాచరణ జాప్యాలు జరుగుతున్నాయని వివరించారు. అంతే కాకుండా ట్రాక్‌కు సమీపంలోని నివాసితులు, పరిశ్రమలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నాయని పేర్కొన్నారు.

**సమగ్ర నీటి నిర్వహణ వ్యవస్థ**

కొండపల్లి పారిశ్రామిక ప్రాంతం నుంచి సరుకు రవాణా అధికంగా ఉండటం, ఈ లైన్ వ్యూహాత్మకంగా ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉండటాన్ని దృష్టిలో ఉంచుకుని, సమగ్ర నీటి నిర్వహణ వ్యవస్థను ప్రాధాన్యతపై చేపట్టాలని ఎంపీ కేశినేని శివనాథ్ విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించి మొత్తం విస్తరణపై సాంకేతిక అంచనా నిర్వహించి, డ్రైనేజీ ఛానెల్‌లు, కల్వర్టులు, లింక్డ్ అవుట్‌ఫ్లో వ్యవస్థలతో కూడిన నెట్‌వర్క్‌ను రూపొందించి అమలు చేయాలని కోరారు. అవసరమైతే స్థానిక మున్సిపల్, నీటిపారుదల శాఖలతో సమన్వయం చేసుకుని తగిన బడ్జెట్ కేటాయింపులు చేయాలని సూచించారు.

**శాటిలైట్ రైల్వే స్టేషన్ ఏర్పాటు**

అలాగే విజయవాడ రైల్వే స్టేషన్‌పై పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు శాటిలైట్ రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఎంపీ కేశినేని శివనాథ్ ప్రస్తావించారు. బల్బ్ లైన్ల సమీప ప్రాంతాల్లో విస్తారమైన ఓపెన్ ల్యాండ్ అందుబాటులో ఉండటం, ప్రధాన రహదారులు, ఎయిర్‌వేస్‌లకు అనుసంధానం ఉండటం, భవిష్యత్తులో అమరావతి కొత్త రైల్వే లైన్‌కు దగ్గరగా ఉండటం వంటి అంశాలను వివరించారు. ఈ ప్రాంతంలో హాల్ట్ లేదా ఉపగ్రహ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తే అమరావతి, ఔటర్ రింగ్ రోడ్ల వంటి మౌలిక సదుపాయాలకు మెరుగైన కనెక్టివిటీ లభిస్తుందని, అలాగే విజయవాడ ప్రధాన రైల్వే స్టేషన్‌పై ప్రయాణికుల రద్దీ తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో సి.ఎ.వో. ఆర్.ఎస్.పి సందీప్ కుమార్ జైన్, డి.జి.ఎమ్ ఉదయనాథ్ కోట్ల, సెక్రటరీ జి.ఎమ్. మల్లాది శ్రీనివాసరావు, వడ్లమూడి జగన్ మోహన్ రావు, జాలిపర్తి గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం

- విద్యారంగ సమస్యలపై పోరాటల్లో ముందుండాలి
- పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు



**కడప, జనవరి 22, (వుదయం ప్రతినిధి)** రాష్ట్రంలో వేలాది మంది పేద, బడుగు, వెనుకబడిన వర్గాల విద్యార్థులు పెండింగులో వున్న 7500 కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయాలనీ పి ఎస్ యు రాష్ట్ర కార్యదర్శి సుబ్బారాయుడు రాష్ట్ర ప్రభుత్వంను డిమాండ్ చేశారు.నంద్యాల జిల్లా కేంద్రంలో పి ఎస్ యు విద్యార్థి సంఘం లో చేరిన వారికి కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్ కోసం నెలల తరబడి ఎదురు చూస్తున్నా, కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది అన్నారు. విద్య హక్కును కాలరాస్తూ, పేద విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని మండిపడ్డారు.ఫీజులు చెల్లించలేక విద్యార్థులు కాలేజీల యాజమాన్యం తో ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. అలాగే చదువు మానేసే పరిస్థితులు ఏర్పడుతున్నా ప్రభుత్వానికి కనీస స్పందన లేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ గాలికి వదిలేసి, విద్యపై ఖర్చును తగ్గించడం దుర్మార్గమైన పాలనకు నిదర్శనం అన్నారు.పేద విద్యార్థులపై అధిక ఫీజుల భారం మోపడం అన్యాయం. ఫీజు రియాంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకుండా కాలయాపన చేయడం దారుణం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వంమేల్కొని పెండింగ్‌లో ఉన్న మొత్తం ఫీజు రియాంబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థుల హక్కుల కోసం జరిగే ప్రతి పోరాటంలో పీఎస్‌యూ ముందుండి పోరాడుతుందని హెచ్చరించారు. అలాగే పి ఎస్ యు నంద్యాల జిల్లా కన్వీనర్ గా సురేష్ సభ్యులుగా 10 మందిని ఎన్నుకున్నారు.



## పరామర్శతో వెల్లువెత్తిన అభిమానం

### నేతలు, అభిమానులతో నిండిన మాజీ ఎమ్మెల్యే నివాసం

**కావలి, జనవరి 22, వుదయం న్యూస్:** కావలి మాజీ శాసన సభ్యులు, వైసిపి నియోజకవర్గం ఇంచార్జీ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి నివాసం రెండవ రోజు గురువారం అభిమానులు, నేతలు, ప్రముఖులతో వెల్లువెత్తింది. గుండె శస్త్రచికిత్స చేయించుకుని ప్రజల సందర్శనార్థం కావలి పట్టణానికి విచ్చేసిన రెండవ రోజు కూడా అశేష జన సమూహము ఆత్మీయ అభిమానుల తో వారి ఇంట నెలకొని ఉన్న దృశ్యాలు చూచినట్లయితే తమ అభిమాన ప్రజానాయకుడు అనారోగ్య కారణాల వలన అందుబాటులో లేక హృద్రోగ శస్త్ర చికిత్స చేయించుకుని వచ్చారని తెలిసి తండోపతండాలుగా వారిని దర్శించుకునేందుకు రావడం జరిగింది. సందర్భంగా మాజీ ఎమ్మెల్యే , రాష్ట్ర వైసిపి ఇసి మెంబర్ కాటమరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, నెల్లూరు రూరల్ వైసీపీ ఇంచార్జ్ ఆనం విజయ కుమార్ రెడ్డి, వారి సతీమణి నెల్లూరు జిల్లా పరిషత్ చైర్మన్ ఆనం అరుణమ్మ మరియు మాజీ కార్పొరేటర్ మదన్ మోహన్ రెడ్డి, వైసీపీ నాయకులు కార్యకర్తలు విచ్చేసి తమ అభిమానాన్ని కనపరచి పరామర్శించారు. వారి ఇల్లు నేడు జనసంద్రమైంది.నిజమైన ప్రజానాయకుడు అంటే ఇలా ఉంటాడు అనే సంఘటనను నేడు చూసినట్లయితే అస్మ దీయులు దీవులు కి కూడా అర్థమవుతుంది, చిన్నారుల నుండి యవనస్తుల నుండి పెద్దల సైతం గుర్గురువులు సతీ సమేతంగా వారిని ఆశీర్వదించడానికి బహు దూరం నుండి వచ్చి వారి ఆత్మీయతను చూపుతూ పలకరించి దీవించిన విధానం ఎంతైనా గొప్పది అని, నిజమైన స్వచ్ఛమైన శ్వేత సౌధం ల మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి నివాసం నిలిచిన వైనం కనిపించింది.



## జాతీయ సమ్మెను జయప్రదం చేయండి

**కోదాడ జనవరి 22(వుదయం)** ఆర్టీసీ రక్షణ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె లో ఆర్టీసీ కార్మికులందరూ పాల్గొనాలని స్టాఫ్ & వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి కె ఎస్ రెడ్డి అన్నారు. కొట్లాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాపాడుకోవాలని, ఆర్టీసీ కార్మికులకు వేతన సవరణ చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర కమిటీ డిమాండ్ డే పిలుపులో భాగంగా కోదాడ కు హాజరై అనంతరం జరిగిన డిపో కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్ లు గా మార్చి కార్మిక హక్కులను హరించిందన్నారు. అనంతరం డిపో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. డిపో,అధ్యక్ష కార్యదర్శులుగా సతీష్,సోమయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో రీజియన్ కార్యదర్శి బత్తుల సుధాకర్, డిపో నాయకులు శ్రీదేవి, నాగమణి, వెంకటేశ్వర్లు, సరోజన, శ్రీనివాస్, డి ఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఐదు రోజుల పని దినాల అమలుకు..

### కోదాడలో బ్యాంకు ఉద్యోగుల బైక్ ర్యాలీ




**కోదాడ జనవరి 22(వుదయం)** ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో వారానికి ఐదు రోజుల పని దినాలను తక్షణమే అమలు చేయాలని కోరుతూ కోదాడలో అన్ని బ్యాంకుల యూనియన్లు పట్టణంలో భారీ బైక్ ర్యాలీ ప్రదర్శన చేపట్టారు. గురువారం సాయంత్రం స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) ప్రధాన శాఖ ఎదుట వివిధ బ్యాంకుల ఉద్యోగులు, సిబ్బంది పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఐదు రోజుల పని దినాల డిమాండ్ ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉందని, కేంద్ర ప్రభుత్వం దీనిపై మొండి వైఖరి వీడాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బ్యాంకుల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, దీనివల్ల ఉన్న ఉద్యోగులపై పని ఒత్తిడి విపరీతంగా పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి, కొత్త నియామకాలు చేపట్టాలని వారు కేంద్రాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఈ నిరసన కార్యక్రమంలో మేనేజర్ శివకుమార్, చీఫ్ మేనేజర్ వీరస్వామి, వెంకటరత్నం, ఉమా మహేష్, చిట్టిబాబు, రాము, నందన్ రెడ్డి, సౌజన్య, రమ్య, సాయి వివిధ బ్యాంకుల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు. పాల్గొన్నారు.

## మధిర డిపోలో జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాలు



**మధిర,జనవరి 22,(వుదయం ప్రతినిధి)** మధిర డిపో లో జాతీయ రోడ్డు భద్రతా మహోత్సవాలు నిర్వహించారు.మధిర డిపోలో గురువారం నాడు ప్రమాద రహిత డ్రైవర్ ఉద్యోగుల అయినడి. శ్రీనివాసరావు,జి. మురళీ బాబు, కేఎస్ రాజు లను సన్మానించడం జరిగింది.సన్మాన సభకు వరప్రసాద్ ఎంవిఐ వైరా,సురేష్,సిఐ ఆఫ్ పోలీస్ ముఖ్య అతిథులుగా హాజరు అయ్యి, ప్రమాద రహిత డ్రైవర్స్ కు సన్మానిచడం జరిగింది. మరియు రోడ్డు భద్రత మాసోత్సవాల పై ఎస్ఎఫ్ ఎస్ స్కూల్ నందు వ్యాస రచన పోటీ నిర్వహించడం జరిగింది. ఈ వ్యాస రచన పోటీలో, మొదటి బహుమతి ఎస్.కె. బషీరుద్దీన్ 9వ తరగతి,రెండవ బహుమతి నాగపూర్ణిక 9వ తరగతి, మూడవ బహుమతి వెంకట్ లాస్య 9వ తరగతి బహుమతులు పొందారు.ఈ కార్యక్రమంలో మధిర డిపో మేనేజర్ ఆర్. రామయ్య డిపో సిబ్బంది పాల్గొన్నారు.

## గజ్వేల్ మున్సిపల్ పీఠం గులాబీదే.. గజ్వేల్ గడ్డ కేసీఆర్ అడ్డా

### గజ్వేల్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి



**గజ్వేల్, జనవరి 22 (వుదయం ప్రతినిధి)** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో గజ్వేల్ మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని, గజ్వేల్ గడ్డ ఎప్పటికీ కేసీఆర్ అడ్డానే అని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో గురువారం పార్టీ శ్రేణులతో జరిగిన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. గజ్వేల్ నియోజకవర్గంలో కేసీఆర్ గారు చేసిన అద్భుతమైన అభివృద్ధిని ప్రజలు మర్చిపోలేదని అన్నారు. ఒకప్పుడు వెనుకబడిన గజ్వేల్‌ను దేశం గర్వించే స్థాయికి తీసుకెళ్లిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని కొనియాడారు. ఈ అభివృద్ధిని చూసి ప్రజలు మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు.రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. అధికారం చేపట్టి రెండు ఏళ్లు గడుస్తున్నా, గజ్వేల్‌లో కానీ, రాష్ట్రంలో కానీ కొత్తగా జరిగిన అభివృద్ధి ఏమీ లేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, ప్రజల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ వైఖరిని గమనిస్తున్న ప్రజలు ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని, గజ్వేల్ మున్సిపల్ పీఠాన్ని మరోసారి బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని వంటేరు ప్రతాప్ రెడ్డి స్పష్టం చేశారు. కార్యకర్తలు ఏమాత్రం తగ్గకుండా క్షేత్రస్థాయిలోకి వెళ్లి కేసీఆర్ చేసిన అభివృద్ధిని ఇంటింటికీ వివరించాలని ఆయన పిలుపునిచ్చారు.

## విద్యారంగ అభివృద్ధికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెద్దపీట



**సిద్దిపేట, జనవరి 21 (వుదయం ప్రతినిధి)** తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ బలోపేతానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్దిపేట మండలం మిట్టపల్లి గ్రామంలోని గురువారం తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అడ్మిషన్ల ప్రక్రియను ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అత్తు ఇమామ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని, అందులో భాగంగానే విద్యార్థుల సంక్షేమం కోసం హాస్టల్ మెస్ మరియు కాస్మోటిక్ చార్జీలను భారీగా పెంచినట్లు గుర్తుచేశారు. తల్లిదండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని, అక్కడ నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల వసతులు అందుబాటులో ఉన్నాయని ఆయన పిలుపునిచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బకాయిపడిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్నారని అత్తు ఇమామ్ కొనియాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదివి తమ తల్లిదండ్రులకు మరియు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రియాజ్, తప్పేట శంకర్, గ్యాదరి మధు, గయాసుద్దీన్, నజ్జు, ఫయాజ్, బాబా ఫరీద్, సాదిక్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అదుపుతప్పి ఇంట్లోకి దూసుకెళ్లిన కారు



**బద్వేల్, జనవరి 22, (వుదయం ప్రతినిధి)** బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని వాసుదేవ హాస్పిటల్ పక్కన ఉన్న ఓ ఇంటిలోకి కారు దూసుకెళ్లింది. పద్మావతి హాస్పిటల్ రోడ్డు నుంచి నేరుగా వచ్చిన కారు ఇంటి గేటును బద్దలు కొట్టుకుంటూ లోపలికి ప్రవేశించింది. ఈ ఘటన ప్రమాదవశాత్తు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## పులిగడ్డలో రైతు శిక్షణా కార్యక్రమం

**అవనిగడ్డ జనవరి22 (వుదయం ప్రతినిధి):** పులిగడ్డ గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ అధ్యక్షతనఅవనిగడ్డ ఉద్యాన అధికారి యన్ .రమేశ్ పులిగడ్డ గ్రామములో రైతులకు శిక్షణా కార్యక్రమము నిర్వహించారు. ఆయిల్ పామ్ తోటల పెంపకంకి వందశాతం మొక్కలను పూర్తి ఉచితంగా అందచేస్తామని హెక్టరు కు రూ.5250 4 సంవత్సరాల అనంతరం పంటలకు 21000రూపాయలు అందజేస్తామని చెప్పారు.. అదేవిధంగా మామిడీ పూత సమయంలో ప్లానో ఫిక్స్ అనే మందును 10 లీటర్ల నీటికి 4మిల్లీ లీటర్లు 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసుకుంటే పూత మరియు పిందే రాలకుండా ఉంటుందని తెలిపారు. అదే విధంగా ఇమడ క్లోప్రైడ్ అనే మందును 10 లీటర్ల నీటికి 5 ఎంఎల్ చొప్పున పిచికారీ చేస్తే రసం పీల్చే పురుగులను అరికట్టవచ్చు అన్నారు.. వ్యవసాయ యంత్ర పరికరాలు బ్యాటరీ మరియు తైవాన్ స్ప్రేయర్స్, రొటోవేటర్ మరియు ఇతర వ్యవసాయ పనిముట్లను 50% సబ్సిడీ తో అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమములో అవనిగడ్డ వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, వుండవల్లి ఆగ్రోస్ మేనేజర్ హరి కృష్ణ మరియు రైతులు పాల్గొన్నారు.

## వీఆర్ఓపై వేధింపుల కేసు నమోదు



**చెన్నూరు, జనవరి 22, (వుదయం ప్రతినిధి)** కడప జిల్లా చెన్నూరు మండలంలో విధులు నిర్వహిస్తున్న వీఆర్ఓపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. ఆధార్ కార్డు సవరణ కోసం వీఆర్వో వద్దకు వెళ్లిన బాలికను పరిచయం చేసుకొని ప్రేమ పేరుతో వేధించాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత కుటుంబం ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామన్నారు.



## కోదాడ యూనిట్ కార్యాలయం గుడిబండకు త్వరలో మార్పు

**కోదాడ జనవరి 22(వుదయం)** కోదాడ రవాణా శాఖ యూనిట్ కార్యాలయాన్ని గుడిబండలో కేటాయించిన 2 ఎకరాల నూతన స్థలానికి తరలించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ స్థలాన్ని సూర్యపేట జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, కోదాడ డివిజన్ ఆర్డీవో, ఎమ్మార్వో సమన్వయంతో రవాణా శాఖకు కేటాయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ జిల్లా రవాణా అధికారి ఎస్. జయ ప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు గుడిబండలోని నూతనంగా కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వాహన తనిఖీ అధికారులు రాజా మొహమ్మద్, కె. శ్రీనివాసులు, అసిస్టెంట్ మోటార్ వాహన తనిఖీ అధికారులు సంపత్ గౌడ్, జి.ఆర్. చరణ్ పాల్గొన్నారు.కోదాడ మోటార్ వాహన తనిఖీ అధికారి జిలానీ షేక్ నూతన యూనిట్ కార్యాలయానికి కేటాయించిన భూమి వివరాలను వివరించి, స్థలాన్ని అధికారులకు చూపించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేందుకు ఈ స్థలం అనుకూలంగా ఉందని ఆయన తెలిపారు. ప్రస్తుతం తామరబండలో కొనసాగుతున్న కోదాడ రవాణా శాఖ యూనిట్ కార్యాలయం త్వరలోనే గుడిబండకు పూర్తిగా మారనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ మార్పుతో కోదాడ ప్రజలకు రవాణా సేవలు మరింత సులభంగా, సమర్థవంతంగా అందనున్నాయని తెలిపారు.

## క్యాన్సర్ చికిత్సలో విప్లవం..

### హైదరాబాద్ శాస్త్రవేత్తల అద్భుత ఆవిష్కరణ



**ఆత్మకూరు వు(దయం ప్రతినిధి) జనవరి 22వ తేదీ** క్యాన్సర్ చికిత్సలో హైదరాబాద్ శాస్త్రవేత్తల కీలక ముందడుగు బంగారు పూత పూసిన నానో కణాలతో నూతన చికిత్సా విధానం కాంతిని ఉపయోగించి క్యాన్సర్ కణాలను నేరుగా నాశనం చేసే టెక్నాలజీ ఈ విధానం ఫంగల్ ఇన్ఫెక్షన్లనూ నియంత్రిస్తుందని వెల్లడి క్యాన్సర్ చికిత్స రంగంలో హైదరాబాద్ శాస్త్రవేత్తలు సరికొత్త ఆవిష్కరణతో కీలక ముందడుగు వేశారు. చర్మ క్యాన్సర్ (మెలనోమా)ను దుష్ప్రభావాలు లేకుండా అత్యంత సమర్థవంతంగా నాశనం చేసే ఒక వినూత్న విధానాన్ని అభివృద్ధి చేశారు. ఐఐటీ–హైదరాబాద్ , సీఎస్ఐఆర్–ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ పరిశోధకులు సంయుక్తంగా ఈ ఘనత సాధించారు. ఈ నూతన విధానంలో బంగారు పూత పూసిన కాల్షియం పెరాక్సైడ్ నానో కణాలను ఉపయోగిస్తారు. వీటిని శరీరంలోకి ప్రవేశపెట్టినప్పుడు, అవి నేరుగా క్యాన్సర్ కణాలకు అతుక్కుంటాయి. ఆ తర్వాత ఫొటోథర్మల్ థెరపీ ద్వారా ప్రత్యేక కాంతిని క్యాన్సర్ ఉన్న ప్రదేశంపై ప్రసరింపజేస్తారు. దీనివల్ల నానో కణాల్లోని బంగారం వేడెక్కి విపరీతమైన ఉష్ణాన్ని పుట్టిస్తుంది. అదే సమయంలో కాల్షియం పెరాక్సైడ్ నుంచి ఆక్సిజన్ విడుదలై క్యాన్సర్ కణాలను మరింతగా దెబ్బతీస్తుంది.ఈ పద్ధతిలో ఆరోగ్యకరమైన కణాలకు దాదాపు ఎలాంటి నష్టం జరగదని శాస్త్రవేత్తలు తెలిపారు. బాధాకరమైన కెమోథెరపీ, సంక్లిష్టమైన శస్త్రచికిత్సల అవసరం లేకుండానే క్యాన్సర్‌ను నయం చేయడానికి ఇది దోహదపడుతుంది. అంతేకాకుండా, క్యాన్సర్ రోగుల్లో రోగనిరోధక శక్తి తగ్గడం వల్ల వచ్చే ఫంగల్ ఇన్ఫెక్షన్లను కూడా ఈ నానో కణాలు సమర్థవంతంగా ఎదుర్కొంటాయని తేలింది. ఐఐటీ హైదరాబాద్ బయోమెడికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన డాక్టర్ అరవింద్ కుమార్ రంగన్ నేతృత్వంలో ఈ పరిశోధన జరిగింది. ఎలుకలపై జరిపిన ప్రయోగాల్లో క్యాన్సర్ కణితుల పరిమాణం గణనీయంగా తగ్గిందని పరిశోధకులు గుర్తించారు. 'సియాసత్' డైలీ కథనం ప్రకారం, ఈ పరిశోధన వివరాలు ప్రఖ్యాత 'కమ్యూనికేషన్స్ కెమిస్ట్రీ' సైన్స్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

## రిక్షా పుల్లర్ బిడ్డ, జడ్జి బిడ్డ ఒకే స్కూల్లో చదవాలి సుప్రీంకోర్టు



**ఆత్మకూరు (వుదయం ప్రతినిధి) జనవరి 22వ తేదీ** దేశంలో విద్యా వ్యవస్థ ద్వారా రాజ్యాంగం ఆశించిన 'సౌభ్రాతృత్వం' లక్ష్యాన్ని సాధించే దిశగా సుప్రీంకోర్టు కీలక అడుగు వేసింది. ఒక రిక్షా కార్మికుడి పిల్లలు మల్టీ మిలియనీర్ లేదా సుప్రీంకోర్టు న్యాయమూర్తి పిల్లలతో కలిసి ఒకే తరగతి గదిలో చదువుకున్నప్పుడే అసలైన సామాజిక మార్పు సాధ్యమవుతుందని ధర్మాసనం స్పష్టం చేసింది. విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ) కింద ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పేద, వెనుకబడిన వర్గాల పిల్లలకు కేటాయించిన 25% ఉచిత సీట్ల అమలుపై విచారణ చేపట్టింది. ఇందుకు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చందుర్కర్‌లతో కూడిన ధర్మాసనం సారథ్యం వహించింది.

'ఒక ఆటో డ్రైవర్ లేదా వీధి వ్యాపారి బిడ్డ, ధనవంతుల బిడ్డతో కలిసి పాఠశాలలో ఒకే బెంచీపై కూర్చోవడం అనేది సహజమైన, నిర్మాణాత్మకమైన ప్రక్రియగా మారాలి. ఇది కేవలం ఒక సంక్షేమ పథకం కాదు. ఆర్టికల్ 21ఏ, 39(ఎఫ్) కింద దేశం చిన్నారులకు ఇచ్చిన హక్కు' అని కోర్టు పేర్కొంది. కులం, తరగతి లేదా ఆర్థిక స్థితిగతుల ఆధారంగా ఉండే 'అనుమానాస్పద గుర్తింపులను' పక్కన పెట్టి, విద్యార్థులు ఒకరితో ఒకరు మమేకంగా ఉండటానికి సెక్షన్ 12 దోహదపడుతుందని ధర్మాసనం వివరించింది.

**కొఠారి కమిషన్ నివేదిక ప్రస్తావన**

సమాజంలోని అన్ని వర్గాల పిల్లలు వివక్ష లేకుండా విద్యను అభ్యసించే సాధారణ పాఠశాల వ్యవస్థపై గతంలో కొఠారి కమిషన్ ఇచ్చిన నివేదికను కోర్టు ఈ సందర్భంగా గుర్తు చేసింది. పేద పిల్లలు ధనిక వాతావరణంలో ఇమడగలరా అనే సందేహాలను పక్కన పెట్టాలని, ఉపాధ్యాయులు ఆ పిల్లల నేపథ్యాలను ఒక వనరుగా మార్చుకుని వారి గౌరవాన్ని పెంచాలని సూచించింది.

**రాష్ట్రాలకు, ఎన్‌సీపీసీఆర్‌కు ఆదేశాలు**

విద్యా హక్కు చట్టం లోని సెక్షన్ 12(1)(సీ) కింద ఉన్న ఆదేశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడానికి తగిన నియమ నిబంధనలను రూపొందించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. చట్టంలోని సెక్షన్ 38 కింద ఉన్న అధికారాలను ఉపయోగించి, వెనుకబడిన, బలహీన వర్గాల పిల్లల ప్రవేశాలకు సంబంధించి అవసరమైన సబార్డినేట్ చట్టాలను సిద్ధం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. 'సమానత్వం, స్వేచ్ఛ అనేవి వ్యక్తిగత హక్కులు కావచ్చు. కానీ, సౌభ్రాతృత్వం అనేది సంబంధాలపై ఆధారపడి ఉంటుంది. ఇది సంస్థాగత ఏర్పాట్ల ద్వారానే సాధ్యమవుతుంది' ఈ నిబంధనల రూపకల్పన ప్రక్రియ కేవలం ఏకపక్షంగా సాగకూడదని, సంబంధిత విభాగాల భాగస్వామ్యం ఉండాలని కోర్టు సూచించింది. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్లు, జాతీయ, రాష్ట్ర స్థాయి సలహా మండలితో సమగ్రంగా సంప్రదించి విధివిధానాలను ఖరారు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేసింది.

**రిపోర్టింగ్, పర్యవేక్షణ**

ఈ ప్రక్రియ ఎంతవరకు వచ్చిందనే దానిపై సుప్రీంకోర్టు పర్యవేక్షణ గడువును విధించింది. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు జారీ చేసిన లేదా రూపొందించిన నియమ నిబంధనలకు సంబంధించి పూర్తి సమాచారాన్ని సేకరించాలని ఎన్‌సీపీసీఆర్‌ను ఆదేశించింది. ఈ సమాచారాన్ని క్రోడీకరించి మార్చి 31 లోగా ఒక సమగ్ర అఫిడవిట్‌ను దాఖలు చేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

## కోదాడ మున్సిపల్ ఎన్నికల్లో సీపీఎం పోటీ

### ములకలపల్లి రాములు



**కోదాడ జనవరి 22(వుదయం)** మున్సిపాలిటీ ఎన్నికల్లో కోదాడ లో సిపిఎం పార్టీ పోటీ చేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు తెలిపారు . బుధవారం స్థానిక సుందరయ్య భవన్లో కర్ణకోటి నవీన్ అధ్యక్షతన జరిగిన సిపిఎం పట్టణ కమిటీ సమావేశానికి హాజరైన ములకలపల్లి రాములు మాట్లాడుతూ ఎన్నికల్లో కలిసి వచ్చే శక్తులతో కలుపుకొని ఎన్నికల బరిలో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. కోదాడ మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా సిపిఎం బరిలో నిలుస్తుందని తెలిపారు. పేదల కోసం పేద ప్రజల కోసం అనునిత్యం ప్రజా ఉద్యమాలు నిర్వహించే కమ్యూనిస్టులను ప్రజలు ఆదరించాలని కోరారు.ఈ సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు మెదరమట్ల వెంకటేశ్వరరావు, సిఐటియు నాయకులు వి నారాయణ, కోదాడ సిపిఎం పట్టణ కార్యదర్శి ఎం ముత్యాలు, పట్టణ కమిటీ సభ్యులు కుక్కడపు నళిని ,గొర్రె ముచ్చు మరియన్న తదితరులు పాల్గొన్నారు.

## రాయపర్తిలో రోడ్డు భద్రత అవగాహన సదస్సు



**రాయపర్తి, జనవరి 22 (వుదయం) :** రాయపర్తి మండల కేంద్రంలో బస్టాండ్ ఆవరణలో గురువారం రాయపర్తి పోలీస్ స్టేషన్ ఏఎస్సై జ్యోతి ప్రసన్న ఆధ్వర్యంలో రోడ్డు సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో అసిస్టెంట్ కమిషనర్ పోలీస్ అంబటి నర్సయ్య హాజరై మాట్లాడారు. ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనాలు రోడ్డు భద్రతకు సంబంధించిన నియమాలను వివరించారు. ట్రిపుల్ రైడింగ్, వాహనాలు నడపడం వంటి ప్రమాదాల గురించి వివరించారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని వాహనం నడిపేటప్పుడు మొబైల్ ఫోన్ వినియోగించరాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసరావు, కానిస్టేబుల్ తూళ్ళ సంపత్, సుమన్, నవ్య, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పనులపై అవగాహన



**నిజాంసాగర్, జనవరి 22(వుదయం ):** మద్నూర్ మండల కేంద్రంలో గురువారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (వీG చీ=జుGA)కు సంబంధించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు , కామారెడ్డి డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ తోపాటు ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోటలక్ష్మీ కాంతారావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పేరును 'వికసిత్ భారత్గ్యారంటీ ఫర్ రోజ్?గార్ అండ్ అజీవిక మిషన్' గా మార్చడాన్ని తీవ్రంగా ఖండించారు. వీబీ జీ రామ్ జీను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పథకం పేరు నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం ద్వారా గాంధీజీ ఆలోచనలు, విలువల పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఉన్న వ్యతిరేక వైఖరి స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. మొదటి నుంచే ఈ పథకం నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ఇష్టం లేదని, అందుకే దశలవారీగా బలహీనపరిచే కుట్రలకు లేపుతోందన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించి, ప్రజలకు ఉపాధి హక్కును, గ్రామ పంచాయతీలకు పాలనా హక్కులను తిరిగి కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల ఉపాధి హక్కును కాలరాస్తూ, గ్రామ పంచాయతీలకు రాజ్యాంగబద్ధంగా లభించిన అధికారాలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. వీGబీ=జుGA స్థానంలో తీసుకొచ్చిన వీబీ జీ రామ్ జీ చట్టం గ్రామీణ ప్రజల జీవితాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు. గతంలో ఉపాధి హామీ చట్టం ద్వారా ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 100 రోజుల పని హక్కు ఉండేదని, ప్రస్తుతం వీబీ జీ రామ్ జీ చట్టం వల్ల కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసి బడ్జెట్ కేటాయించినప్పుడే పని లభించే పరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు తెలిపారు. ఇది ప్రమాదకరమైన విధాన మార్పు అని స్పష్టం చేశారు. ఇది గ్రామీణ పేదల సంక్షేమాన్ని దెబ్బతీసే తిరోగమన చర్య అని అభివర్ణించారు. ముఖ్యంగా పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఇది కేవలం పేరు మార్పు కాదని. గాంధీజీ స్ఫూర్తితో వచ్చిన ఈ పథకం తాత్విక పునాదులపై చేసిన దాడి అని ఆరోపించారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం, సమాజంలోని చివరి వ్యక్తికి ప్రాధాన్యత ఇవ్వాలన్న ఆయన ఆశయాలకు ఈ చట్టం ప్రతీక అని గుర్తుచేశారు. ఇప్పటివరకు ఉపాధి హామీ పథకంలో అసంఘటిత కార్మికుల వేతనాల భారాన్ని దాదాపుగా కేంద్రమే భరిస్తుండగా, కొత్త విధానంలో కేంద్రం 60 శాతం, రాష్ట్రాలు 40 శాతం భరించాలని ప్రతిపాదించారు. దీని వల్ల పేద రాష్ట్రాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని, వేతనాల చెల్లింపులో జాప్యం జరిగి పథకం నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు గ్రామీణ పేదలను, రాష్ట్రాలను శిక్షించే విధంగా ఉందని ఆక్షేపించారు. ఉపాధి హామీ పథకం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఆధార స్తంభం వంటిదని, దీనిని బలహీనపరచడం దేశాభివృద్ధికి ఏ మాత్రం మంచిది కాదని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల నాయకులు, అధికారులు, ప్రజలు, ఉపాధి హామీ కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పీఎం-కుసుమ్ సోలార్ ప్రాజెక్టు పనుల్లో వేగం

### మార్చి వరకు అందుబాటులోకి పి.హెచ్.సి

### మంథని లో విస్తృతంగా పర్యటించిన కలెక్టర్ శ్రీ హర్ష



**మంథని, జనవరి 22 (వుదయం ):** పెద్దపల్లి జిల్లాలో సహకార సంస్థల ఆధ్వర్యంలో చేపడుతున్న పీఎంకుసుమ్ సోలార్ ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలని, ఫిబ్రవరి నెలాఖరు లోగా గ్రిడ్ కు అనుసంధానం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం మంథని మండలంలో విస్తృతంగా పర్యటించారు. మంథని మండలం కన్నాల గ్రామం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, నాగారం గ్రామంలో ఎంపిపిఎస్, పీ.హెచ్.సి సబ్ సెంటర్ ,గుంజపడుగు గ్రామంలో నిర్మాణంలో ఉన్న పీ.హెచ్.సి భవనం, జడ్పీహెచ్ఎస్, 1 మెగా వాట్ సోలార్ ప్లాంట్ నిర్మాణం, మంథని లోని ఆర్డిఓ కార్యాలయ నిర్మాణ పనులు, జడ్పీహెచ్ఎస్ బాలికలు, బుట్టుపల్లి లోని ఆర్ అండ్ ఆర్ పనులను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, కన్నాల పాఠశాలలో ప్రహరి గోడ, గేట్ ఏర్పాటు, మైనర్ మరమ్మత్తు పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. నాగారం గ్రామం లోని పాఠశాలలో మంజూరు చేసిన పనులు, సబ్ సెంటర్ నిర్మాణ పనులు నెల రోజుల్లో లోగా పూర్తి చేయాలని అన్నారు. గుంజపడుగు జడ్పీహెచ్ఎస్ లో మంజూరు చేసిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొని రావాలని కలెక్టర్ తెలిపారు.గుంజపడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ గోడ నిర్మాణ పనులు, అవసరమైన పరికరాల బిగింపు పూర్తి చేసి మార్చి నాటికీ హ్యాండ్ ఓవర్ చేయాలనిఅన్నారు. గుంజపడుగు లో ఫ్యాక్స్ ద్వారా ఏర్పాటు చేసే సోలార్ ప్లాంట్ పనులు పూర్తి చేసి ఫిబ్రవరి చివరి నాటికి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుతో పాటు, సమాంతరంగా విద్యుత్ రవాణా కోసం ట్రాన్స్ మిషన్ లైన్ నిర్మాణ పనులు కూడా రెండు రోజుల్లో మొదలు పెట్టాలని, దీనికి డిస్కం అధికారులు సహకరించాలని పేర్కొన్నారు. రెడ్కో, విద్యుత్ శాఖలను మంచి సమన్వయం చేస్తున్నారని డీసీఓ ను అభినందించారు.తెలంగాణ రాష్ట్రంలో మొదటిసారిగా సహకార రంగంలో నిర్మిస్తున్న తొలి ప్రాజెక్టులు పెద్దపల్లి జిల్లాలో చేపట్టడం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నామని, అందుకు సంబంధిత అధికారులు సంకల్ప సిద్ధితో కృషి చేయాలని సూచించారు.రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా గోదాముల ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని కలెక్టర్ సూచించారు. బిట్టు పల్లి ఆర్&ఆర్ కాలనీ లో పెండింగ్ పనులు యుద్ధ ప్రాతిపదికను పూర్తి చేయాలని అన్నారు. ఆర్ &ఆర్ కాలనీ లో అంతర్గత రోడ్లు, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట డీసీఓ శ్రీమాల, రెడ్కో జిల్లా మేనేజర్ దురిశెట్టి మనోహర్, కేడీసీసీ బ్యాంకు సీఈఓ సత్యనారాయణ రావు, ఎంపిడిఓ శ్రీజ, తహశీల్దార్ అరీఫోద్దిన్, ఏడీఈ వెంకటనారాయణ, రెడ్కో డిఓ మునీందర్, ఏడీఓ లక్ష్మీకాంత్, గ్రీన్ సెక్యూర్ రమాకాంత్ , ఏఈ పి.ఆర్. అనుదీప్, విక్రమ్,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం, పెద్దపల్లి చే జారీ చేయనైనది.

# అంకితభావంతో పని చేయాలి

### మహబూబాబాద్ ఎస్పీ శబరీష్



**మహబూబాబాద్, జనవరి 22 (వుదయం) :** పోలీస్ అధికారులు, సిబ్బంది అంకిత భావంతో పని చేసి ప్రజల మన్ననలను పొందాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శబరీష్ అన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ శబరీష్ ఆధ్వర్యంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులతో క్రైమ్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతల పరిస్థితి, నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు పురోగతి, కోర్టు ఫలితాలపై విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో నేరాల గుర్తింపు, డిటెక్షన్‌లో సీసీ కెమెరాల వినియోగంపై చర్చించారు. కీలక ప్రాంతాలు, సున్నిత ప్రాంతాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణను సమర్థవంతంగా కొనసాగించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా నమోదైన పెండింగ్ కేసులు, డిటెక్టెడ్ కేసులు, కన్విక్షన్ సాధించిన కేసుల పురోగతిని సమీక్షించారు. తీవ్రమైన, వివాదాస్పద కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు జరిపి, సరియైన సాక్ష్యాలతో చార్జ్‌షీట్ దాఖలు చేయడం ద్వారా కోర్టుల్లో శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. పెండింగ్ కేసుల తగ్గింపును లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన కేసులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలపై జీరో టాలరెన్స్ విధానం అమలు చేయాలని, అంతర్ జిల్లా, అంతర్ రాష్ట్ర స్థాయి సమన్వయంతో దర్యాప్తు చేపట్టాలని తెలిపారు.అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా రాత్రి వేళల్లో పట్టణాలు, గ్రామాలు, హైవేలు, సున్నిత ప్రాంతాల్లో నిరంతర గస్తీ నిర్వహించడం ద్వారా నేరాలను ముందుగానే నివారించాలని, ప్రజల్లో భద్రతా భావన పెంపొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫీల్డ్ పోలీసింగ్, దర్యాప్తు, ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వయంతో పనిచేస్తేనే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. అనంతరం వివాదాస్పద కేసుల్లో సమర్థవంతమైన దర్యాప్తు నిర్వహించి కోర్టుల్లో కన్విక్షన్లు సాధించిన పోలీస్ అధికారులకు అభినందన పత్రాలు అందజేశారు.

### బీఆర్ఎస్ కు షాకిచ్చిన

# జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ విజయ గణపతి

### బీఆర్ఎస్ నేతలతో కలిసి బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరిన దంపతులు



**కరీంనగర్, జనవరి 22 (వుదయం ):** కరీంనగర్ జిల్లా పరిషత్ తాజా మాజీ ఛైర్మన్, బిఆర్ఎస్ నాయకురాలు కనుమల్ల విజయ గణపతి బీజేపీలో చేరారు. కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సమక్షంలో బీజేపీలో చేరారు. కనుమల్ల విజయ గణపతి దంపతులకు కాషాయ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.వారితో పాటు జమ్మికుంటకు చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో జరిగిన అభివృద్ధే ఎజెండాగా ప్రజల్లోకి వెళతామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు.కరీంనగర్ కార్పొరేషన్ సహా తన పార్లమెంట్ నియోజకవర్గంలోని మున్సిపాలిటీల్లో అంతో ఇంతో అభివృద్ధి జరిగిందంటే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులతోనే సాధ్యమైందని తెలిపారు. స్మార్ట్ సిటీ, అమ్రుత్ 1, 2, స్వచ్ఛ భారత్ వంటి పథకాలతోపాటు 14, 15, 16వ ఆర్థిక సంఘం విడుదల చేసిన నిధులతోనే కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే రాబోయే ఎన్నికల్లో ''అభివృద్దే మా విధానం... హిందుత్వమే మా నినాదం'' పేరుతో ప్రజల వద్దకు వెళతామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్లలో మున్సిపాలిటీలకు నయాపైసా ఇయ్యలేదని గుర్తు చేశారు. ఎన్నికలు వస్తున్నయని తెలియడంతో ఓట్ల కోసం అభివృద్ధి పనులకు శంకుస్థాపనల పేరుతో కాంగ్రెస్ నేతలు హడావుడి చేసేందుకు సిద్ధమయ్యారని దుయ్యబట్టారు. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో అధికారంలో లేని బీఆర్ఎస్ పార్టీకి ఓటేసి ఏం లాభమని, గెలిచిన తరువాత పార్టీ ఫిరాయింపులకు పాల్పడతారని పేర్కొన్నారు. ప్రజలు వాస్తవాలు గమనించాలని కోరారు. బీజేపీని ఆశీర్వదించి కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు మున్సిపాలిటీల్లో అత్యధిక స్థానాల్లో గెలిపిస్తే కేంద్రం నుండి అత్యధిక నిధులు తీసుకురావడంతోపాటు సీఎస్సార్ నిధులను సైతం తీసుకొచ్చి అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, కరీంనగర్ మాజీ మేయర్ డి.శంకర్, డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, బీజేపీ జమ్మికుంట నేతలు ఆకుల రాజేందర్, పుప్పాల రఘు తదితరులు పాల్గొన్నారు.

# చిట్టిచేతులతో మట్టి పనులు



### పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

**నిజాంసాగర్, జనవరి 22(వుదయం ):** పాఠశాలలో చదివి తమ భవిష్యత్తును బంగారుమయం చేసుకుందామనుకుంటున్న ఆ చిన్నారుల ఆశలపై నీళ్ళుజల్లి వారి చేతులకు మట్టి మరకలు అంటిస్తున్నాడు ఓ కాంట్రాక్టర్ వర్కర్. వివరాల్లోకి వెళ్తే నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన బేగరి సాయిలు అనే వ్యక్తి ఆ పాఠశాలలో కాంట్రాక్టు వర్కర్‌గా పనిచేస్తున్నాడు. విద్యార్థులతో బరువైన బకెట్ లు మోయించడం, చెత్తా చెదారం తొలగించే పనులకు ఉపయోగించుకుంటుండడంతో విద్యార్థుల తల్లితండ్రులు, రోడ్డు పక్కన వెళ్తున్న గ్రామస్థులు ముక్కున వేలేసుకుంటున్నారు.ఇప్పటికైనా పాఠశాలలో ఇలా విద్యార్థులచే వెట్టిచాకిరిలు మానుకుని విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు వారి దృష్టి మళ్లించి వారు ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయవలసిన అవసరం ఎంతైన ఉంది.

# 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమం



**కరీంనగర్, జనవరి 22 (వుదయం ):** నగరంలోని మానేరు రివర్ ఫ్రంట్, లేక్ పోలీస్ అవుట్‌పోస్ట్ పరిధిలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే ఉద్దేశంతో 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రాంచందర్ రావు హాజరయ్యారు.ఈ సందర్భంగా డ్యామ్ పరిసర ప్రాంతాల్లో వాకర్స్, విద్యార్థులతో కలిసి భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటస్వామి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. బైక్‌లపై ముగ్గురు ప్రయాణించడం చట్టవిరుద్ధం మరియు ప్రమాదకరం అన్నారు.మద్యం సేవించి వాహనం నడపడం, మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, ఇతరుల ప్రాణాలకు నష్టం కలిగించకూడదన్నారు. వయసు నిండని పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని తెలిపారు. మితిమీరిన వేగం ప్రమాదాలకు ప్రధాన కారణం, వేగ నియంత్రణ పాటించాలన్నారు. అనంతరం, రోడ్డు నిబంధనలను పాటిస్తామని, తోటి వారికి అవగాహన కల్పిస్తామని, ప్రమాదాల రహిత సమాజం కోసం కృషి చేస్తామని విద్యార్థులు మరియు వాకర్స్‌తో అధికారులు ప్రమాణం చేయించారు.ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్స్పెక్టర్ రాంచందర్ రావు, లేక్ పోలీస్ అవుట్‌పోస్ట్ ఆర్.ఎస్.ఐ రమేష్, ఇతర పోలీస్ సిబ్బంది, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

### వసంత పంచమి మహోత్సవాలకు

# ముస్తాబైన శ్రీ మహాశక్తి దేవాలయం

### పూజ వేడుకల్లో పాల్గొననున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**కరీంనగర్, జనవరి 22 (వుదయం ):** నగరంలోని మహిమాన్విత దివ్యక్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయం శుక్రవారం రోజున జరిగే వసంత పంచమి వేడుకల కోసం సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీ శ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామివారి దివ్య ఆశీస్సులతో వసంత పంచమి మహోత్సవ పూజా వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాటు చేశారు. దేవాలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలు, రకరకాలపూల అలంకరణతో ఆకర్షనీయంగా తీర్చిదిద్దారు. వసంత పంచమి సందర్భంగా శ్రీ మహాశక్తి దేవాలయంలో ఉదయం 4 గం.లకు శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారికి, శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మీ, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లకు అభిషేకం, ఉదయం 7:30 నిమి.లకు శ్రీ మహాసరస్వతి దేవి పూజ, అభిషేకం (ఉత్సవ మూర్తికి), కుంకుమార్చన, విద్యార్థులచే సామూహిక పుస్తక పూజలు జరుగనున్నాయి. జ్ఞానాన్ని ప్రసాదించే వేద మాత, తన చల్లని చూపులతో ఆశీర్వదించే శక్తి స్వరూపిణి, అక్షరానికి ఆదిదేవత, ప్రణవ స్వరూపిణి శ్రీ మహాశక్తి శ్రీ మహా సరస్వతి అమ్మవారు. చిన్నారుల అక్షరాభ్యాసానికి కొంగు బంగారంగా ఇక్కడి "శ్రీ మహా సరస్వతి" అమ్మవారు నిలిచారు. ప్రతి ఏటా వసంత పంచమి రోజున వేలాదిగా తరలివచ్చే భక్తులతో రాకతో మరో బాసర క్షేత్రంలా శ్రీ మహాశక్తి ఆలయం మారింది. ముఖ్యంగా వసంత పంచమి రోజున దేవాలయంలోని శ్రీ మహాశక్తి అమ్మవారిని పూజించిన వారికి, జ్ఞానం, వివేకం, వాక్చాతుర్యం, సృజనాత్మక శక్తి ,మేదో సామర్థ్యం పెరుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.. అందుకే ఇక్కడి చిన్నారుల అక్షరాభ్యాసానికి ఎంతో ప్రత్యేకత ఉంది. ప్రతి ఏటా వసంత పంచమి సందర్భంగా ఎంతోమంది చిన్నారుల అక్షరాభ్యాసానికి రాష్ట్రం నలుమూల నుండి ఇక్కడి శ్రీ మహాశక్తి దేవాలయానికి భక్తులు తరలివస్తున్నారు. శుక్రవారం రోజున జరిగే వసంత పంచమి మహోత్సవ వేడుకల, పూజా కార్యక్రమాల్లో కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ దంపతులు పాల్గొననున్నారు.సమస్త హిందూ బంధువులందరూ వసంత పంచమి పూజ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని దేవాలయ నిర్వాహకులు కోరారు.

### గెలుపే లక్ష్యంగా

# కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలి



జిల్లా డీసీసీ అధ్యక్షుడు పి రఘునాథరెడ్డి రెడ్డి

**రామకృష్ణాపూర్, జనవరి 22 (వుదయం):** రాబోయే మున్సిపల్ ఎన్నికల గెలుపుకు ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని మంచిర్యాల జిల్లా డీసీసీ అధ్యక్షులు పి రఘునాథ రెడ్డి అన్నారు. గురువారం రామకృష్ణాపూర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశానికి ముఖ్య అతిథులుగా పాల్గొని ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులంతా సమన్వయంతో పార్టీ గెలుపుకు కృషి చేయాలని, భేదాభిప్రాయాలను పక్కనపెట్టి పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని నాయకులకు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. కొందరు నాయకులు తమ స్వలాభం కోసం మంత్రి వివేక్ పై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని అలాంటి ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. పార్టీని విడిచి పోయిన వారి గురించి పట్టించుకోవాల్సిన పనిలేదని, మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్ పర్సన్ జంగం కళ,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పల్లె రాజు, అధికార ప్రతినిధి వొడ్నాల శ్రీనివాస్, సీనియర్ నాయకులు గాండ్ల సమ్మయ్య, యాకూబ్ అలీ, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### ధర్మపురిలో ఇందిరమ్మ చీరలు పంపిణీ

### మహిళా సంఘాలకు రూ. 48.22 లక్షల వడ్డీ లేని రుణాలు

### పట్టణంలో ప్రతీ ఆడపడుచుకి ఇందిరమ్మ చీర అందిస్తాం

### మంత్రి అడ్లూరి.లక్ష్మణ్



**ధర్మపురి, జనవరి 22(వు దయం ):** అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందజేయడమే లక్ష్యం గా ప్రభుత్వం ముందుకు సాగు తోందని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పష్టం చేశారు. గురు వారం ధర్మపురి మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మహిళలకు ఇందిరమ్మ చీరలు, లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి నెంబర్ పత్రాలను పంపిణీ చేశా రు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు.ఈ సంద ర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని సంఘా లకు రూ. 48,22,706 విలువైన వడ్డీ లేని రుణాల చెక్కులను ఆయన పంపిణీ చేశామని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం బాగుంటుందని ఆయన పేర్కొన్నారు.మొదటి విడతలో భాగంగా పట్టణంలోని 157 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని మంత్రి వెల్లడించారు.15 వార్డుల్లోని అర్హులైన వారు ఇందిరమ్మ ఇల్లు కోసం మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి నిరుపేదకు ఇల్లు కట్టించి ఇచ్చే బాధ్యత మా ప్రభుత్వానిది అని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వం రేషన్ కార్డుల ఊసే ఎత్తలేదని,తాము అధికారంలోకి వచ్చాక అర్హులందరికీ కొత్త కార్డులతో పాటు సన్నబియ్యం అందజేస్తున్నామని,200 యూనిట్ల ఉచిత కరెంట్ అందిస్తున్నామని తెలిపారు. ధర్మపురి క్షేత్ర అభివృద్ధి పై మంత్రి ప్రత్యేకంగా దృష్టి సారిం చారు.రానున్న గోదావరి పుష్కరాల కోసం బాసర నుండి భద్రాచలం వరకు తీర ప్రాంతాల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి క్యాబినెట్ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.భక్తుల సౌకర్యార్థం ధర్మపురిలో కొత్త స్నాన ఘాట్లు, ఇతర మౌలిక సదుపాయాలు త్వరలోనే అందుబాటులోకి వస్తాయని చెప్పారు. గోదావరి తీరంలో మూత పడిన సంస్కృత ఆంధ్ర కళాశాలను తిరిగి పునఃప్రారంభిం చి, విద్యా వైభవానికి పెద్దపీట వేశామన్నారు.ఈ కార్యక్రమంలోమున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రావు,తహశీల్దార్ శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంఘనబట్ల దినేష్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, మాజీ కౌన్సిలర్లు వేముల నాగలక్ష్మి,సంఘనబట్ల. సంతోషి,గరిగే అరుణ,అయ్యోరి. వేణు,మున్సిపల్ సిబ్బంది మహి ళా సంఘాలు,స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్తున్న కమిషనర్ గద్దె రాజు కు సన్మానం



**రామకృష్ణాపూర్, జనవరి 22 (వుదయం)** క్యాతన్ పల్లి మున్సిపాలిటీ కమీషనర్ గా విధులు నిర్వర్తించిన గద్దె రాజు సాధారణ బదిలీపై ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయానికి వెళుతున్న నేపద్యంలో మున్సిపల్ కార్యాలయంలో ఆయనను మాజీ మున్సిపల్ చైర్ పర్సన్, మాజీ కౌన్సిలర్లు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, వివిధ పార్టీల సీనియర్ నాయకులు, కాంగ్రెస్, బారాస నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమీషనర్ గద్దె రాజు మాట్లాడుతూ..అన్ని రాజకీయ పార్టీలకు అతీతంగా మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కృషి చేశానని అన్నారు. క్యాతన్ పల్లి మున్సిపాలిటీ కి బాధ్యతలు తీసుకొని ఏడాదిన్నర కాలంలో మునిసిపాలిటీని అభివృద్ధి చేసేలా కృషి చేశానని అన్నారు. కమిషనర్ గా నాకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు.

# రోడ్డు ప్రమాదాలపై అవగాహన



**నిజం సాగర్, జనవరి 22 (వుదయం):** 22 గురువారం రోజున శంకరంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మాడిసెట్పల్లి గేటు వద్ద శంకరంపేట్ ఏఎస్ఐ జి సంగన్న సిబ్బంది ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల గురించి అవగాహన నిర్వహించారు ఇటీవల పంచాయతీ ఎన్నికల ఓటు వేయడానికి హైదరాబాద్ నుండి నిజాంసాగర్ మండలం మాగి గ్రామానికి వెళుతున్న ఒకే కుటుంబీకులు బైక్ పై వెళ్తుండగా ప్రమాదం జరిగి మృతిచెందిన ఘటన మన పోలీస్ స్టేషన్ పరిధిలోనే జరగడం మీ అందరికీ తెలిసిన విషయమే కావున ప్రతి ఒక్కరు బైక్పై వెళ్తుండగా హెల్మెట్ ధరించాలి కారుపై వెళ్లేవాళ్లు డ్రైవర్ సీట్ బెల్ట్ వేసుకోవాలి మద్యం తాగి బైకు కానీ కారు కానీ నడిపినట్లయితే జైలు శిక్ష తప్పదని అయినా అన్నారు ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ N. రాములు, రమేష్, నందు, సాయిబాబా మాడిశెట్టిపల్లి సర్పంచ్ కుమార్ మరియు మాజీ సర్పంచ్ అశోక్ గ్రామస్తులు పాల్గొన్నారు

# సర్పంచ్ స్వయంకృషితో ఉచిత హెల్మెట్లు

## రోడ్డు భద్రతపై ప్రత్యేక కార్యక్రమం

**వుదయం, సిద్దిపేట**



సిద్దిపేట జిల్లా తోగుట మండలం పెద్ద మాసాన్‌పల్లి గ్రామంలో రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఉచిత హెల్మెట్ పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పన్యాల ప్రవీణ్ రెడ్డి తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేయడం విశేషం. ఈ సందర్భంగా సర్పంచ్ పన్యాల ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ, తాను గ్రామ ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని తెలిపారు. రోడ్లపై ప్రయాణించే యువత, మహిళలు, గ్రామ ప్రజలు ప్రమాదాలకు గురికాకుండా ఉండాలనే ఉద్దేశంతో ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణ రక్షణ సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిద్దిపేట జిల్లా సీపీ రశ్మీ పెరమాల్, ఏసీపీ నర్సింలు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో హెల్మెట్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఇది కేవలం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాకుండా, ప్రాణ రక్షణకు అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించి రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై రవికాంత్ రావు, గ్రామ వార్డు సభ్యులు, మహిళలు, యువతతో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హెల్మెట్లు ధరించిన అనంతరం ఏసీపీ రశ్మీ పెరమాల్ జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు.గ్రామంలో నిర్వహించిన ఈ బైక్ ర్యాలీ ద్వారా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడంతో పాటు, హెల్మెట్ వినియోగం ఎంత ముఖ్యమో ప్రజలకు తెలియజేశారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించడంతో ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# పుర పాలక పోరులో గాజుల గెలుపు ఖాయం

**మంథని, వుదయం**



మంథని పురపాలక సంఘం ఎన్నికల్లో ఆశావాహుల సందడి మొదలైంది. మొత్తం 13 వార్డులు ఉన్నాయి. 13 వార్డులలో 8 వ వార్డ్ నుండి స్వతంత్ర అభ్యర్థిగా యువ దంపతులు గాజుల సాహితీ సురేష్ పోటీలో ఉన్నట్లు సమాచారం. గతంలో సాహితీ సురేష్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 8 వ వార్డు నుండి పోటీ చేసి విజయం సాధించాలని పట్టుదలతో ఉన్నారు. ప్రతిక్షణం ప్రజల మధ్య ఉంటూ, ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు వెళ్లడం వారి నైజం. చిన్న పెద్ద తేడా లేకుండా అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లడం ఆ యువ దంపతులకే చెల్లుతుంది 8 వార్డులో స్థానికంగా అందుబాటులో ఉండడం వారికి కలిసొచ్చే అంశం. వార్డులో స్థానికులు కావడం వారి గెలుపుకు నాంది. గాజుల సురేష్ సాహితి గెలుపు దాదాపు ఖాయమని మంథని మున్సిపల్ లో జోరుగా చర్చ సాగుతుంది. పోచమ్మ వాడ ప్రజల ఆశీస్సులు తన పైన ఉన్నాయని, మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించి తీరుతానని వారు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. గెలిచిన తర్వాత ప్రజా సేవకుల వలె పని చేస్తానని, అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు. అందరికంటే ముందే వారు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఎన్నికల్లో అవకాశం కల్పించాలని, ప్రతి ఇంటి ఆడబిడ్డగా ముందుంటారని వారు తెలిపారు.

# గెలుపు గుర్రాలకే టిఆర్‌పి టికెట్లు

### 'కత్తెర' గుర్తుతో మున్సిపల్ ఎన్నికల బరిలోకి అభ్యర్థులు

### టిఆర్‌పి సీనియర్ నాయకుడు గుండవేణ స్వామి

**పెద్దపల్లి వుదయం**




తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగనున్న తరుణంలో పెద్దపల్లిజిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు,కార్పొరేషన్లలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ అభ్యర్థులను పోటీకి నిలుపుతున్నట్లు పార్టీ సీనియర్ నాయకులు గుండవేణ స్వామి ప్రకటించారు.జిల్లాలోని రామ గుండం కార్పొరేషన్ సహా మంథని,పెద్దపల్లి,సుల్తానాబాద్ మున్సిపాలిటీలలోని అన్ని కార్పొరేటర్ మరియు కౌన్సిలర్ స్థానాలకు గెలుపు గుర్రాలకే పార్టీ బి–ఫారాలు అందజేస్తుందని,నిబద్ధత కలిగిన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు. గురువారం పెద్దపల్లిలో ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యావంతులు, ఉద్యమకారులు, యువత మేధావులు ఈ ఎన్నికల్లో పోటీకి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఎన్నికల ముందు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను,ముఖ్యంగా బీసీలను మోసం చేశాయని విమర్శించారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయకుండా కాంగ్రెస్ పార్టీ కపట ప్రేమ నటిస్తోందని, కేంద్రంలో ఉన్న బీజేపీ సైతం రిజర్వేషన్ల అంశంలో బీసీలను వంచిస్తోందని మండిపడ్డారు. ప్రజలను మోసం చేస్తున్న ఈ అగ్రకుల పార్టీలకు బుద్ధి చెప్పాలంటే రానున్న మున్సిపల్ ఎన్ని కల్లో వారిని ఓడించాలని ఆయన కోరారు. కత్తెర గుర్తుపై పోటీ చేసే టిఆర్‌పి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించడం ద్వారానే బీసీ,ఎస్సీ,ఎస్టీ మరియు పేద వర్గాలకు రాజ్యాధికారం సాధ్యమవుతుందని స్వామి పేర్కొన్నా రు. బీసీ ఉద్యమాన్ని మరింత బలోపే తం చేస్తూ,రాబోయే సార్వత్రిక ఎన్నిక ల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీని అధికారంలోకి తీసుకు రావడంలో జిల్లా ప్రజలు కీలక పాత్ర పోషించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# బీజేపీలోకి భారీగా చేరికలు

### రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు సమక్షంలో కాషాయ తీర్థం

### మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి జెండా ఎగురవేయడమే లక్ష్యం

**ధర్మపురి వుదయం:**



రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీలోకి వలసల జోరు కొనసాగుతోంది. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు సమక్షంలో పలువురు బీఆర్ఎస్ కీలక నేతలు, కార్యకర్తలు భారీగా పార్టీలో చేరారు. బీజేపీ రాష్ట్ర నాయకులు దామెర రామ సుధాకర్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తాజా, మాజీ జెడ్పిటిసి సభ్యులు బత్తినీ అరుణ, కొత్తకొండ రాజు, నక్క నగేష్, బత్తిని ఇంద్రకరణ్, బత్తిని వీణ, బోయినపల్లి గంగారాం, గొల్లపెల్లి రాజేష్, రేణిగుంట శ్రీకాంత్, గట్ల అనిల్, హర్షవర్ధన్ తదితరులు కాషాయ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ నరేంద్ర మోదీ నాయకత్వంపై నమ్మకంతో అనేకమంది నాయ కులు బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు.కొత్తగా చేరిన నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవే యడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, మండల అధ్యక్షులు కుమ్మరి తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, జిల్లా యువ నాయకులు నల్లవెల్లి సుజన్ రెడ్డి, సీనియర్ నాయకులు బండారి లక్ష్మణ్, కందాల మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

### ముత్తునూర్ లిఫ్ట్‌ను ప్రారంభించిన మంత్రి అడ్లూరి

**ధర్మపురి వుదయం:**



రైతు పక్షపాత ప్రభుత్వంగా సాగు నీటి ఇబ్బందులు లేకుండా చూస్తామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు. మండలంలోని ముత్తు నూర్ వద్ద గోదావరి నదిపై ఉన్న ఎత్తిపోతల పథకాన్ని గురువారం ఆయన పునఃప్రారంభించారు. గతంలో ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగలు చోరీకి గురికావడంతో లిఫ్ట్ నిలిచిపోయి సాగుకు ఆటంకం ఏర్పడింది.రూ. 81 లక్షల నిధులు రైతుల సమస్యను వెంటనే సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో మాట్లాడి రూ. 81 లక్షల నిధులను మంజూరు చేయించారు.యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేయించి సాగునీటిని విడుదల చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూముత్తునూర్,ఆరేపల్లి,రాయప ట్నం,తిమ్మాపూర్ తదితర గ్రామా ల రైతులకు భవిష్యత్తు లో ఇబ్బం దులు కలగకుండా కాంట్రాక్టర్ ద్వారా పర్యవేక్షణ ఏర్పాటు చేస్తామన్నారు.మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో దొంగతనాలు జరుగుతున్నందున రైతులు విద్యుత్ పరికరాల పట్ల అప్రమ త్తంగా ఉండాలని సూచించారు. సన్న వడ్లకు బోనస్,నిరంతర విద్యుత్ వంటి పథకాల తో ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతిని ధులు,అధికారులు,రైతులు పాల్గొన్నారు.

# తాడిచర్ల ఓపెన్ కాస్ట్ బాధితులకు విముక్తి

### డేంజర్ జోన్ ఇళ్ల సేకరణకు ముమ్మర కసరత్తు

### ఎనిమిదేళ్ల పోరాటానికి దక్కనున్న ఫలితం

**మల్హార్, వుదయం:**

తాడిచర్ల ఓపెన్ కాస్ట్ (OC) గని విస్తరణలో భాగంగా డేంజర్ జోన్‌లో నివసిస్తున్న ప్రజల ఎనిమిదేళ్ల సుదీర్ఘ పోరాటానికి ఎట్టకేలకు ఫలితం దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. గని పరిధికి సమీపంలో ఉంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్న బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు, వారి ఇళ్లను సేకరించేందుకు జెన్‌కో సంస్థకు గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు సమాచారం.గత ఎనిమిదేళ్లుగా స్థానిక భూ నిర్వాసితులు వంటవార్పు కార్యక్రమాలు, ధర్నాలు, నిరసనలు వంటి అనేక పోరాట కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉద్యమాలపై కన్నెర్ర చేసిన జెన్‌కో అధికారులు అప్పట్లో కొంతమంది స్థానిక నేతలపై కేసులు కూడా నమోదు చేయించగా, వారు ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ పరిస్థితుల్లో బాధితులు ప్రత్యక్ష ఆందోళనలకు బదులు చట్టపరమైన మార్గాన్ని ఎంచుకుని మానవ హక్కుల కమిషన్, హైకోర్టు, లోకాయుక్త, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తదితర సంస్థలను ఆశ్రయించారు. ఆ సుదీర్ఘ న్యాయపోరాటానికి నేడు ఫలితం దక్కుతున్నట్లు కనిపిస్తోంది.అక్రమ కట్టడాలపై అధికారుల నజర్గత నవంబర్ 11న ఎనర్జీ డిపార్ట్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, జెన్‌కో సీఎండీ ఎస్. హరీష్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో డేంజర్ జోన్ ఇళ్ల సేకరణపై కీలక ఆదేశాలు జారీ అయ్యాయి.తాడిచర్ల గ్రామంలోని ఓపెన్ కాస్ట్ డీ–3 డంపు ప్రాంతాన్ని ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించిన అధికారులు, కేవలం అర్హులైన స్థానికులకే పరిహారం అందించాలి అని స్పష్టం చేశారు. పరిహారం పొందే ఉద్దేశంతో తాజాగా నిర్మించిన అక్రమ కట్టడాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణనలోకి తీసుకోకూడదని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.స్థానికుల ఆవేదన"బయట వ్యక్తుల వల్ల మాకు అన్యాయం"పరిహారం పొందాలన్న ఆశతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి అక్రమంగా షెడ్లు, కట్టడాలు నిర్మించడంపై స్థానిక బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు."మేము ఎనిమిదేళ్లుగా గని దుమ్ము, ధూళిని భరిస్తూ ఇక్కడే పోరాటం చేస్తున్నాం. ఇప్పుడు బయట నుంచి వచ్చిన వారి అక్రమ కట్టడాల వల్ల అసలైన స్థానికులకు నష్టం జరుగుతోంది. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి మాకే న్యాయం చేయాలి" అని వారు డిమాండ్ చేస్తున్నారు.అక్రమ కట్టడాల కారణంగా సర్వే ప్రక్రియ జాప్యం అవుతుండటంతో తమ ఇబ్బందులు మరింత పెరుగుతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రికార్డుల సేకరణలో రెవెన్యూ యంత్రాంగంఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మల్హార్ తహసీల్దార్ కె. రవికుమార్ డేంజర్ జోన్ ఇళ్ల సేకరణ ప్రక్రియను వేగవంతం చేశారు.అర్హుల గుర్తింపు కోసం:గ్రామ పంచాయతీ రికార్డుల ప్రకారం ఉన్న ఇళ్ల వివరాలువిద్యుత్ శాఖ రికార్డుల ఆధారంగా మీటర్ల డేటాఈ రెండు అంశాలను ప్రామాణికంగా తీసుకుని జాబితా సిద్ధం చేయాలని సంబంధిత శాఖలకు లేఖలు పంపినట్లు సమాచారం.ఫిబ్రవరిలో కొలిక్కి రానున్న ప్రక్రియవచ్చే ఫిబ్రవరి మొదటి లేదా రెండో వారంలోగా అర్హులైన బాధితుల తుది జాబితాను సిద్ధం చేసి, నష్టపరిహారం చెల్లింపునకు అవసరమైన కార్యాచరణను అధికారులు ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది.ఎనిమిదేళ్ల సుదీర్ఘ పోరాటానికి ఫలితం దక్కే సమయం దగ్గరపడటంతో, తాడిచర్ల ఓపెన్ కాస్ట్ బాధితుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

# దంత వైద్య సేవలకు జాతీయ గుర్తింపు

**వుదయం, సిద్దిపేట:**



డా. ఎల్. శ్రీనివాస్ నాయక్‌కు 'తెలుగు వెలుగు మహానంది జాతీయ పురస్కారం' సిద్దిపేట జిల్లా ప్రతినిధి: దంత వైద్య రంగంలో విశేష సేవలు అందిస్తూ సామాజిక అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజారోగ్యానికి కృషి చేస్తున్న సిద్దిపేట జిల్లా వాసి, శ్రీనివాస సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్. శ్రీనివాస్ నాయక్ ( బి డి ఎస్, ఎం డి ఎస్) ప్రతిష్ఠాత్మక 'తెలుగు వెలుగు మహానంది జాతీయ పురస్కారం–2026' లభించింది.గత కొన్ని సంవత్సరాలుగా దంత వైద్య రంగంలో నిరంతర సేవలతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఆరోగ్య అవగాహన సదస్సులు, ఉచిత దంత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించిన కృషిని గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రకటించింది.శ్రీ స్వామి వివేకానంద మరియు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని 2026 జనవరి 25వ తేదీ (ఆదివారం) ఉదయం 10 గంటలకు తెలంగాణ రాష్ట్రం హనుమకొండ జిల్లా, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ (బాలసముద్రం బస్టాండ్ సమీపంలో) నిర్వహించనున్న పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రముఖ అతిథుల చేతుల మీదుగా ఈ పురస్కారం ప్రదానం చేయనున్నారు.ఈ సందర్భంగా తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ చైర్మన్ విశ్వ కళా రత్న బ్రహ్మశ్రీ పోలోజు రాజ్ కుమార్ ఆచార్య డాక్టర్ శ్రీనివాస్ నాయక్ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నతమైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.డాక్టర్ శ్రీనివాస్ నాయక్‌కు లభించిన ఈ జాతీయ పురస్కారం సిద్దిపేట జిల్లాకు గర్వకారణంగా నిలిచిందని వైద్య వర్గాలు, ప్రజలు అభినందనలు తెలిపారు.

# పాఠశాలలో ఘనంగా 'గ్రీన్ డే'

**ధర్మపురి వుదయం:**



మండలంలోని కమలాపూర్ పచ్చదనమే ప్రగతికి బాటని ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎదుల మహేష్ పేర్కొన్నారు. గురువారం పాఠశాల లో 'గ్రీన్ డే' వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థు ల్లో పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్య క్రమాలు దోహదపడతాయని తెలిపారు. ప్రతి విద్యార్థి మొక్కలు నాటాలని, పర్యావరణ పరిరక్షణ కు నడుం బిగించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పచ్చని దుస్తులు ధరించి పర్యావరణ అనుకూల కృత్యాలను ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పవన్ కుమార్, సునీత, వెంకటేష్, రాజేష్, సూర్యతేజ, శ్రీలత, సంపూర్ణ, సంజన, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అయోధ్య బాల రామ ప్రతిష్ట మూడవ సంవత్సరం

**వుదయం, సిద్దిపేట:**



సీతారామ కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహణశ్రీ రామ జన్మస్థలం అయోధ్యలో బాల రాముడి ప్రతిష్ఠ మూడవ సంవత్సరాన్ని పురస్కరించుకుని గురువారం రోజున సిద్దిపేట పట్టణంలో శ్రీసీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని బోనగిరి దీప్తి – నాగరాజ్ 39వ వార్డు కౌన్సిలర్ ఆధ్వర్యంలో నిర్వహించగా, శివం కాంప్లెక్స్ మరియు సుభాష్ రోడ్ దుకాణాల సముదాయం కార్యస్థలంగా సిద్దిపేట, మారి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. పట్టణం నలు మూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి కళ్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే హరీష్ రావు ఆదేశానుసారం ఈ కార్యక్రమం నిర్వహించబడగా, ముఖ్య అతిథిగా సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఆశీర్వాదాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీరాముని ఆదర్శాలు ప్రతి ఒక్కరి జీవితంలో ఆచరణీయమని పేర్కొన్నారు.ఈ మహోత్సవానికి గరిపల్లి లక్ష్మీనాదం, గోపిశెట్టి శరభయ్య, అంబడిపల్లి మల్లికార్జున్, ఇల్లందు రవీందర్ తదితరులు సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తుల కోసం తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేశారు.భక్తుల జయజయధ్వానాలతో, మంగళ వాయిద్యాల నడుమ నిర్వహించిన సీతారామ కళ్యాణ మహోత్సవం భక్తుల్లో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపుతూ ఘనంగా ముగిసింది.

# హుస్నాబాద్ విలీనంపై మంత్రి పొన్నం రాజకీయ డ్రామా

### ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా హుస్నాబాద్ విలీనం యత్నం

### రెండేళ్లుగా హుస్నాబాద్‌లో అభివృద్ధి శూన్యం

### మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్ ఆరోపణలు

**హుస్నాబాద్, వుదయం**



తన రాజకీయ లబ్ది కోసమే హుస్నాబాద్‌ను కరీంనగర్‌లో విలీనం చేయడానికి హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కుట్రలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్ తీవ్రంగా ఆరోపించారు. ఇలాంటి ప్రయత్నాలు ప్రజల మధ్య చిచ్చు పెట్టడానికే తప్ప ప్రజా ప్రయోజనాలకు కావని విమర్శించారు.గురువారం హుస్నాబాద్ పట్టణంలో హనుమకొండ రోడ్డు నుంచి సిద్దిపేట రోడ్డు వరకు స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు.సతీష్ కుమార్ మాట్లాడుతూ...గతంలో హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాలను ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, గ్రామసభల ద్వారా తీసుకున్న అభిప్రాయాల మేరకే శాస్త్రీయంగా సిద్దిపేట జిల్లాలో కలిపామని గుర్తు చేశారు. ఏ జిల్లాలో ఉన్నా ఆర్డీఓ, ఏసీపీ కార్యాలయాల ఏర్పాటు కోసం కాంగ్రెస్ నాయకులే ధర్నాలు చేశారని, ఆ సమయంలో తానే స్వయంగా హామీ ఇచ్చిన విషయాన్ని కాంగ్రెస్ నేతలు మరిచిపోయారా అని ప్రశ్నించారు. కరీంనగర్‌లో విలీనం కావాలని ప్రజలు ఎవరూ కోరుకోవడం లేదని, మంత్రి పొన్నం తన ప్రయోజనం కోసం మాత్రమే కొత్త వివాదాన్ని తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. మరోసారి ఈ అంశాన్ని లేవనెత్తితే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అలాగే గత రెండేళ్లుగా అభివృద్ధి చేస్తానని చెప్పిన మంత్రి ఇప్పటివరకు హుస్నాబాద్‌లో పూర్తిచేసిన ఒక్క పనిని కూడా చూపలేదని విమర్శించారు. రింగురోడ్డు, ఇతర ప్రాజెక్టులపై మాటలు తప్ప చేతల్లో ఫలితం లేదన్నారు. 250 పడకల ఆస్పత్రి పేరుతో పక్కాగా ఉన్న పాత భవనాన్ని కూల్చివేయడం బాధాకరమన్నారు.ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఉచిత బస్సు ప్రయాణం తప్ప మరే హామీ అమలుకాలేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చి ఎగ్గొట్టిన హామీలపై అవగాహన కల్పించేందుకే కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు బాకీ పడ్డ సొమ్మును కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించాల్సిందేనని డిమాండ్ చేశారు.వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కారు గుర్తుకు ఓటు వేసి మూడోసారి హుస్నాబాద్ మున్సిపాలిటీలో గులాబీ జెండాను ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల గడువు పొడిగింపు

**వుదయం, కొండపాక**



కొండపాకలో నడుస్తున్న జగదేవ్ పూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాలలో 2026/27 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి నుంచి 9వ తరగతులలో ఉన్న ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ గడువుఈ నెల 21 ముగుస్తున్నందున తిరిగి ఈ నెల 25వరకు అప్లై చేసుకునేందుకు గడువును వరకుపొడిగించిన్నట్లు పాఠశాల సిబ్బంది తో కలిసి వెల్లడించారు కొండపాక గ్రామ సర్పంచ్ నవీన శ్రీనివాస్. బుధవారం రోజు ప్రిన్సిపాల్ సవిత తో కలిసి ఆమె ప్రవేశాల కరపత్రాన్ని ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ అర్హత గల విద్యార్థినులు మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 22 న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకునిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# క్షయ రహిత జిల్లాగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం

### నాసా ర్ పూర లో 'టీబీ ముక్త్ భారత్' కార్యక్రమం నిర్వహణ

**వుదయం, సిద్దిపేట:**



క్షయ వ్యాధి నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'టీబీ ముక్త్ భారత్' కార్యక్రమాన్ని నాసర్పుర పట్టణ ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ గారు, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ నిర్మలారెడ్డి గారి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మధుమేహంతో బాధపడుతూ క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న 45 మందికి ఎక్స్‌రే, తెమడ పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన నివారణ చర్యలు, జాగ్రత్తలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ గారు మాట్లాడుతూ, సిద్దిపేట జిల్లాను క్షయ రహిత జిల్లాగా మార్చడమే ప్రభుత్వంతో పాటు వైద్యశాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి రోగిలో క్షయ లక్షణాలు ఉన్నాయా లేదా గుర్తించాలని, లక్షణాలు ఉన్నవారికి వెంటనే తెమడ పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే డాట్ ( డి ఓ టి) పద్ధతి ద్వారా చికిత్స ప్రారంభించాలని వైద్య సిబ్బందికి సూచించారు.అలాగే క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు కూడా నివారణ చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. క్షయ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని స్పష్టం చేశారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తెమడ పరీక్షలు చేయించుకొని వ్యాధి నిర్ధారణ చేసుకోవాలని ప్రజలను కోరారు. క్షయ ఛాంపియన్ల అనుభవాలను ఇటువంటి అవగాహన కార్యక్రమాల్లో వినియోగించి ప్రజల్లో భయం తొలగించాలని, క్షయ వ్యాధిగ్రస్తుల పట్ల ప్రేమ, అభిమానంతో వ్యవహరించాలని సూచించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ మందులు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. క్షయ వ్యాధి పూర్తిగా నయమయ్యే వ్యాధేనని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ నిర్మలా రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ యాదవ్, డాక్టర్ రాజు, డాక్టర్ మనోహర్, ఆరోగ్య సిబ్బంది మల్లయ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దుద్దెడ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు భూమి పూజ చేసిన సర్పంచ్

**వుదయం, కొండపాక**



అభివృద్దే ధ్యేయంగా అడుగులు వేస్తున్నారు నూతనంగా ఎన్నికైన సర్పంచులు. ఇందులో భాగంగానే గురువారం రోజు దుద్దెడ గ్రామ బీసీ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు భూమి పూజ చేశారు సర్పంచ్ మిద్దె శివకుమార్. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో భాగంగా మురికి నీరు కనపడకుండా, పరిశుభ్రత పాటించాలనే ఉద్దేశంతో మా పాలకవర్గ సమిష్టి నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఇవుడు మొదలుపెట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు గాను గతంలోనే 60 లక్షలరూపాయలు మంజూరై సిద్ధంగా ఉన్నాయని, పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను కోరారు సర్పంచ్. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు ఆరేపల్లి మహాదేవ్, పెద్దంకుల శ్రీనివాస్, ఉప సర్పంచ్ పల్లె జానకి యాదగిరి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొమ్ము మల్లికార్జున్ మాదిగ, వార్డు సభ్యులు గూడెం శంకర్, పాతర్ల కొండల్, కందుగుల నవీన కరుణాకర్, మహమ్మద్ నవీద్, కొమ్ము కవిత స్వామి, పంజా యశోదర అఖిల్, గున్నాల నరేష్, గొడుగు రాజు, నాయకులు అనంతుల నరేందర్, దోమల ఎల్లం, ఆరేపల్లి శ్రీనివాస్, మంచాల చిన్న శ్రీనివాస్, షేక్ ఖలీల్, బూర్గుల రాజు, మహమ్మద్ నూరుద్దీన్, పంజా చిరంజీవి, జికూరు యాదగిరి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి టెండర్లపై సిట్ విచారణ జరపాలి: బీఆర్ఎస్ నేతలు

**వుదయం, సిద్దిపేట:**



రాష్ట్రానికి ఆయువుపట్టైన సింగరేణిని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి తన సంబంధికులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాల సాయిరాం, ఎడ్ల సోమిరెడ్డిలు ఆరోపించారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో కోలా రమేష్ గౌడ్‌తో కలిసి వారు మాట్లాడారు. 137 ఏళ్ల చరిత్ర, 50 వేల మంది ఉద్యోగులు ఉన్న సింగరేణిని ఔట్సోర్సింగ్ సంస్థలా మార్చుతున్నారని విమర్శించారు. నైని కోల్ బ్లాక్ టెండర్లను సీఎం బావమరిది సృజన్ రెడ్డికి కట్టబెట్టేందుకే ఈ వ్యవహారం సాగుతోందన్నారు. టెండర్లపై కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి సుమోటో కేసు నమోదు చేసి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలు అమలు చేయడంలో సీఎం విఫలమయ్యారని, ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్న మాజీ మంత్రి హరీష్ రావుపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. సింగరేణి టెండర్లపై సిట్ విచారణ జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వ బాగోతం బయటపడుతుందని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు ఆంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు, రైతులకు భూసార పరీక్షలపై అవగాహన

**ఖానాపురం, వుదయం:**

**కృషి విజ్ఞాన కేంద్రము మామునూరు శాస్త్రవేత్త సాయిచంద్**



ఏడవ తరగతి నుండి ఇంటర్మీడియట్ విద్యార్థులకు రైతులకు భూసార పరీక్షలపై కృషి విజ్ఞాన కేంద్రం మామునూరు శాస్త్రవేత్త సాయిచంద్ అవగాహన కల్పించారు. మండలంలోని బుధరావుపేట మోడల్ స్కూల్ లో చదువుకునే ఏడవ తరగతి నుండి ఇంటర్మీడియట్ విద్యార్థులకు రైతులకు భూసార పరీక్షలు ఏ విధంగా చేయాలి మట్టి నమూనాలు భూమి నుండి ఏ విధంగా సేకరించాలి అనే అంశాలపై విద్యార్థులకు రైతులకు ప్రాక్టికల్ గా కిట్ల ద్వారా భూసార పరీక్షలు చేసి చూపించి అవగాహన కల్పించి పంట నేల స్వభావాన్ని బట్టి ఆయా పంటలు సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు రైతులు పొందే అవకాశం ఉంటుందని విద్యార్థులకు రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భోగ శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ సునీత, సైన్స్ ఉపాధ్యాయుడు శ్రీనివాస్, వ్యవసాయ విస్తరణ అధికారులు చందన, అంకుష్ అలీ, విద్యార్థులు రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మైలారం ఉపసర్పంచినీ బాల్యమిత్రుడు సన్మానం..

**రాయపర్తి వుదయం:**



మండలం మైలారం గ్రామానికి చెందిన లేతకుల రత్నాకర్ రెడ్డి ఇటీవల స్థానిక సంస్థ ఎన్నికలలో మైలారం గ్రామానికి ఉపసర్పంచిగా లేతకుల రత్నాకర్ రెడ్డిని ఎన్నుకున్న సందర్భం గా గురువారం రాయపర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ ఉన్నత పాఠశాలలో ఉప సర్పంచ్ లేత ఆకుల రత్నాకర్ రెడ్డిని శాలువాతో సన్మానం చేసిన వారు. బాల్యమిత్రులు నాగమళ్ళ సంతోష్, ఐత బాబు దళిత రత్న అయిత మల్లేష్, రజిని, కవిత, స్వప్న, సరిత, సలహా మంజుల సునీత రాధిక,రత్నాకర్, రవి, పురుషోత్తం రియాజ్ వీరస్వామి రాజమౌళి లింగయ్య సోమేశ్వర్, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**వర్ధన్నపేట, వుదయం:**

**ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్**



వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన భూమి పూజ కార్యక్రమాన్ని వర్ధన్నపేట శాసనసభ్యులు కె.ఆర్. నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్‌లు గురువారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ రవీందర్ రావు, అధికార ప్రతి నిధి శేఖర్ రావు, వర్ధన్నపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎద్దు సత్యం, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఆర్థిక స్థోమత లేని నిరుపేదలకు ఒక్క రూపాయి ఖర్చుకాకుండా ఒక సంస్థ ద్వారా ఇల్లు నిర్మించేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి నిరుపేదకు సొంత ఇల్లు కలిగి ఉండాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టిందన్నారు. గత పాలకుల మాదిరిగా మాటలకే పరిమితం కాకుండా ప్రజలందరికీ న్యాయం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.తెలంగాణ ముఖ్యమంత్రి ప్రజల సంక్షేమాన్ని ప్రధానంగా తీసుకుని పని చేస్తున్నారని, గూడు లేని ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు అందేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని ఆయుబ్ తెలిపారు.

# హైకోర్ట్ స్పష్టమైన తీర్పు బీసీ వర్గాల హక్కులకు బలమైన మద్దతు

**జయశంకర్ భూపాలపల్లి వుదయం:**

నకిలీ బీసీ కుల ధ్రువీకరణపై హైకోర్ట్ స్పష్టమైన తీర్పుబీసీ వర్గాల హక్కులకు బలమైన మద్దతు అని కాళేశ్వరం గ్రామా రెడ్డి గాండ్ల కులానికి చెందిన వ్యక్తి నకిలీగా బీసీ గాండ్ల కుల ధ్రువీకరణ పత్రం పొందిన అంశంపై దాఖలైన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్ట్ సమగ్రంగా పరిశీలించి న్యాయం చేయడం బీసీ వర్గాలకు సాధించిన కీలక విజయమని కాళేశ్వరం బీసీ ఐక్య వేదిక అధ్యక్షులు అడప సమ్మయ్య తెలిపారు.గురువారం కాళేశ్వరం హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ నిజమైన బీసీ వర్గాల హక్కులను పరిరక్షించిన తెలంగాణ హైకోర్ట్ గౌరవ న్యాయమూర్తులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కేసులో వాస్తవాలను గుర్తించి స్పష్టమైన లిఖితపూర్వక నివేదికలు అందించిన తెలంగాణరాష్ట్ర బీసీ కమిషన్‌తోపాటు తాసిల్దార్‌ల పాత్రను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు.తెలంగాణ హైకోర్ట్ ఇచ్చిన ఆదేశాలు మరియు సూచనల మేరకు బీసీ కమిషన్, తాసిల్దార్‌ల లేఖల ఆధారంగా నకిలీ బీసీ గాండ్ల కుల ధ్రువీకరణ పత్రంతో ఎన్నికైన ఎన్నికను జిల్లా కలెక్టర్ తక్షణమే రద్దు చేసి నిజమైన బీసీ వర్గాలకు న్యాయం చేయాలని అడప సమ్మయ్య డిమాండ్ చేశారు.

# సిద్దిపేట నిరుద్యోగ యువతకు హరీష్ అన్న గుడ్ న్యూస్

**వుదయం, సిద్దిపేట:**



నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు, మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. హైదరాబాద్ వెళ్లి కోచింగ్ తీసుకోవాల్సిన అవసరం లేకుండా, ఇంటి నుంచే ఉచితంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా 'హరీష్ అన్న ఉద్యోగ యాప్' ను రూపొందించారు.ఈ యాప్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన 57 రకాల పోటీ పరీక్షలకు సిద్ధం చేసేలా 2,000 గంటల వీడియో క్లాసులు, 400 నమూనా ప్రశ్నాపత్రాలు, 4,000 స్టడీ మెటీరియల్, పిడిఎఫ్‌లు అందుబాటులో ఉన్నాయి. రోజువారీ టెస్టులు, సందేహాల నివృత్తి, ఉద్యోగ ప్రకటనలు, క్యాంపస్ రిక్రూట్మెంట్ సమాచారం కూడా ఇందులో పొందుపరిచారు.తెలుగు, ఆంగ్ల భాషల్లో క్లాసులు వీక్షించే సదుపాయం ఉండగా, మొదటి విడతలో సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన వెయ్యి మంది నిరుద్యోగ యువతకు సంవత్సరం పాటు ఉచితంగా అవకాశం కల్పించనున్నారు.హైదరాబాద్‌లో కోచింగ్, రూమ్ కిరాయి వంటి ఖర్చులతో ఒక్కో యువతపై పడుతున్న రూ.50 వేల నుంచి లక్ష వరకు వ్యయం తగ్గించాలనే ఉద్దేశంతో హరీష్ రావు గారు తన స్వంత ఖర్చులతో ఈ యాప్‌ను రూపొందించారు.రేపు శుక్రవారం సిద్దిపేటలో ఈ యాప్‌ను అధికారికంగా ప్రారంభించనున్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగ సాధనలో ముందడుగు వేయాలని హరీష్ రావు గారు పిలుపునిచ్చారు.

# మెనూ తప్పితే చర్యలు.. పనుల్లో జాప్యమైతే సహించం

**తిమ్మాపూర్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఆకస్మిక తనిఖీ**

**తహసీల్దార్ కార్యాలయాల్లో ఎలక్టోరల్ మ్యాపింగ్‌పై సమీక్ష**

**అధికారుల పనితీరుపై అసహనం..**

**వంద శాతం లక్ష్యంగా పనిచేయాలని ఆదేశం**

**సిద్దిపేట, వుదయం**



సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి గురువారం క్షేత్రస్థాయిలో మెరుపు పర్యటనలు నిర్వహించి అధికారులను పరుగులు పెట్టించారు. అటు విద్యా వ్యవస్థను, ఇటు రెవెన్యూ యంత్రాంగాన్ని పర్యవేక్షిస్తూ బాధ్యతారాహిత్యాన్ని ఏమాత్రం సహించబోనని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించి.. భోజనాన్ని రుచి చూసిజగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ప్రక్రియను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్వయంగా విద్యార్థులకు వడ్డిస్తున్న బగారా అన్నం, ఆలుగడ్డ-చిక్కుడు-టమాటా కూరలను పరిశీలించి రుచి చూశారు. వంట సిబ్బందికి పలు సూచనలు చేస్తూ.. విద్యార్థుల అన్నానికి సరిపోయేంత కూరను తప్పనిసరిగా వేయాలని ఆదేశించారు. ప్రభుత్వ మెనూను కచ్చితంగా పాటించాల్సిందే. ఎవరి ఇష్టానుసారంగా వారు వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం అని కలెక్టర్ హెచ్చరించారు. విద్యార్థుల వద్దకు వెళ్లి కూర్చుని.. కూరలో ముక్కలను పారవేయకుండా అన్నీ నమిలి తినాలని పిల్లలకు సూచించారు. విద్యార్థులు కూర్చున్న చోటికే వెళ్లి వడ్డించాలని సిబ్బందిని ఆదేశించడంతో పాటు, విద్యార్థుల చదువు, భోజనం విషయంలో రాజీ పడవద్దని ప్రిన్సిపల్, ఉపాధ్యాయులకు స్పష్టం చేశారు. ఎలక్టోరల్ మ్యాపింగ్‌లో జాప్యంపై ఆగ్రహం పాఠశాల పర్యటన అనంతరం జగదేవ్‌పూర్, కొండపాక మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో జరుగుతున్న ఎలక్టోరల్ మ్యాపింగ్ ప్రక్రియను కలెక్టర్ సమీక్షించారు. పనులు మందకొడిగా సాగుతుండటంపై ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణ,మ్యాపింగ్పనులను 100 శాతం పూర్తిచేయాలని, వార్డులవారీగా జీపీఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

# ఉప సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయాలని మంత్రి కు వినతి

**జయశంకర్ భూపాలపల్లి, వుదయం:**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న సర్పంచుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం మంత్రి సీతక్క సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ గ్రామాల 100 మంది సర్పంచులు మంత్రిని కలిసి ఉప సర్పంచులకు ఉన్న చెక్ పవర్‌ను రద్దు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.గ్రామ అభివృద్ధి పనుల అమలులో సర్పంచుల అధికారాలకు ఆటంకం కలుగుతుందని, చెక్ పవర్ కారణంగా పరిపాలనా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు మంత్రికి వివరించారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన నిర్ణయం తీసుకోవాలని సర్పంచులు కోరారు. సర్పంచుల సమస్యలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గురుసింగబాపు, చంద్రశేఖర్ రెడ్డి, హసీనా భానో అక్బర్ ఖాన్, మేకల శంకరమ్మ, చల్ల సమ్మిరెడ్డి, సంజీవరెడ్డి, నీర్ల ప్రభాకర్, సరిత, తోపాటు పలువురు సర్పంచ్లు పాల్గొన్నారు,

# చేనేత కార్మికులు ఎదుర్కొనే సమస్యలు పరిష్కరించాలి

**జయశంకర్ భూపాలపల్లి, వుదయం:**



చేనేత కార్మికులు ఎదుర్కొనే సమస్యలన్నీ ప్రభుత్వం గుర్తించి పరిష్కరించాలని పద్మశాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భీమనాధుని సత్యనారాయణ కోరారు. గురువారం మొగులపల్లి గ్రామంలో పర్యటించిన ఆయన ఇటీవల మొగుళ్లపల్లి గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఎనిమిదవ వార్డు నంబర్ గా గెలుపొందిన చిలుకమారి శ్రీనివాస్ ను మొగుళ్లపల్లి మండల కేంద్రంలో పద్మశాలి సంఘం నాయకులతో చేనేత కార్మికులతో కలిసి ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా పద్మశాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భీమనాధుని సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ శ్రీనివాస్ వార్డ్ నెంబర్ గా గెలుపొందడం ఆనందదాయకమని మొగుళ్ళపల్లి సమగ్ర అభివృద్ధి కోసం పాలక మండలి అందరూ కృషి చేయాలని అన్నారు అలాగే చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న అనేక ఇబ్బందులను సత్యనారాయణ అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా చేనేత కార్మికులు పొద్దంతా కష్టపడితే 200 రూపాయల కూడా కూలి గిట్టుబాటు కావడం లేదని కావున రాష్ట్ర ప్రభుత్వం నెలకు 20 వేల రూపాయలు కూలిగిట్టుబాటు అయ్యే విధంగా పని కల్పించాలని ప్రతినెల చేనేత బంధు పథకం కింద ₹2,000 నేత కార్మికునికి కండెల చుట్టే వారికి 500 రూపాయలు గత ప్రభుత్వంఅందించిన విధంగానే ఈ ప్రభుత్వం కూడా అందించి చేనేత కార్మికులకు చేయూతనివ్వాలని కోరారు. 50 నిండిన చేనేత కార్మికులకు వృద్ధాప్య పింఛను వెంటనే మంజూరు చేయాలని చేనేత కార్మికుల సమస్యల పరిష్కరించే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించాలని కోరారు.

# సర్పంచ్ హసీనా బానో అక్బర్ ఖాన్ కు సన్మానం

**జయశంకర్ భూపాలపల్లి వుదయం:**



మహాదేవపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ గా ఎన్నికైన హసీనా బానో అక్బర్ ఖాన్ లను మహాదేవపూర్ మండల విద్యాశాఖ అధికారి పురుషోత్తం రెడ్డి శాలువాలతో సన్మానించారు నూతనంగా మహాదేవపూర్ మండల విద్యాశాఖ అధికారిగా నియమితులైన పురుషోత్తం రెడ్డి ఉపాధ్యాయులతో కలిసి గురువారం సర్పంచ్ నివాసంలో సర్పంచ్ ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందిస్తూ శుభాకాంక్షలు తెలుపుతూ శాలువలతో ఘనంగా సన్మానించారు. అదే క్రమంలో నూతనంగా నియమితులైన ఎంఈఓ పురుషోత్తం రెడ్డి ను సర్పంచ్ హసీనాబానో అక్బర్ ఖాన్ లు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపికృష్ణ, రవీందర్, రాజయ్య, ఎమ్మార్సీ అటెండర్ శ్రీనివాస్, తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# గూడెం సబ్ స్టేషన్ శంకుస్థాపన

**ఆసిఫాబాద్, వుదయం**



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చింతలమానెపల్లి మండలం గూడెం వద్ద నూతనంగా నిర్మించనున్న 33/11 కె.వి సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ ఈ సబ్ స్టేషన్ నిర్మాణం వలన చింతలమానెపల్లి మండలంలోని మారుమూల ప్రాంతాలతో పాటు బెజ్జూర్ మండలంలోని గ్రామాలకు కూడా ఓల్టేజ్ స్టెబిలిటీ వస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ శాసనసభ్యురాలు శ్రీమతి కోవలక్ష్మి , ఎమ్మెల్సీ దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె.హరిత, అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధువరులను ఆశీర్వదించి ఆర్థిక సహాయం అందించిన బాల్యమిత్రులు

**రాయపర్తి వుదయం:**

వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రానికి చెందిన తమ బాల్య మిత్రులు ఎండీ యూసఫ్ పద్మ కూతురు రేష్మా – షరీఫ్ వివాహం వర్ధన్నపేట ఎబిఎస్ గార్డెన్స్ లో జరుగగా ఈ వివాహ వేడుకలో పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించి, బాల్యమిత్రులు 55వేలు ఆర్థిక సహాయం, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో బాల్యమిత్రులు ఫౌండేషన్ చైర్మన్, పరుపాటి శ్రీనివాస్ రెడ్డి, నాగమల్ల సంతోష్, ఐత బాబు, దళిత రత్న అయిత మల్లేష్, రజిని, స్వప్న కవిత, గజావెల్లి ప్రసాద్, గాదె రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ గురుకుల క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్, వుదయం:**

జక్కులొద్దీ మైనార్టీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో గురువారం మైనార్టీ గురుకుల క్యాలెండర్‌ను వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మైనార్టీ విద్యకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మైనార్టీశాఖ మంత్రి అజారుద్దీన్, మైనార్టీ రెసిడెన్షియల్ చైర్మన్ ఫైమ్ ఖురేషిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 2026–27 విద్యా సంవత్సరంలో మైనార్టీ విద్యార్థులు అధిక సంఖ్యలో మైనార్టీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు పొందాలని ఆయన కోరారు. గురుకులాలలో నాణ్యమైన విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ, విద్యార్థుల మానసిక వికాసానికి అనుగుణంగా పాఠశాలలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఉచిత వసతి, భోజన సదుపాయాలతోపాటు నాణ్యమైన విద్య అందిస్తున్న మైనార్టీ గురుకుల పాఠశాలలను మైనా ర్టీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, తమకు తెలిసిన విద్యార్థులను కూడా గురుకులాల్లో చేర్చేలా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు కమలుద్దీన్, కాంగ్రెస్ నాయకులు ఆరేళ్ల రవి, అయితే క్రాంతి తదితరులు.

# షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

**కరీంనగర్, వుదయం;**

కరీంనగర్ జిల్లా సైదా పూర్ మండల కేంద్రంలోని ఎస్సీ కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాల నిర్వహణకు 3,4,5 నంబరు గల షెట్టర్లను అద్దెకిచ్చేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ ఇడి ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఈ స్థలాల్లో షాపులు అద్దెకు తీసుకున్న వారు నిబంధనలను అతిక్రమించినందున వారి లీజును రద్దు పరిచినట్లు పేర్కొన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నిరుద్యోగ యువత ఈ షెట్టర్లను అద్దె తీసుకునేందుకు ఈ నెల 27వ తేదీ లోపు దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. అభ్య ర్థులు కరీంనగర్ జిల్లాకు చెందిన వారై ఉండి, 21 నుండి 50 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని తెలిపారు. కనీసం ఐదవ తరగతి చదివి ఉండి రెండు లక్షలకు మించి సంవత్సరాదాయం ఉండని వారు అర్హులుగా ఆయన పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు కరీంనగర్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తులను ఉచితంగా పొందవచ్చని తెలిపారు.

# పల్లెపహాడ్‌లో ఎగిరిన గులాబీ జెండా మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయం

**గజ్వేల్, వుదయం ప్రతినిధి**



రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో గజ్వేల్ గడ్డపై మరోసారి గులాబీ జెండా రెపరెపలాడటం ఖాయమని బీఆర్ఎస్ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గురువారం ఆర్అండ్ఆర్ కాలనీ పల్లెపహాడ్ 8వ వార్డులో వార్డు అధ్యక్షుడు సింగరమైన నాగరాజు ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎనిమిదవ వార్డు ఇన్‌చార్జ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అమరేందర్ తో పాటు రాయవరం సర్పంచ్ రమేష్ గౌడ్, చిన్న కృష్ణాపురం మాజీ సర్పంచ్ కనకయ్య, రాయవరం మాజీ సర్పంచ్ గణేష్, సీనియర్ నాయకులు గౌటి సంపత్, రిప్పల స్వామి, అంబటి బాలచందర్ గౌడ్, గ్రామ మాజీ జెడ్పిటిసి రాములు, మాజీ సర్పంచ్ మల్లేశం గౌడ్, తాజా మాజీ సర్పంచ్ నంద్య, పార్టీ సీనియర్ నాయకులు కనకయ్య, కొమ్ము నరేష్ యాదవ్, గుగ్గులోతు శివకుమార్ తదితరులు పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో గజ్వేల్ చైర్మన్ పీఠాన్ని మరోసారి బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకోబోతోందని గట్టి విశ్వాసాన్ని తెలియజేశారు. గజ్వేల్ నియోజకవర్గంలో జరిగిన అద్భుతమైన అభివృద్ధి కేవలం కేసీఆర్ హయాంలోనే సాధ్యమైందని, ఈ అభివృద్ధిని కళ్లారా చూస్తున్న ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి కేసీఆర్ కి విజయ కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వారు తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిందని, తెలంగాణ రాష్ట్రం ప్రగతికి ఆమడ దూరంలో నిలిచిపోయిందని ఆరోపించారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటు ద్వారా తగిన బుద్ధి చెబుతారని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ పాఠశాల అడ్మిషన్ల ప్రచార పత్రం ఆవిష్కరణ

**జయశంకర్ భూపాలపల్లి వుదయం:**



భూపాలపల్లి మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రవేశాల కోసం రూపొందించిన గోడ పత్రికను గురు వారం మైనార్టీ నాయకులు మైనారిటీ పెద్దలతో కలిసి అధికారులు ఆవిష్కరించారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ రవి కోరారు. ఉచిత వసతి, నాణ్యమైన విద్య కోసం వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ బ్లాక్ కాంగ్రెస్ మైనారిటీ ప్రెసిడెంట్ అన్సార్ ఖురేషి యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మరియు వార్డు సభ్యులు యుండి నయా మొద్దీన్తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు ఎస్ఆర్ఆర్ చేయూత..

**రాయపర్తి వుదయం:**



మండలం పేర్కవేడు, గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అయిన నిమ్మల మల్లయ్య భార్య నిమ్మల పెద్ద ఐలమ్మ అనారోగ్యంతో మరణించగా, ఉప్పాల కైలాసం, వారి భౌతిక కాయానికి ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాసరెడ్డి పూల మాల వేసి నివాళ్లు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమం లో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు లేతకుల రంగా రెడ్డి, ఐత రామ్ చందర్, సంకినేని ఎల్లస్వామి, ల్యాదేళ్ల ప్రశాంత్, బొమ్మెర వీరాస్వామి,బండి రాజబాబు, చిన్నల రాజబాబు, బసబోయిన సుధాకర్, ఆకుల సమ్మయ్య, నిమ్మల మధు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు వేదికలో వ్యవసాయ విద్యార్థుల పి.ఆర్.ఏ కార్యక్రమం

**పరకాల జనవరి 22 (వుదయం ప్రతినిధి):**



నడికూడ మండలం కంఠాత్మకూర్ గ్రామంలోని రైతు వేదిక, వేదికగా వరంగల్ వ్యవసాయ కళాశాల బి.ఎస్.సి (ఆనర్స్) అగ్రికల్చర్ చివరి సంవత్సరం విద్యార్థులు, తమ గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమం (RAWEP) లో భాగంగా ఈరోజు 'పార్టిసిపేటరీ రూరల్ అప్రైజల్' (పి ఆర్ ఏ) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శాస్త్రవేత్త రాజ్‌కుమార్ మరియు ఏ.ఈ.ఓ ( ఏఈఓ) గోపి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు అచ్యుత్ జోషి, ఎండి. అఫ్సాన్, టి. రంజిత్, హెచ్. శివశంకర్, జె. సాయికుమార్, మరియు కె. సురేష్ రైతులతో కలిసి గ్రామానికి సంబంధించిన సోషల్ అండ్ రిసోర్స్ మ్యాపింగ్, ట్రాన్సెక్ట్ వాక్, వెన్ చిత్రం మరియు కాలక్రమ పట్టిక వంటి వివిధ అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తి చేశారు. గ్రామ వనరులు, సాగు పద్ధతులు మరియు రైతుల సమస్యలను శాస్త్రీయంగా అంచనా వేయడానికి ఈ ప్రక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొంగంటి తిరుపతి, పంచాయతీ కార్యదర్శి భార్గవి పాల్గొని విద్యార్థులకు అవసరమైన మద్దతును అందించారు. అలాగే స్థానిక జె పి హెచ్ ఎస్ మరియు ఎంపీపీఎస్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు సేకరించిన సమాచారాన్ని, రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో అర్థం చేసుకోవడాన్ని సర్పంచ్ మరియు అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు మరియు స్థానిక రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## గర్భిణులకు.. చలికాలపు చిట్కాలు!



చలికాలంలో రోగనిరోధక శక్తి కొంతమందిలో తగ్గిపోతుంది. గర్భిణుల్లో దీని ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది. వీటికి తోడు జలుబు, దగ్గు, కీళ్లు పట్టేయడం, పొడి చర్మం.. వంటి సమస్యలు ఈ కాలంలో మరికొంతమందిని ఇబ్బంది పెడుతుంటాయి. అలాగని కంగారు పడకుండా చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకుంటే.. చలికాలంలోనూ ప్రెగ్నెన్సీని ఆరోగ్యంగా ఆస్వాదించచ్చని చెబుతున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి.. వాతావరణం కాస్త చల్లగా ఉంటే చాలు అస్సలు దాహం వేయదు. అలాగని నీళ్లు తాగకుండా ఉంటే డీహైడ్రేషన్ బారిన పడే ప్రమాదం ఉంది. గర్భిణులు ఈ విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. ఎందుకంటే శరీరంలో నీటి స్థాయిలు తగినంత లేకపోతే కొన్నిసార్లు ఉమ్మనీరు తగ్గిపోయే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు. ఇది బిడ్డ ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపుతుందంటున్నారు. అంతేకాదు.. ఇదిలాగే కొనసాగితే నెలలు నిండకుండానే బిడ్డ పుట్టే అవకాశాలూ లేకపోలేదంటున్నారు. కాబట్టి ఏ కాలమైనా డాక్టర్ సలహా మేరకు తగినంత మోతాదులో నీళ్లు తాగడం మంచిది. అలాగే మధ్యమధ్యలో కొబ్బరి నీళ్లూ తాగుతుండాలి. ఫలితంగా ఇమ్యూనిటీ పెరిగే అవకాశం ఉంటుంది. అలాగే ఈ సీజన్‌లో లభించే జామ, కమలాఫలం.. వంటి పండ్లను తీసుకున్నా రోగనిరోధక శక్తిని పెంచుకోవచ్చు. చలికాలంలో చాలామందిని వేధించే సమస్య కీళ్ల నొప్పులు. చల్లటి గాలులకు శరీరంలోని రక్తనాళాలు కుచించుకుపోయి రక్తప్రసరణ నెమ్మదిగా జరుగుతుంటుంది. తద్వారా కండరాలు, కీళ్లు బిగుసుకుపోవడమే కాదు.. గుండెకూ రక్తప్రసరణ సాఫీగా సాగదంటున్నారు నిపుణులు. గర్భిణుల్లో ఇలాంటి సమస్యలుంటే అది కడుపులో ఎదిగే బిడ్డకూ ప్రమాదమేనట! కాబట్టి ఇలాంటి సమస్యలున్న వారు డాక్టర్ సలహా మేరకు సంబంధిత నిపుణుల చేత అరోమా థెరపీ తీసుకోవాలి. దీనివల్ల శారీరక నొప్పులు తగ్గడమే కాదు.. చురుకుదనమూ వస్తుందంటున్నారు. చలికాలంలో చర్మం పొడిబారడం వల్ల దురద, మంట.. వంటి సమస్యలు ఎదురవుతుంటాయి. ఇక గర్భిణుల్లోనైతే పొట్ట పెరిగిన కొద్దీ చర్మం సాగుతూ పగులుతుంటుంది. తద్వారా ఆ ప్రదేశంలో దురద ఎక్కువవుతుంది. దీనివల్ల ముందు ముందు స్ట్రెచ్‌మార్క్స్ ఏర్పడతాయి. అందుకే డాక్టర్ సలహా మేరకు ప్రత్యేక క్రీములు, లోషన్లు, నూనెలు వాడచ్చు. వాటితో రోజుకు ఒకటి లేదా రెండుసార్లు పొట్ట భాగంలో నెమ్మదిగా మర్దన చేసుకోవడం వల్ల.. అటు రక్తప్రసరణ మెరుగవడంతో పాటు, ఇటు చర్మం పొడిబారకుండానూ జాగ్రత్తపడచ్చు.. అలాగే ప్రసవానంతరం స్ట్రెచ్‌మార్క్స్ రాకుండా కూడా ఈ చిట్కా తోడ్పడుతుందంటున్నారు నిపుణులు. ఇదే కాదు.. గర్భిణిగా ఉన్నప్పుడు చర్మానికి వాడే సౌందర్య ఉత్పత్తుల్నీ డాక్టర్ సలహా మేరకు మాత్రమే వాడాల్సి ఉంటుంది. అప్పుడే పుట్టబోయే బిడ్డపై వాటి ప్రభావం పడకుండా జాగ్రత్తపడచ్చంటున్నారు. చలికాలం ఉదయాన్నే లేవాలంటే ఒళ్లు బద్ధకిస్తుంది.. దీనికి తోడు గర్భం ధరించిన మూడు నాలుగు నెలల పాటు వేవిళ్ల సమస్య వేధిస్తుంటుంది. ఫలితంగా శరీరం మరింత నీరసించిపోయే ప్రమాదం ఉంది. వీటన్నింటి వల్ల కడుపులో పెరిగే బిడ్డ పైనా ప్రతికూల ప్రభావం పడే అవకాశాలు ఉంటాయంటున్నారు నిపుణులు. అందుకే వీటికి చెక్ పెట్టి.. రోజంతా ఉత్సాహంగా ఉండాలంటే వ్యాయామం, ధ్యానం, యోగా.. వంటివి రోజువారీ రొటీన్‌లో భాగం చేసుకోమంటున్నారు. అది కూడా నిపుణుల సలహా మేరకు సౌకర్యంగా ఉండే వ్యాయామాలే చేయాల్సి ఉంటుంది. వర్కవుట్ వల్ల శరీరం ఉత్తేజితమవడంతో పాటు మనసుకూ ప్రశాంతత చేకూరుతుందంటున్నారు నిపుణులు.

## చెరకుగడ లాభాలు..

చెరకు గడను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. చెరకు గడను నేరుగా తీసుకోవడం వల్లే ఎక్కువ లాభాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. చెరకుగడ.. చక్కెర, బెల్లంకు ముడి సరకు అయిన దీనిని మనం చాలా తక్కువగా తీసుకుంటాం. మార్కెట్లు, బజార్లలో వీటిని ఎక్కువగా అమ్ముతుంటారు. కానీ, మనం ఎక్కువగా వీటిని పట్టించుకోం. కొన్నిసార్లు చెరకు రసం జ్యూస్ రూపంలో తీసుకుంటాం. కానీ, చెరకు గడను నేరుగా తీసుకోవడం వల్లే ఎక్కువ లాభాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. చెరకు రసం తాగితే లాభం ఉంటుందని చాలా మందికి తెలిసినప్పటికీ.. చెరకుగడ తినడం ఆరోగ్యానికి ఇంకా మంచి ప్రయోజనాలు ఉన్నాయి. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. చెరకు గడలో ఫైబర్ అధికంగా ఉంటుంది. దీని వల్ల పేగులు సక్రియంగా పనిచేస్తాయి. జీర్ణం మెరుగవుతుంది. అజీర్ణం తగ్గుతుంది. గ్యాస్ సమస్య తగ్గుతుంది. చెరకు గడను తినడం వల్ల బరువు నియంత్రణలో ఉంటుంది. ఎందుకంటే.. ఇది ఆకలిని నియంత్రిస్తుంది. తక్కువ తింటారు. దీంతో బరువు తగ్గడానికి ఇది సహాయపడుతుంది. ఇది ''నేచురల్ డైట్ ఫైబర్'' లా పని చేస్తుంది. చెరకు గడలో ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల ఆహారంలో ఉండే షుగర్ శరీరంలో వేగంగా జీర్ణం అవుతుంది. దీంతో రక్తంలో గ్లూకోస్ స్థాయి స్టేబుల్ అవుతుంది. డయాబెటిస్ ఉన్నవారికి కూడా మితంగా మంచిది. కానీ, డయాబెటిస్ ఉన్నవారు డాక్టర్ సూచన మేరకు మాత్రమే తినాలి. ఇది కాలేయ ఆరోగ్యానికి కూడా మంచిది. చెరకు గడలో ఉండే పోషకాలు శరీరాన్ని డీటాక్స్ చేస్తాయి. అందువల్ల కాలేయం క్లీనింగ్ అవుతుంది. విషకణాలు బయటకు బయటకు పోతాయి. శరీరం శుభ్రంగా ఉంటుంది. శరీరంలో నీటి సమతుల్యతను కాపాడుతుంది. చెరకు గడ తినడం వల్ల శరీరంలో నీటి సమతుల్యత నిల్వ ఉంటుంది. దీని వల్ల డీహైడ్రేషన్ తగ్గుతుంది. చర్మం మృదువుగా ఉంటుంది. వేడిలో శరీరం తేమగా ఉంటుంది. చెరకు గడలో ఉండే ఫైబర్, విటమిన్స్, ఖనిజాలు హృదయానికి కూడా ఉపయోగపడతాయి. కాలేయంలో కొవ్వు తగ్గించడంలో సహాయం చేస్తుంది. కొలెస్ట్రాల్ తగ్గించడంలో సహాయం చేస్తుంది. దీంతో హృదయ ఆరోగ్యం మెరుగవుతుంది. చెరకు గడలో ఉండే తీపి పదార్థం శరీరానికి శక్తి ఇస్తుంది. ఇది అలసట తగ్గిస్తుంది. పని చేయడానికి ఎనర్జీ ఇస్తుంది. రోజువారీ శక్తి అవసరాన్ని తీర్చుతుంది.



## బెడ్ మీద కూర్చొని తింటున్నారా..?

మంచం మీద కూర్చుని టీవీ చూస్తూ భోజనం చేసే అలవాటు ఉందా..? అయితే రు తెలియకుండానే పెద్ద ప్రమాదాన్ని కొనితెచ్చుకుంటున్నారు. చూడటానికి ఇది చాలా సౌకర్యంగా అనిపించినా.. జీర్ణ వ్యవస్థను, నిద్రను, చివరికి చర్మాన్ని కూడా ఇది దెబ్బతీస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. చాలామందికి రాత్రిపూట లేదా ఖాళీ సమయాల్లో మంచం మీద కూర్చుని, టీవీ చూస్తూనో లేదా మొబైల్ వాడుతూనో భోజనం చేయడం అలవాటు. ఇది ఎంతో హాయిగా, సౌకర్యంగా అనిపించవచ్చు. కానీ ఈ చిన్న అలవాటు ఆరోగ్యానికి ఎంతటి చేటు చేస్తుందో తెలుసా..? మంచం ద తినడం వల్ల కలిగే అనర్థాలపై ఆరోగ్య నిపుణులు గట్టిగా హెచ్చరిస్తున్నారు. మనం ఆహారం



తిన్నప్పుడు మన శరీరం నిటారుగా ఉండాలి. అప్పుడే ఆహారం అన్నవాహిక ద్వారా కడుపులోకి సులభంగా వెళుతుంది. మంచం ద కూర్చున్నప్పుడు మనం నిటారుగా ఉండము, దీనివల్ల జీర్ణ రసాలు సరిగ్గా ఉత్పత్తి కావు. పడుకుని తినడం వల్ల ఆహారం అన్నవాహికలో ఇరుక్కుపోయే ప్రమాదం ఉంది. ఇది తీవ్రమైన ఎసిడిటీ, గ్యాస్, గుండెల్లో మంటకు దారితీస్తుంది. మంచం ద తింటున్నప్పుడు మన దృష్టి ఆహారం ద కంటే టీవీ లేదా మొబైల్ స్క్రీన్‌పైనే ఎక్కువగా ఉంటుంది. దీనిని మైండ్‌లెస్ ఈటింగ్ అంటారు. అంటే మనం ఎంత తింటు న్నామో మన మెదడుకు సరిగ్గా తెలియదు. దీనివల్ల అవసరానికి మించి ఎక్కువగా తినేస్తాం. ఫలితంగా ఊబకాయం, మధుమేహం వంటి జీవనశైలి వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం ఉంది. మంచం ద తిన్నప్పుడు మనకు తెలియకుండానే చిన్న చిన్న ఆహార కణాలు పరుపులు, దుప్పట్లపై పడతాయి. ఇవి కంటికి కనిపించవు కానీ, బ్యాక్టీరియా, ఇతర కీటకాలను ఆకర్షిస్తాయి. దీనివల్ల చర్మ సంబంధిత అలర్జీలు, ఉబ్బసం ఉన్నవారికి శ్వాస కోశ సమస్యలు పెరగవచ్చు. మంచం పరిశుభ్రంగా లేకపోవడం వల్ల నిద్రలేమి సమస్యలు తలెత్తుతాయి. మెదడు కు మంచం అంటే నిద్రపోయే చోటు అనే సంకే తం ఉంటుంది. కానీ రు అక్కడే తినడం, ల్యాప్‌టాప్ వాడటం చేస్తే.. అది విశ్రాంతి తీసుకోవాల్సిన చోటా లేక పని చేయా ల్సిన చోటా అని మెదడు గందరగోళానికి గురవుతుంది. దీనివల్ల రాత్రి పూట ప్రశాంతమైన నిద్ర కరువవుతుంది.

## చుండ్రుకు చెక్ పెట్టాలంటే..!

వాతా వరణంలో మార్పులు, హార్మోన్ల స్థాయుల్లో హెచ్చుతగ్గులు, జుట్టు-కుదుళ్లను సరిగ్గా శుభ్రం చేసుకోకపోవడం.. ఇలాంటివన్నీ చుండ్రు సమస్యకు కారణమవుతుంటాయి. ఫలితంగా జుట్టు నిర్జీవంగా మారిపోయి రాలిపోతుంటుంది. అయితే ఈ సమస్యకు కొన్ని ఇంటి చిట్కాలు చక్కటి పరిష్కారం చూపుతాయంటున్నారు నిపుణులు. చుండ్రు సమస్యను తగ్గించడంలో పెరుగు, నిమ్మరసం కీలక పాత్ర పోషిస్తాయి. ఇందుకోసం నాలుగు టేబుల్‌స్పూన్ల హెన్నా పొడిలో రెండు టేబుల్‌స్పూన్ల నిమ్మరసం వేసి కలపాలి. ఆపై ఈ మిశ్రమంలో పెరుగు వేస్తూ పేస్ట్ అయ్యేంత వరకు కలుపుతుండాలి. దీన్ని జుట్టు కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించి అరగంట పాటు ఉంచుకోవాలి. ఆపై గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేస్తే సరిపోతుంది. ఈ చిట్కాను రెండు వారాలకోసారి పాటించడం వల్ల క్రమంగా చుండ్రు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. మందార ఆకులు, పువ్వుల్లో ఉండే గుణాలు జుట్టు సమస్యల్ని తగ్గించడంలో దోహదం చేస్తాయి. ఇందుకోసం నాలుగు టేబుల్‌స్పూన్ల హెన్నా పొడిలో ఎండబెట్టి పొడి చేసిన మందార ఆకులు, పువ్వుల పొడిని కొద్దిగా వేసి, ఈ మిశ్రమానికి కాస్త ఉసిరి పొడి, మెంతుల పొడి కలపాలి. ఇప్పుడు ఇందులో కొద్దికొద్దిగా పెరుగు వేసుకుంటూ మృదువైన పేస్ట్‌లా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించి పూర్తిగా ఆరనివ్వాలి. ఆపై గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేస్తే చుండ్రు సమస్య తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు నిపుణులు. జుట్టు ఆరోగ్యానికి మెంతులు ఎంత మంచివో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అందుకే కొన్ని హెయిర్ ప్యాక్‌లలో కూడా వీటిని ఉపయోగిస్తుంటారు. నాలుగు టేబుల్‌స్పూన్ల హెన్నా పొడి, రెండు టేబుల్‌స్పూన్ల నిమ్మరసం, రెండు టేబుల్‌స్పూన్ల పెరుగుతో పాటు ఒక్కో టేబుల్‌స్పూన్ చొప్పున ఆలివ్ నూనె, వెనిగర్, మెంతిపొడి.. వీటన్నింటినీ బాగా కలుపుకొని రాత్రంతా నానబెట్టుకోవాలి. మరుసటి రోజు ఉదయం ఈ మిశ్రమాన్ని కుదుళ్ల నుంచి చివర్ల వరకు అప్లై చేసుకొని రెండుమూడు గంటల పాటు ఆరనివ్వాలి. ఆపై గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేస్తే సరిపోతుంది. ఇలా తరచూ చేయడం వల్ల చుండ్రు సమస్యకు పరిష్కారం లభిస్తుందంటున్నారు నిపుణులు.



## ఇష్టమని ఈ మాంసం తెగ లాగించేస్తున్నారా?

చాలా మందికి ముక్క లేనిదే ఒక్క పూట కూడా ముద్ద దిగదు. చికెన్, మటన్ ఏదైనా సరే తప్పక వారి మెనూలో ఉండాల్సిందే. అయితే చాలా మంది రెడ్ ట్ ఎక్కువగా తింటారు. చాలా మందికి ముక్క లేనిదే ఒక్క పూట కూడా ముద్ద దిగదు. చికెన్, మటన్ ఏదైనా సరే తప్పక వారి మెనూలో ఉండాల్సిందే. అయితే చాలా మంది రెడ్ ట్ ఎక్కువగా తింటారు. కానీ దీనిని ఎక్కువగా తీసుకోవడం వల్ల జరిగే అనర్థాల గురించి పట్టించుకోరు. నిజానికి ఇది ఆరోగ్యానికి ప్రమాదకరం.వారానికి 1 లేదా 2 సార్లు రెడ్ ట్ తినవచ్చు. ఒకేసారి 80 నుంచి 100 గ్రాముల వండిన రెడ్ ట్ తినడం ఆరోగ్య కరం. ఇలా వారానికి మొత్తం 300 నుంచి 350 గ్రాములకు మించకూడదు. ఎందుకంటే ఎక్కువ రెడ్ ట్ తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్, గుండె జబ్బులు, కొవ్వు కాలేయం వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. అందువల్ల రెడ్ ట్ మితంగా తినడం, తక్కువ కొవ్వు ఉన్న ముక్కలను ఎంచుకోవడం, తక్కువ నూనెలో ఉడకబెట్టడం ఆరోగ్యకరం. నిపుణుల ఆహార మార్గదర్శకాల ప్రకారం నెయ్యి, వెన్న, పూర్తి కొవ్వు పాలు వంటి సంతృప్త కొవ్వులతో ఎంత ప్రమాదమో రెడ్ ట్‌తోనూ అంతే ప్రమాదమని చెబుతున్నారు.కొవ్వు కాలేయ రోగులు రెడ్ ట్ తినవచ్చు, కానీ పరిమిత పరిమాణంలో మాత్రమే తీసుకోవాలి. రెడ్ ట్‌లో సంతృప్త కొవ్వు అధికంగా ఉంటుంది. కాబట్టి, దానిని ఎక్కువగా తినడం వల్ల కాలేయంపై ఒత్తిడి పెరుగుతుంది. దీంతో కొవ్వు కాలేయ సమస్యలు మరింత తీవ్రమవుతాయి. అందువల్ల రు వారానికి ఒకసారి వైద్యుడి సలహా మేరకు దీనిని తీసుకోవచ్చు. ఆహారంలో రెడ్ ట్ తీసుకోవడం తప్పనిసరి కాదు. శరీరానికి అవసరమైన ప్రోటీన్, ఇనుము, విటమిన్లు, ఇతర పోషకాలను పప్పుధాన్యాలు, తృణధాన్యాలు, పాలు, పెరుగు, జున్ను, గుడ్లు, చేపలు, సోయాబీన్స్, వేరుశెనగ వంటి ఆహారాల ద్వారా కూడా అందుతుంది.



## రోజుకు 7 గంటల కంటే తక్కువ నిద్రపోతున్నారా?

నేటి జీవనశైలిలో చాలామంది సరైన నిద్రకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. పని ఒత్తిడి, మొబైల్ వినియోగం, టీవీ, సోషల్ డియా వంటి అలవాట్ల కారణంగా రోజుకు 7 గంటల కంటే తక్కువ నిద్రపోవడం సాధారణమైపోయింది. అయితే, ఈ అలవాటు మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో మనిషి చాలా ఆరోగ్యకరమైన విషయాలకు దూరమవుతున్నాడు. అందులో ప్రధానమైనది నిద్ర. మారుతున్న జీవనశైలి, ఉద్యోగ సమయాలు ఇందుకు కారణమవుతున్నాయి. ఉద్యోగాలు చేస్తున్నవారు రాత్రి వేళల్లోనూ పనిచేయడం, ఇంట్లో ఉంటే ఫోన్లు, టీవీలకు అతుక్కుపోయి సమయానికి నిద్రపోవడం లేదు. రాత్రి ఆలస్యంగా నిద్రపోవడం, ఉదయం ఆలస్యంగా మేల్కోవడం అనేవి రెండూ కూడా మనిషి ఆరోగ్యానికి హానికరమైనవేనని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాత్రి సమయంలో 7 గంటల కంటే తక్కువగా నిద్రపోయే వారిలో అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని చెబుతున్నారు. అందుకే రాత్రి సమయంలో తప్పనిసరిగా 7 గంటలపాటు నిద్రకు సమయం కేటాయించాలని సూచిస్తున్నారు. నిద్ర తక్కువైతే ఎలాంటి ఆరోగ్య సమస్యలు వస్తాయి? నిద్ర అనేది శరీరానికి విశ్రాంతి మాత్రమే కాదు. శరీర కణాలు పునరుద్ధరించబడతాయి. మెదడు జ్ఞాపకశక్తిని బలోపేతం చేస్తుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. హార్మోన్లు సమతుల్యం అవుతాయి. అందుకే పెద్దవారికి రోజుకు కనీసం 7?8 గంటల నిద్ర తప్పనిసరి అని వైద్యులు సూచిస్తున్నారు. మానసిక ఆరోగ్యంపై ప్రభావం.. తక్కువ నిద్ర వల్ల ఒత్తిడి (*బితీవబబ) పెరుగుతుంది. ఆందోళన, డిప్రెషన్ వంటి సమస్యలు రావచ్చు. చిరాకు, కోపం ఎక్కువవుతాయి. గుండె సంబంధిత సమస్యలు.. నిద్ర లోపం దీర్ఘకాలంగా ఉంటే.. అధిక రక్తపోటు, గుండె పోటు ప్రమాదం, స్ట్రోక్ వచ్చే అవకాశం పెరుగుతుంది. షుగర్, బరువు పెరగడం.. తక్కువ నిద్ర వల్ల ఇన్సులిన్ పనితీరు తగ్గుతుంది. ఆకలి పెంచే హార్మోన్లు ఎక్కువవుతాయి. ఊబకాయం (వబతిబి*), ప్-2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. రోగనిరోధక శక్తి తగ్గిపోవడం.. నిద్ర సరిపోకపోతే శరీరం వైరస్‌లు, ఇన్ఫెక్షన్లను ఎదుర్కొనే శక్తిని కోల్పోతుంది. దీంతో తరచూ జలుబు, జ్వరం, అలసట లాంటివి వస్తుంటాయి. జ్ఞాపకశక్తి, పనితీరు తగ్గడం.. తక్కువ నిద్ర ఏకాగ్రతను తగ్గిస్తుంది. జ్ఞాపకశక్తి బలహీనమవుతుంది. పని లేదా చదువులో పని తీరు పడిపోతుంది.



## జామకాయ వీరికి యమ డేంజర్

జామ పండును పేదవాడి యాపిల్ అని అంటారు. తక్కువ ధరలో దొరికే ఈ పండులో ఉండే పోషకాలు చూస్తే ఆశ్చర్యపోవాల్సిందే. అయితే అందరికీ ఈ పండు ఆరోగ్యాన్ని ఇవ్వదు. ఈ సూపర్‌ఫ్రూట్ అందరికీ సరిపడదు అన్న విషయంకు తెలుసా..? కొందరిలో ఇది జీర్ణ సమస్యలకు, మరి కొందరిలో అలెర్జీలకు కారణమవుతుంది. ప్రకృతి మనకు ప్రసాదించిన అద్భుతమైన సూపర్‌ఫ్రూట్స్‌లో జామపండు ఒకటి. కేవలం రుచిలో మాత్రమే కాదు పోషకాల విషయంలోనూ ఇది మేటి. జామ పండులో విటమిన్ సి, డైటరీ ఫైబర్, పొటాషియం, శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఒక జామపండులో నారింజ కంటే ఎక్కువ విటమిన్ సి ఉంటుంది. ఇది శరీర రోగనిరోధక శక్తిని పెంచి, ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మం ముడతలు పడకుండా కాపాడి, యవ్వనంగా కనిపించేలా చేస్తాయి. అధికంగా ఉండే ఫైబర్ మలబద్ధకాన్ని నివారిస్తుంది. ప్రేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దీని గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల షుగర్ ఉన్నవారు మితంగా తీసుకుంటే మేలు జరుగుతుంది. అయితే ఆరోగ్యానికి అమృతంలా పనిచేసే జామపండు.. కొంతమందికి మాత్రం ఇబ్బందులను తెచ్చిపెడుతుంది. జామలో ఫ్రక్టోజ్, విటమిన్ సి అధికంగా ఉంటాయి. శరీరం గ్రహించగలిగే దానికంటే ఎక్కువ విటమిన్ సి తీసుకున్నప్పుడు అది ప్రేగులలో కిణ్వ ప్రక్రియకు దారితీసి గ్యాస్, కడుపు ఉబ్బరాన్ని కలిగిస్తుంది. ముఖ్యంగా నిద్రపోయే ముందు జామపండు తింటే ఈ సమస్య మరింత పెరుగుతుంది. జామపండు గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల షుగర్ ఉన్నవారికి ఇది మంచిదే. కానీ అతిగా తింటే మాత్రం రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగవచ్చు. డయాబెటిస్ ఉన్నవారు రోజుకు 1-2 చిన్న పండ్లకు మాత్రమే పరిమితం అవ్వడం మంచిది. ఎః* వంటి సున్నితమైన జీర్ణశయాంతర సమస్యలు ఉన్నవారికి జామలోని అధిక ఫైబర్ చికాకు కలిగించవచ్చు. దీనివల్ల కడుపు తిమ్మిరి, విరేచనాలు లేదా అధిక అపానవాయువు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి వారు తొక్క తీసి తినడం లేదా వండిన రూపంలో తీసుకోవడం ఉత్తమం. జామ ఆకులలోని కొన్ని బయోయాక్టివ్ సమ్మేళనాలు సున్నితమైన చర్మం ఉన్నవారికి అలెర్జీని కలిగించవచ్చు. దీనివల్ల చర్మం ఎర్రబడటం, దురద లేదా మంట రావచ్చు. చర్మ సమస్యలు ఉన్నవారు జామను వాడే ముందు నిపుణుల సలహా తీసుకోవాలి. జామపండును ఖాళీ కడుపుతో కాకుండా భోజనంతో పాటు లేదా స్నాక్ లాగా చిన్న భాగాల్లో తీసుకోవడం మంచిది. ఏ పండైనా మితంగా తీసుకున్నప్పుడే అది ఔషధంగా పనిచేస్తుంది. కు పైన పేర్కొన్న ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే, జామను డైట్‌లో చేర్చుకునే ముందు పోషకాహార నిపుణుడిని సంప్రదించండి.



# భారత్‌తో త్వరలోనే భారీ వాణిజ్య ఒప్పందం



స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్– 2026 సదస్సులో అమె రికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాల్గొ న్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన భారత్–అమెరికా మధ్య జరగబోయే వాణిజ్య ఒప్పందం, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని ప్రశంసిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. మోదీపై తనకు అపారమైన గౌరవం ఉంద న్నారు. ఆయన తనకు మంచి స్నేహితుడు మాత్రమే కాదు, ఒక అద్భుతమైన నాయకుడని కితాబిచ్చారు. ఇరు దేశాల మధ్య ఉన్న సంబంధాలు మోదీ నాయకత్వంలో మరింత బలోపేతం అయ్యాయని ఆయన పేర్కొన్నారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం గురించి ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. తాము భారత్‌తో ఒక అద్భుతమైన ఒప్పందాన్ని కుదుర్చుకోబోతున్నాం. దీనిపై చర్చలు తుది దశకు చేరుకున్నాయని అన్నారు. ఈ ఒప్పందం ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని కామెంట్ చేశారు. ప్రపంచ దేశాలతో వాణిజ్యపరమైన సవాళ్లు ఉన్నప్పటికీ, భారత్‌ను అమెరికా ఒక నమ్మకమైన మరియు వ్యూహాత్మక భాగస్వామిగా చూస్తోందని ట్రంప్ స్పష్టం చేశారు. 2030 నాటికి ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా ఈ కొత్త ఒప్పందం ఉండబోతోందని సమాచారం. కాగా, గతంలో కొన్ని సుంకాల విషయంలో విభేదాలు వచ్చినప్పటికీ, ట్రంప్ తాజా వ్యాఖ్యలతో ఆ అడ్డంకులు తొలగిపోయి, త్వరలోనే చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## బిజినెస్

# తీవ్ర అగాథంలోకి రూపాయి..



అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ అత్యంత అధ్వాన్న స్థాయికి పడిపోయింది. పతనంలో మరో నూతన రికార్డ్‌ను చవి చూసింది. భారత దేశ చరిత్రలోనే ఎప్పుడూ లేని స్థాయిలో బుధవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 92 చేరువకు పతనమయ్యింది. విదేశీ సంస్థగత మదుపర్లు వరుసగా తమ నిధులను తరలించుకుపోవడం, అమెరికా, భారత్ మధ్య వాణిజ్య ఒప్పంద అనిశ్చితి, పడిపోతోన్న రూపాయిని కాపాడటంతో మోడీ సర్కార్, రిజర్వ్ బ్యాంక్ విఫలం కావడంతో అత్యంత పేలవ ప్రదర్శన కనబర్చుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలోనే జనవరి 21న ఒక్క పూటలోనే 76 పైసలు కోల్పోయి 91.73కు దిగజారింది. ఫారెక్స్ ఎక్సేంజీ మార్కెట్‌లో ఉదయం 91.05 వద్ద ప్రారంభమైన రూపాయి విలువ ఓ దశలో 91.74 కనిష్టాన్ని చవి చూసింది. దీంతో ఒక్క డాలర్‌కు రూ.91.73 చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. ఈ ఒక్క నెలలోనే రూపాయి విలువ 1.50 శాతం విలువ కోల్పోయింది. ఇంతక్రితం 2025 డిసెంబర్ 16న డాలర్‌తో రూపాయి మారకం విలువ 91.14 కనిష్ట స్థాయిని చవి చూసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడి చమురు ధర 1.88 శాతం తగ్గి 63.70 డాలర్లుగా నమోదయ్యింది. రూపాయి విలువ పతనం అంతర్జాతీయ మార్కెట్‌లో దిగుమతులను తీవ్ర భారం చేయనున్నాయి. మరోవైపు విదేశీ చెల్లింపుల భారం అమాంతం పెరిగిపోనుంది.

# డాక్టర్ రెడ్డీస్ లాభం రూ.1,210 కోట్లు




డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ఏకీకృత ఖాతాల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.8,726.8 కోట్ల ఆదాయం, రూ.1,210 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఈపీఎస్ రూ.14.53గా నమోదైంది. 2024–25 ఇదే కాలంలో ఆదాయం రూ.8,358.6 కోట్లు, నికర లాభం రూ.1,413 కోట్లుగా ఉన్నాయి. దీంతో పోలిస్తే ఈసారి ఆదాయం 4.4 శాతం పెరిగింది. నికర లాభం 14 శాతం క్షీణించింది. బ్రాండెడ్ ఔషధాల మార్కెట్లో బలమైన వృద్ధి నమోదైనప్పటికీ, అమెరికాలో లెనాలిడోమైడ్ విక్రయాలు తగ్గడం, కొత్త లేబర్ కోడ్ నిబంధనల వల్ల ఏర్పడిన అదనపు ఖర్చుల కారణంగా నికర లాభంలో క్షీణత నమోదైనట్లు కంపెనీ పేర్కొంది. ‘2025–26 మూడో త్రైమాసికంలో మా వృద్ధికి బ్రాండెడ్ వ్యాపారాల్లో కొనసాగుతున్న జోరు అనుకూలంగా నిలిచింది. విదేశీ మారక ద్రవ్య విలువలు మద్దతుగా నిలిచాయి. ఇది లెనాలిడోమైడ్ విక్రయాల తగ్గుదల ప్రభావాన్ని భర్తీ చేసింది. మా వాటాదారులకు దీర్ఘకాలిక విలువను సృష్టించేందుకు మా భవిష్యత్తు వ్యూహాలను అమలు చేయడం, కార్యాచరణ సామర్థ్యాన్ని పెంచుకోవడంపై దృష్టి సారించాం’ అని ఫలితాల సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ సహ ఛైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–డిసెంబరు మధ్య కాలంలో డాక్టర్ రెడ్డీస్ రూ.26,077 కోట్ల ఆదాయంపై రూ.4,065 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2024–25 ఇదే 9 నెలల కాలంలో ఆదాయం రూ.24,047 కోట్లు, నికర లాభం రూ.4,060 కోట్లుగా ఉంది.

# సాగర్ సిమెంట్స్ ఆదాయం రూ.591 కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో సాగర్ సిమెంట్స్ రూ.591 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. దీనిపై రూ.64.10 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.564 కోట్లు, నికర నష్టం రూ.54.45 కోట్లుగా ఉన్నాయి. మొత్తం 9 నెలల కాలానికిగాను ఆదాయం రూ.1,863 కోట్లు, నికర నష్టం రూ.100.78 కోట్లుగా ఉన్నాయి. దాచేపల్లిలోని ఆంధ్రా సిమెంట్స్ ప్లాంటులో ఆగస్టు 2026 నాటికి సిమెంటు సామర్థ్యాన్ని ఇప్పుడున్న 2.25 మి.టన్నుల నుంచి 3 మి.టన్నులకు పెంచాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకొంది. రుతుపవనాలు దీర్ఘకాలం కొనసాగడం, పండగల నేపథ్యంలో గిరాకీ తక్కువగానే ఉన్నప్పటికీ, త్రైమాసికం చివరి నాటికి క్రమంగా మెరుగుపడిందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి వివరించారు. సామర్థ్యం పెంపు, ఖర్చుల నియంత్రణపై దృష్టి సారించినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, కర్బన ఉద్గారాల తగ్గింపులో భాగంగా హైదరాబాద్‌కు చెందిన సో అండ్ రీప్ చారాతో సాగర్ సిమెంట్స్ తాజాగా ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా తెలంగాణలోని మట్టంపల్లి సాగర్ సిమెంట్స్ ప్లాంటులో బయోచార్, గ్యాసిఫికేషన్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. స్థానిక గ్రామాల నుంచి సేకరించిన పత్తి పంట వ్యర్థాలను ఉపయోగించి సిన్‌గ్యాస్ ఉత్పత్తి చేస్తారు. దీనిని సిమెంట్ తయారీలో ఇంధనంగా వినియోగిస్తారు. ఈ పక్రియలో వచ్చే బయోచార్‌ను రైతులకు ఎరువుగా అందిస్తారు.

# సామాన్యుల కోసం

## ఎస్బీఐలో బెస్ట్ పొదుపు స్కీమ్



రోజు వారీ కూలీలు, నిర్మాణ రంగంలోని కార్మికులు రోజంతా కష్టపడి వచ్చిన కొద్ది డబ్బుతో తమ కుటుంబాన్ని పోషించుకుంటారు. వారు పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టడం అసాధ్యమనే చెప్పాలి.దీంతో కూలీ డబ్బుల్లోంచి కొంత తీసి ఇంట్లో దాచుకుంటుంటారు. అయితే ఇంట్లో దాయడం వల్ల దొంగతనం జరగడం, ఎలుకల బెడత వంటివి ఉంటాయి. అలాంటి సామాన్య ప్రజలు చిన్న మొత్తాల్లో పొదుపు చేసుకునేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అద్భుతమైన పొదుపు పథకం అందిస్తోంది. పొదుపు ఖాతాను మించిన వడ్డీ రేటు ఆఫర్ చేస్తోంది. అదే ఎస్‌బీఐ రికరింగ్ డిపాజిట్ స్కీమ్. నిర్ణీత కాలానికి చిన్న మొత్తాల్లో పొదుపు చేసుకునేందుకు ఈ రికరింగ్ డిపాజిట్ స్కీమ్ అవకాశం కల్పిస్తుంది. తమ ఆర్థిక లక్ష్యాన్ని చేరుకునేందుకు చేయూతనిస్తుంది. ఈస్కీమ్ కనీస మెచ్యూరిటీ కాలం 12 నెలలు. గరిష్ఠంగా 120 నెలలు (5 సంవత్సరాలు) పొదుపు చేసేందుకు అవకాశం ఉంటుంది. దేశంలోని అన్ని ఎస్‌బీఐ బ్యాంకు బ్రాంచీల్లో ఈ రికరింగ్ డిపాజిట్ స్కీమ్ అందుబాటులో ఉంటుంది.నెలవారీ కనీస డిపాజిట్ రూ.100 మాత్రమే. ఆ తర్వాత ఎంత మొత్తమైనా పొదుపు చేసుకోవచ్చు. అయితే, ప్రతి నెలా మ్కి డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. గడువులోగా డబ్బులు కట్టకపోతే పెనాల్టీ ఉంటుంది. వరుసగా ఆరు నెలలు డిపాజిట్ చేయకపోతే అకౌంట్ మూసేస్తారు. ఖాతాదారుకు అందులోని డబ్బులను తిరిగి ఇచ్చేస్తారు. ఎస్‌బీఐ రికరింగ్ డిపాజిట్ స్కీమ్‌లో నెలకు రూ.100 లేదా రూ.500 చొప్పున పొదుపు చేయాలని రు అనుకుంటే ఆర్‌డీ ఖాతా తెరవాల్సి ఉంటుంది. 5 సంవత్సరాల మెచ్యూరిటీ వ్యవధి ఎంచుకుంటే అప్పుడు వడ్డీ రేటు 6.50 శాతం ఉంటుంది. 60 ఏళ్ల వయసు దాటిన సీనియర్ సిటిజన్లు అయితే వడ్డీ రేటు 7 శాతంగా ఉంటుంది. 5 సంవత్సరాల తర్వాత ఎంత వస్తుందో ఆన్‌లైన్ కాలిక్యులేటర్‌ద్వారా ముందే లెక్కగట్టవచ్చు. నెలకు రూ.100 చొప్పున పొదుపు చేసిన వారికి 5 ఏళ్ల తర్వాత డిపాజిట్ మొత్తం రూ.6 వేలు అవుతుంది. దానిపై వడ్డీ రూ.1,106 వస్తుంది. అంటే అసలు వడ్డీ కలిపి మొత్తం రూ.7,106 వస్తాయి.

# వరుస షాకులిచ్చి.. భారీగా పడిపోయిన బంగారం ధరలు!



బ్రేకుల్లేకుండా దూసుకెళ్లిన బంగారం ధరలు నేడు శాంతించాయి. గత మూడ్రోజులుగా వరుస షాకులు తిన్న మహిళలకు నేడు కాస్త ఊరట లభించింది. ఇక ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా మహిళలు బంగారు అభరణాలు ధరిస్తారు. ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాల్లోని మహిళలందరూ బంగారానికి ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తారు. అనేక రకాల డిజైన్లతో లక్షల్లో విలువ చేసే కమ్మలు, నెక్లెస్లు, బ్యాంగిల్స్ వంటివి కొనుగోలు చేస్తుంటారు. ఆడవాళ్లకు ప్రతిరోజూ షాపింగ్ చేసిన బోర్ కొట్టదనడంలో ఎటువంటి సందేహం లేదని చెప్పవచ్చు. కాగా గోల్డ్ రేట్లు ఎప్పుడెప్పుడు తగ్గుతాయా? అంటూ మహిళలు వేయి కళ్లతో ఎదురుచూస్తుంటారు. కాస్త పసిడి ధరలు తగ్గుముఖం పట్టగానే బంగారం షాపుల్లో ఎగబడుతారు. అయితే ఇటీవల బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ రేట్లతో మహిళల్లో ఓసారి ఉత్సాహం నెలకొనగా... మరోసారి నిరాశకు గురవుతుంటారు. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో బంగారం రేట్లు భారీగా పెరుగుతున్నాయి. కొంచెం తగ్గగానే డబుల్, త్రిబుల్ ధర పెరుగుతుంది. ఇవాళ గోల్డ్ ప్రియులకు కాస్త ఊరట లభించింది. నిన్న 22 క్యారెట్లు.. 10 గ్రాముల బంగారం రూ.1,43,550 ఉండగా.. నేడు రూ. 2,100 తగ్గి రూ. 1, 41, 450గా ఉంది. ఇక నిన్న 24 క్యారెట్లు 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,600 గా ఉంది. నేడు రూ.2,290 తగ్గి రూ.1,54, 310 గా ఉంది. కాగా ఈ నేపథ్యంలో నిన్నటి ధరతో పోలిస్తే ఇవాళ పసిడి ధరల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి.

## క్రీడలు

### చరిత్ర సృష్టించిన పీవీ సింధు



భారత బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు తన కెరీర్‌లో 500 మ్యాచ్ విజయాలు సొంతం చేసుకుంది. ఈ ఘనత సాధించిన ఆరో వుమెన్స్ సింగిల్స్ షట్లర్‌గా, తొలి భారతీయురాలిగా రికార్డ్ సృష్టించింది. దీనికి ఇండోనేసియా సూపర్ 500 టోర్నమెంట్ ప్రీక్వార్టర్ ఫైనల్స్ వేదికైంది. గురువారం ఈ పోరులో ఆమె డెన్మార్క్‌కు చెందిన లైన్ హోజ్‌మార్క్ జాయర్‌ఫెల్డ్‌ను ఓడించింది. ప్రారంభ రౌండ్‌లో జపాన్‌కు చెందిన అన్‌సీడెడ్ మనామీ సుయిజు చేతిలో ఓడిపోయిన సింధు, లైన్ హోజ్‌మార్క్‌పై మాత్రం పూర్తి ఆధిపత్యం చెలాయించింది. 43 నిమిషాల్లో 21–19, 21–18 తేడాతో డానిష్ షట్లర్‌ను వరుసగా ఓడించింది. ఇప్పటివరకు జరిగిన ఆరు మ్యాచుల్లో సింధుకు లైన్‌పై ఇది అయిదో గెలుపు. ఈ ప్రదర్శనతోనే సింధు 500 విజయాల మార్క్‌ను అందుకుంది.

# అతడికీ, నాకూ ఉన్న తేడా అదే: సునీల్ గావస్కర్



భారత టీ20 స్పెషలిస్ట్ బ్యాటర్ అభిషేక్ శర్మను టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ కొనియాడాడు. నాగ్‌పూర్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన మొదటి టీ20లో అభిషేక్ 35 బంతుల్లోనే 84 పరుగులు చేసిన విషయం తెలిసిందే. అతడు కేవలం 22 బంతుల్లోనే హాఫ్‌సెంచరీ సాధించాడు. ఈ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 48 పరుగుల తేడాతో గెలుపొందింది. దీంతో సిరీస్‌లో భారత జట్టు 1–0తో ఆధిక్యం సాధించింది. తనకు, అభిషేక్ శర్మకు ఉన్న ప్రధాన తేడా ఏంటో సునీల్ గావస్కర్ వివరించాడు. ‘నేను మొదటి పరుగు చేయడానికి ఎన్ని బంతులు ఎదుర్కొంటానో.. అన్ని బంతుల్లో అభిషేక్ శర్మ హాఫ్‌సెంచరీ సాధించేశాడు. మా ఇద్దరి మధ్య చాలా తేడా ఉంది.’ అని సునీల్ గావస్కర్ అన్నాడు. నాగ్‌పూర్ మ్యాచ్‌లో మరో ఓపెనర్ సంజు శాంసన్ (10), ఇషాన్ కిషన్ (8) త్వరత్వరగా పెవిలియన్‌కు చేరారు. టీమ్‌ఇండియా 1.5 ఓవర్లకు 18 పరుగుల వద్ద తొలి వికెట్, 2.5 ఓవర్లకు 27 రన్స్ వద్ద రెండో వికెట్ కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కనబడింది. ఇలాంటి పరిస్థితుల్లో అభిషేక్ శర్మ ఏమాత్రం తన దూకుడు తగ్గించకుండా బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌తో కలిసి మూడో వికెట్‌కు 47 బంతుల్లోనే 99 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. దీంతో టీమ్‌ఇండియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 238 పరుగులు చేసింది. ఛేదనలో కివీస్ జట్టు 190 రన్స్ మాత్రమే చేయగలిగింది. అద్భుత ఇన్నింగ్స్ ఆడిన అభిషేక్ శర్మ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. రెండో టీ20 గువాహటి వేదికగా శుక్రవారం జరగనుంది.

# భారత్‌కు రావాల్సిందే..




బంగ్లాదేశ్‌కు పూర్తిగా దారులు మూసుకుపోయాయి. టీ20 ప్రపంచకప్ కోసం ఆ జట్టు భారత్‌కు రాక తప్పదు. లేదంటే టోర్నీ నుంచే తప్పుకోవాల్సి ఉంటుంది. తమ మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలన్న బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) అభ్యర్థనను ఐసీసీ తిరస్కరించింది. భారత్‌లో పొట్టి కప్పు జరిగే ఏ వేదికలోనూ బంగ్లా ఆటగాళ్లు, అధికారులు, అభిమానులకు ముప్పు వాటిల్లుతుందన్న సంకేతాలేమీ లేనందువల్ల షెడ్యూల్ ప్రకారమే మ్యాచ్‌లు జరుగుతాయని స్పష్టం చేసింది. షెడ్యూల్‌లో మార్పులు చేయడం సాధ్యం కాదని ఐసీసీ తేల్చిచెప్పింది. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన బోర్డు సమావేశంలో ఐసీసీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ‘‘ప్రస్తుత పరిస్థితుల్లో మ్యాచ్‌లను వేరే చోటుకి తరలిస్తే ఐసీసీ టోర్నీల గౌరవానికి ముప్పు వాటిల్లుతుంది. ప్రపంచ క్రికెట్ పాలక మండలి తటస్థతను దెబ్బతీస్తుంది’’ అని ఐసీసీ పేర్కొంది. బోర్డు సమావేశంలో సభ్య దేశాల్లో బంగ్లాదేశ్, పాకిస్థాన్ మాత్రమే మ్యాచ్‌ల తరలింపునకు అనుకూలంగా ఓటు వేసినట్లు ఐసీసీవర్గాలు తెలిపాయి. భారత్‌కు వెళ్లాలా? లేదా? అన్నది బుధవారం లోపు తేల్చుకోవాలంటూ బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)కి ఐసీసీ అల్టిమేటం జారీచేసిన సంగతి తెలిసిందే. కానీ తమ జట్టు భారత్‌కు వెళ్లదని, ఐసీసీ ఒత్తిడికి తాము తలవంచబోమని బంగ్లాదేశ్ ప్రభుత్వ క్రీడల సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ స్పష్టం చేశాడు. 20 జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీ కోసం బంగ్లాదేశ్.. భారత్‌కు రాని పక్షంలో ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌ను ఆడించాలని ఐసీసీ భావిస్తోంది. అంతే కాక బంగ్లాపై ఐసీసీ చర్యలు కూడా చేపట్టే అవకాశముంది. ఈ టోర్నీ ఆదాయంలో తమ వాటాను కోల్పోవడంతో పాటు జరిమానాను కూడా బంగ్లా క్రికెట్ బోర్డు (బీసీబీ) ఎదుర్కోవాల్సి రావచ్చు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడుల నేపథ్యంలో భారత అభిమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత రాగా, బీసీసీఐ ఆ దేశ ఫాస్ట్‌బౌలర్ ముస్తాఫిజుర్‌ను ఐపీఎల్ నుంచి తప్పించడంతో వివాదం రాజుకుంది.

## నా అమ్ములపొదిలో ఎక్కువ అస్త్రాలు లేవు!: అభిషేక్ శర్మ



నాగ్‌పూర్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన మొదటి టీ20లో టీమ్‌ఇండియా 48 పరుగుల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది. ఛేదనకు దిగిన న్యూజిలాండ్ 7 వికెట్లు కోల్పోయి 190 రన్స్ మాత్రమే చేయగలిగింది. భారత ఇన్నింగ్స్‌లో అభిషేక్ శర్మ (84; 35 బంతుల్లో, 5 ఫోర్లు, 8 సిక్స్‌లు) బ్యాటింగ్‌లో 240.00 స్ట్రైక్‌రేట్‌తో విధ్వంసం సృష్టించాడు. మ్యాచ్ అనంతరం అతడు తన సిక్స్ హిట్టింగ్ ఎబిలిటీ గురించి ప్రజెంటర్ అడిగిన ఓ ప్రశ్నకు సరదా సమాధానం ఇచ్చాడు. తన అమ్ములపొదిలో ఎక్కువగా క్రికెట్ షాట్లు లేవని, ఉన్నవాటినే బాగా ప్రాక్టీస్ చేస్తానని అతడు సమాధానమిచ్చాడు. ‘నేను ఎప్పుడూ నా షాట్లను నమ్ముకుంటాను. అయితే నాకు ఎక్కువ షాట్లు ఆడడం రాదు. నేను కొన్నింటిని మాత్రమే ఆడగలను. వాటినే బాగా ప్రాక్టీస్ చేస్తాను’ అని మ్యాచ్ అనంతరం అభిషేక్ శర్మ (Abhishek Sharma) అన్నాడు.

అలాగే బ్యాటింగ్‌లో తన హైరిస్క్ అప్రోచ్ గురించి అతడు మాట్లాడాడు. ‘నేను నా బ్యాటింగ్ శైలిని హైరిస్క్ అనుకోను. అదే నాకు కంఫర్ట్ జోన్. అయితే జట్టుకే నా తొలి ప్రాధాన్యం. మొదటి ఆరు ఓవర్లను టీమ్ సమర్థంగా వినియోగించుకోవాలనుకుంటుంది. అందుకే నేను మ్యాచ్‌కు ముందు ప్రాక్టీస్ చేస్తాను. మీరు గమనించే ఉంటారు.. అన్ని జట్ల ప్రధాన బౌలర్లుమొదటి మూడు ఓవర్లు బౌలింగ్ వేస్తారు. వారి బౌలింగ్‌లో స్కోర్ చేయగలిగితే.. మనదే పైచేయి అవుతుంది’ అని అతడు వెల్లడించాడు. ప్రస్తుతం అభిషేక్ శర్మ.. ఐసీసీ (ICC) టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో మొదటి స్థానంలో కొనసాగుతున్నాడు. న్యూజిలాండ్‌తో అయిదు టీ20ల సిరీస్‌లో భాగంగా.. గువాహటి వేదికగా శుక్రవారం రెండో మ్యాచ్ జరగనుంది. 1–0తో ఆధిక్యంలో ఉన్న భారత జట్టు రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# సొంత జట్టుతోనే పోటీ: గౌతమ్ గంభీర్

కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ టీమ్ ఇండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌ను ఉద్దేశించి ‘ఎక్స్’లో పోస్ట్ పెట్టారు. దీనిపై గంభీర్ స్పందించాడు. ‘నేను నా సొంత జట్టుతోనే పోటీ పడుతున్నా’ అని రిప్లై ఇచ్చాడు. న్యూజిలాండ్‌తో టీమ్‌ఇండియాకు మొదటి టీ20కు ముందు శుభాకాంక్షలు తెలుపుతూ శశిథరూర్ పోస్ట్ పెట్టారు. ప్రధానమంత్రి తర్వాత భారతదేశంలో అత్యంత కష్టమైన ఉద్యోగం గంభీర్‌దేనని ఆయన కొనియాడారు. బుధవారం నాగ్‌పూర్‌లో గంభీర్‌తో సమావేశమైన అనంతరం థరూర్ ఈ మేరకు సోషల్ మీడియాలో



ఒక పోస్ట్ చేశారు. ‘ప్రతిరోజూ లక్షలాది మంది ఆయన నిర్ణయాలను విమర్శిస్తున్నా, గంభీర్ ఎంతో ప్రశాంతంగా, దృఢ సంకల్పంతో, నిశ్శబ్దంగా ముందుకుసాగుతున్నాడు. అతడి సమర్థవంతమైన నాయకత్వానికి నా అభినందనలు’ అని అందులో థరూర్ పేర్కొన్నారు. ‘కృతజ్ఞతలు. అంతా సెటిల్ కావడానికి ఇంకాస్త సమయం పడుతుంది. అప్పుడు కోచ్ అపరిమిత అధికారం సాకారమవుతుంది. అయితే ఈలోగా నన్ను నా సొంత జట్టు సభ్యులకే వ్యతిరేకంగా చూపించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది’ అని గౌతమ్ గంభీర్ రిప్లై ఇచ్చాడు. అతడి సమాధానం ప్రస్తుతం నెట్టింట పలు చర్చలకు దారితీస్తోంది. అయితే గంభీర్ ఎవరి పేరునూ ప్రత్యేకంగా ప్రస్తావించలేదు. కానీ తనకు ప్రస్తుతం కోచ్‌గా అపరిమిత అధికారాలు లేవని మాత్రం ఆ పోస్ట్‌లో స్పష్టంగా చెప్పాడు. కొంతకాలంగా గంభీర్ కోచింగ్‌పై టీమ్‌ఇండియా అభిమానుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. తాజాగా న్యూజిలాండ్‌తో ముగిసిన వన్డే సిరీస్‌ను భారత్ 1–2 తేడాతో కోల్పోయిన తర్వాత సోషల్ మీడియాలో గంభీర్‌ను నెటిజన్లు మరింత ట్రోల్ చేస్తున్నారు.

# అగ్రస్థానం కోల్పోయిన కోహ్లి



దుబాయ్: వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి నంబర్‌వన్ స్థానాన్ని కోల్పోయాడు. బుధవారం ఐసీసీ ప్రకటించిన జాబితాలో న్యూజిలాండ్ మిడిలార్డర్ బ్యాటర్ డరిల్ మిచెల్ అగ్రస్థానాన్ని చేజిక్కించుకున్నాడు. మిచెల్ భారత్‌తో మూడు వన్డేల సిరీస్‌లో రెండు శతకాలు, ఒక అర్ధశతకంతో మొత్తంగా 352 పరుగులు సాధించి.. కోహ్లిని రెండో స్థానానికి నెట్టాడు. రోహిత్‌శర్మ 4, శుభ్‌మన్ గిల్ 5, కేఎల్ రాహుల్ 10, శ్రేయస్ అయ్యర్ 11వ ర్యాంకులు సాధించారు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో కుల్దీప్ యాదవ్ 7, మహ్మద్ సిరాజ్ 14వ స్థానాల్లో నిలిచారు. రషీద్ ఖాన్ (అఫ్గానిస్థాన్) నంబర్‌వన్‌గా కొనసాగుతున్నాడు.

# వుదయం సినిమా



# సినీ తారల అసలు పేర్లు



## జమున

జమున హంపిలో 30819 36న పుట్టాక పెట్టినపేరునిప్పాణి జానాబాయి.జమునగా పురోహితుల సూచనతో మార్చారు. దుగ్గిరాల లో పెరుగుతూ తల్లి కౌసల్యా దేవి నుండి సంగీతం నేర్చుకుంది. జగ్గయ్య టీచర్ గా చేసేటప్పుడు ఆయన విద్యార్థిని. నాటకాల్లో కూడా జగ్గయ్య నటింపజేశారు. డా.గరికిపాటి రాజారావు తీసిన 'పుట్టిల్లు' లో 16 వ ఏట నటించగా 1953లో విడుదలైంది. మిస్సమ్మ తో బాగా పేరు వచ్చింది. బంగారు పాప, భాగ్య రేఖ, ఇల్లరికం, గులేబాకావళి కథ, మూగ మనసులు, లేత మనసులు ఇలా పలు సినిమాలు పేరు తెచ్చాయి. సత్యభామ గా ఎనలేని పేరు వచ్చింది. రాజమండ్రి నుంచి కాంగ్రెస్ ఎంపీ అయింది. తెలుగు తమిళ కన్నడ హిందీ భాషల్లో 198 చిత్రాలు చేసింది. భారతీయ చిత్ర సీమలో మంచి నటి,అందగత్తె. ఎన్ టి ఆర్ అవార్డు కూడా లభించింది.

## సంజీవ్ కుమార్



గుజరాత్ లోని సూరత్లో 97 1938న జన్మించి నపుడు పెట్టిన పేరు హరిహర్ జెఠా లాల్ జరీ వాలా. హరీభాయ్ అని కూడా పిలిచే ఈయన భారతీయ చిత్రసీమ లో అత్యద్భుత నటుడుగా గుర్తింపు పొందిన వ్యక్తి.జాతీయ స్థాయిలో ఉత్తమ నటుడుగా 1970లో దస్తక్, 1972లో కోశిష్ సినిమాలకు లభించాయి. ఇంకా అనేక అవార్డులు లభించాయి. తొలుత రంగస్థల నటుడై 1960లో 'హమ్ హిందూస్తాని'లో చిన్న పాత్ర చేసాక 1965లో 'నిషాన్ 'తో గుర్తింపు వచ్చింది. తన అసలు పేరు బాగా లేదని తల్లి పేరు లోని ఎస్ కలిసి వచ్చేలా కుమార్ గా కొనసాగాలని స్నేహితులతో, దర్శకుడు కమల్ అమ్రోహితో చర్చించగా సంజయ్ కుమార్ అని చెప్పారు. రెండు సినిమాల్లో ఈ పేరుతో కొనసాగి సంజయ్ ఖాన్ అనే నటుడు గుర్తుకు వచ్చి ఒకే రకమైన పేరుతో ఇద్దరెలా? అని సంజీవ్ కుమార్ అయ్యారు.తెలుగు, తమిళ,మరాఠి, పంజాబీ సింధీ, గుజరాతీ భాషల్లో నటించారు. శారద, ఎల్. విజయలక్ష్మి సంజీవ్ తో నటించడం విశేషమే! షోలే, ఖిలోనా, త్రిశూల్, దేవత, మన్ చలి ఇలా ఎన్నో పేరు తెచ్చాయి. 6111985న గుండె పోటుతో మృతి చెందారు. చివరి చిత్రం 'ప్రొఫెసర్ కి పడోసన్ '1993లో విడుదలైంది.

## ప్రేమ్ నజీర్



మలయాళ నటుడు ప్రేమ్ నజీర్ అసలు పేరు అబ్దుల్ ఖాదిర్. నిత్య హరిత నాయకన్ గా ఆ చిత్రసీమలో మంచి పేరు. 724 చిత్రాల్లో నటించినందుకు ఒకసారి, హీరోయిన్ షీలాతో 110చిత్రాల్లోనటించినందుకు రెండోసారి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ లభించింది.ఒకే ఏడాది 80 మంది హీరోయిన్లతో నటించగా 39 సినిమాలు విడుదల కావడమూ విశేషమే! 1951లో కె ఎమ్ కె మేనన్ నిర్మించగా అబ్దుల్ ఖాదిర్ నటించిన 'త్యాగసీమ' రాజకీయ సమస్యలతో ఇప్పటికీ విడుదల కాలేదు. 1952లో ఎమ్.కె.చారి దర్శకుడుగా 'మరు మగల్'లో అబ్దుల్ ఖాదిర్ పేరుతో నటించారు. టి.మోహనరావు దర్శకత్వంలో 'విసపింటె విలి' లో 1952లో నటిస్తుండగా నటుడు దర్శక రచయత తుక్కురుసి సుకుమారన్ నాయర్ ప్రేమ్ నజీర్ అనే పేరు పెట్టారు. దీన్ని 'ఆకలి'గా తెలుగులో పునర్నిర్మించి 1952లో విడుదల చేసారు.తండ్రి సినిమాలో 1953లో నటిం చారు. తమిళ, కన్నడ చిత్రాల్లోనూ నటించారు. 1611989న మృతి చెందగా కడతోండమ్ అంబాడీ 1990లో విడుదలైన ప్రేమ్ నజీర్ చివరి సినిమా. 1983లో పద్మ భూషణ్ లభించింది.

## దీప



దీప అసలు పేరు ఉన్నీ మేరీ. తెలుగు తమిళ కన్నడ హిందీ భాషల్లో నటించింది. 1231962న ఎర్ణాకుళం లో పుట్టిన ఈమె మలయాళ సినిమాల్లో అసలు పేరుతో మిగతా భాషల్లో దీపగా ప్రసిద్ధి చెందింది. ఆధునిక యువతిగా, గ్లామర్ డాల్ గా, పక్కింటి పిల్లగా తన నటనతో పేరు పొందింది. తల్లి విక్టోరియా స్థాపించిన ట్రూప్ లో బాల్యం నుంచి నటిస్తూ క్లాసికల్ నృత్యంలోను మంచి శిక్షణ పొందింది. ఏడవ ఏట 'నవ వధు' మలయాళ సినిమాలో పరిచయమై కొన్ని చేసాక 1975లో ప్రేమ్ నజీర్ నటించిన ' పిక్నిక్ ' లో రాధగా నటించి సహాయ నటిగా మారింది. 1975లో కమల్ హాసన్ తో 'అంత రంగం' తమిళంలో(ఇది అందాల రాజా గా తెలుగులోకి డబ్ అయింది), 1976లో సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించిన 'అమెరికా అమ్మాయి'తో తెలుగులోను దీపగా పరిచయమైంది. పేరు మరింత ఆకర్షణీయంగా ఉండటానికి దర్శకుడు దేవరాజన్ ఉన్నీ మేరీ పేరును "దీప"గా మార్చారు.పంతులమ్మ, అక్బర్ సలీమ్ అనార్కలి, అందమె ఆనందం, నాగమల్లి, ఖైదీ కాళిదాసు, దీపారాధన, చల్ మోహన రంగా, లేడీస్ టైలర్, స్వాతి ముత్యం ఇలా పలు సినిమాలు పేరు తెచ్చాయి. రాజకీయ రంగం లోను ప్రవేశించి 1992లో పట్టాతు రాణి తమిళ సినిమాతో రిటైరైంది.

## విష్ణు వర్ధన్



విష్ణు వర్ధన్ అసలు పేరు సంపత్ కుమార్ 1891950న మైసూర్ లో జన్మించారు. కన్నడ సినిమాల్లో ఎక్కువగాను తెలుగు తమిళ మలయాళ హిందీ భాషల్లోను మొత్తం 220సినిమాల్లోనటించారు. కథా రచయత, గాయకుడు. 'వంశ వృక్ష ' కన్నడ సినిమాలో 1972లో సహాయ నటుడై ఆ సంవత్సరమే 'నాగరహావు 'సినిమాలో హీరోగా నటించారు.ఈ చిత్ర దర్శకుడు పుట్టన్న కనగల్ సినిమా పాత్రను దృష్టిలో పెట్టి విష్ణు వర్ధన్ గా మార్చారు. ఈ సినిమాయే యాంగ్రీ యంగ్ మేన్ గా పేరు తెచ్చింది. వైవిధ్యమైనపాత్రలతోయాంగ్రీ యంగ్ మాన్ గా, సాహస సింహగా, దాదాగా, మ్యాటినీ ఇడల్ గా కన్నడ నాట పేరొంది అనేక అవార్డులు పొందారు. ప్రముఖ నటి భారతి ఈయన భార్య.సర్దార్ ధర్మన్న, ఒక్కడు చాలు తెలుగు చిత్రాల్లో, అలైగల్ తదితర తమిళ సినిమాల్లో ఏక్ నయా ఇతిహాస్, ఆశాంత్ వంటి హిందీ సినిమాల్లో నటించారు.30122009న మృతి చెందారు.



వి.ఎస్.ఆర్.కేశవరావు

# ఫిబ్రవరి 6న బరాబర్ ప్రేమిస్తా

యాటిట్యూడ్ స్టార్ చంద్రహాస్ హీరోగా వస్తున్న కొత్త చిత్రం 'బరాబర్ ప్రేమిస్తా'. సంపత్ రుద్ర దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాను కాకర్ల సత్యనారాయణ సమర్పణలో సిసి క్రియేషన్స్, ఎవిఆర్ మూవీ వండర్స్ బ్యానర్లపై గెడా చందు, గాయత్రి చిన్ని, ఎవిఆర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో మిస్ ఇండియా ఫైనలిస్ట్ మేఘన ముఖర్జీ హీరోయిన్‌గా నటించారు. అర్జున్ మహీ ("ఇష్టంగా" ఫేమ్) ప్రతినాయకుడిగా నటించారు. ఇప్పటి వరకు 'బరాబర్ ప్రేమిస్తా' నుంచి వచ్చిన పోస్టర్లు, టీజర్, పాటలు ఇలా అన్నీ కూడా యూత్‌ను బాగా అట్రాక్ట్ చేశాయి.

ఈ నేపథ్యంలోనే తాజాగా ఈ మూవీ రిలీజ్ డేట్ అనౌన్స్మెంట్ ఈవెంట్ హైదరాబాద్ లోని బ్రిలియంట్ గ్రూప్ ఆఫ్ కాలేజీస్ లో నిర్వహించారు. స్టూడెంట్ తో డాన్సులు చేసిన హీరో హీరోయిన్.. ఆపై ఫిబ్రవరి 6న సినిమా రిలీజ్ డేట్ అని ప్రకటించి అందరిలో జోష్ నింపారు.

హీరో చంద్రహాస్ మాట్లాడుతూ .. ''మా సినిమా ప్రమోషన్స్ ఈ కాలేజీ నుంచే స్టార్ట్ చేస్తున్నాం. మీ అందరినీ చూస్తుంటే చాలా ఎనర్జీ వచ్చేస్తోంది. ఫిబ్రవరి 6న బారాబర్ ప్రేమిస్తా సినిమాతో విక్టరీ కొట్టబోతున్నాం అని నమ్మకంగా చెబుతున్నా. అందరూ ఈ సినిమా చూసి ఎంజాయ్ చేయండి''

హీరోయిన్ మేఘన ముఖర్జీ మాట్లాడుతూ .. ''అందరికీ థ్యాంక్స్. ఫిబ్రవరి 6న బారాబర్ ప్రేమిస్తా సినిమాతో మీ ముందుకు రాబోతున్నాం. మా సినిమా మీ అందరికీ నచ్చుతుందని బలంగా నమ్ముతున్నా'' అన్నారు.

డైరెక్టర్ సంపత్ రుద్ర మాట్లాడుతూ .. ఒక ఊరిలో ఒక అమ్మాయి, ఒక అబ్బాయి కొట్టుకుంటే ఎలా ఉంటుంది అనేదే మా బారాబర్ ప్రేమిస్తా సినిమా. ఇది ప్యూర్ తెలంగాణ బ్యాక్ ఓవర్ లో ఫుల్ ఎంటర్టైన్మెంట్ సినిమా. ఫిబ్రవరి 6న అందరూ చూ సే యం డి అన్నారు.





# ఊర్వశి శారదకు జేసీ డేనియల్ అవార్డు!

మన తెలుగు సీనియర్ నటి శారదకు మరో ప్రతిష్ఠాత్మక అవార్డును లభించింది. కేరళ ప్రభుత్వం 2024 సంవత్సరానికి గాను అత్యున్నత సినీ పురస్కారమైన జేసీ డేనియల్ అవార్డు ప్రదానం చేయడానికి ఎంపిక చేసింది. దక్షిణాది నటిగా శారదకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఐదు దశాబ్దాలకు పైగా నటనతో ఎందరో ప్రేక్షకుల అభిమానాన్ని సంపాదించుకుంది. మలయాళ సినీ పరిశ్రమకు ఆమె అందించిన అసమాన సేవలను గుర్తిస్తూ, కేరళ ప్రభుత్వం 2024 సంవత్సరానికి గాను

అత్యున్నత సినీ పురస్కారమైన జేసీ డేనియల్ అవార్డు ఇవ్వడానికి ఎంపిక చేసింది. తెలుగు, తమిళం, మలయాళం భాషల్లో విభిన్నమైన పాత్రలు పోషించి నటిగా అగ్రస్థానాన్ని అందుకున్న శారద, ఈ అవార్డు ద్వారా మరోసారి జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం కింద రూ.5 లక్షల నగదు బహుమతి, ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేయనున్నారు. జనవరి 25న తిరువనంతపురంలో జరగనున్న కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డుల ప్రదానోత్స వంలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ చేతుల మీదుగా శారద ఈ గౌరవాన్ని స్వీకరించనున్నారు.

# 25న ఈటీవీ విన్‌లో గొల్ల రామవ్వ



తాళ్ళూరి రామేశ్వరి టైటిల్ పాత్ర పోషించిన "గొల్ల రామవ్వ" తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని... ఈ చిత్ర ట్రైలర్ ఆవిష్కరణ వేడుకలో పాల్గొన్న ముఖ్య అతిధులు పేర్కొన్నారు. స్వర్గీయ భారత ప్రధాని పి.వి.నరసింహారావు రాసిన తెలంగాణ సాయుధ పోరాటగాథకు దృశ్యరూపంగా ముళ్లపూడి వరా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ రోమాంఛిత వీరగాథను... సుచేత డ్రీమ్ వర్క్స్ ప్రొడక్షన్ వర్మ డ్రీమ్ క్రియేషన్స్ పతాకాలపై... రామ్ విశ్వాస్ హనూర్కర్ రాఘవేంద్రవర్మ (బుజ్జి) సంయుక్తంగా నిర్మించారు. యువ ప్రతిభాశాలి అజహర్ షేక్ ఈ చిత్రానికి కార్యనిర్వాహక నిర్మాతగా కీలక బాధ్యతలు నిర్వహించడంతోపాటు... సాహిత్యం సమకూర్చడం విశేషం!! ఇంతకుముందు ఈటీవీ విన్ కోసం "మౌనమే నీ భాష" చిత్రాన్ని నిర్మించి, వీక్షకుల నుంచి విశేష ఆదరణ పొందిన టీమ్ నుంచి వస్తున్న "గొల్ల రామవ్వ" ఈనెల 25 (జనవరి 25) నుంచి ఈటీవీ విన్ లో స్ట్రీమింగ్ కానుంది. "తెలుగు సీతామాలక్ష్మి" తాళ్ళూరి రామేశ్వరి టైటిల్ పాత్రలో తెరకెక్కిన ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ వేడుకలో పి.వి.నరసింహారావు తనయులు పి.వి.ప్రభాకరరావు, తనయ బారాస ఎమ్.ఎల్.సి. శ్రీమతి సురభి వాణీదేవి, ప్రముఖ గీత రచయితలు కాసర్ల శ్యామ్, మౌనశ్రీ మల్లిక్, ప్రముఖ నటులు రాజీవ్ కనకాల, "రజాకార్" దర్శకులు యాటా సత్యనారాయణ, సీనియర్ దర్శకులు ఉదయభాస్కర్ పాల్గొని... చిత్ర దర్శకుడు ముళ్ళపూడి వరా, నిర్మాతలు రామ్ విశ్వాస్ హనూర్కార్, రాఘవేంద్రవర్మలను అభినందించారు. మా నాన్నగారు రాసిన గొప్ప కథల్లో ఒకటైన "గొల్ల రామవ్వ"ను ఎంతో గొప్పగా తెరకెక్కించారని వాణీదేవి ప్రశంసించారు. చిత్ర బృందం పెద్ద సంఖ్యలో ఈ వేడుకలో పాలుపంచుకుని... ఈ సినిమాకి పనిచేసే అదృష్టం లభించడం పట్ల గర్వం వ్యక్తం చేశారు. ఈనెల 25 నుంచి ఈటీవీ విన్ లో ప్రసారం కానున్న ఈ చిత్రం తెలుగువారి గుండెల్లో శాశ్వత స్థానం దక్కించుకుంటుందని పేర్కొన్నారు!!

# 'హలో ఇట్స్ మీ' నుంచి పోస్టర్ విడుదల

ప్రభుత్వ జూనియర్ కళాశాల చిత్రంతో హీరోయిన్ గా ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న షగ్నశ్రీ వేణున్ దర్శకురాలిగా మారి రూపొందిస్తున్న సినిమా "హలో ఇట్స్ మీ". ఈ సినిమాలో వరుణ్ సందేశ్ హీరోగా నటిస్తున్నారు. షగ్నశ్రీ హీరోయిన్ గా నటిస్తోంది. దర్శన్ మదమంచి మరో హీరోగా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఎస్ 2 ఎస్ సినిమాస్, శ్వాస్ ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై వీఎస్ కె సంజీవ్, వంగపల్లి సందీప్, వంగపల్లి సంకీర్త్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉన్న ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ ను ఈ రోజు హైదరాబాద్ లో జరిగిన ఈవెంట్ లో లాంఛ్ చేశారు.

నటుడు రాజశేఖర్ మాట్లాడుతూ నేను షగ్నతో గతంలో ఓ షార్ట్ ఫిలిం చేశాను. అందులో నాది ఆమెకు ఫాదర్ రోల్. అప్పటి నుంచి డాడీ అని పిలుస్తుంటుంది. ఈ చిత్రంలో మంచి క్యారెక్టర్ లో నటించే అవకాశం రావడం హ్యాపీగా ఉంది. మా తల్లిదండ్రి రాజశేఖర్ అని పేరు పెడితే, ఈ కళామతల్లి శుభోదయం సుబ్బారావు అనే పేరు పెట్టింది. అన్నారు.

నటుడు డా. భద్రమ్ మాట్లాడుతూ హలో ఇట్స్ మీ చిత్రంలో నటించడం సంతోషంగా ఉంది. వరుణ్ సందేశ్ గారితో నేను గతంలో నింద అనే మూవీలో నటించాను. ఆయన పర్ఫార్మెన్స్ కు ఆశ్చర్యపోయాను. ఈ సినిమాలో కూడా ఆయన నటనకు పేరొస్తుంది. షగ్న ఈ సినిమాను ఎంతో పట్టుదలగా రూపొందించింది. ఈ నిర్మాతలకు ఎన్నో వ్యాపారాలు ఉన్నా సినిమా ఇండస్ట్రీ మీద ప్యాషన్ తో వచ్చారు. అన్నారు. నటుడు జశ్వంత్ మాట్లాడుతూ హలో ఇట్స్ మీ చిత్రంలో మంచి కంటెంట్ ఉంది. ఈ సినిమా చూశాక ఒక అబ్బాయి ఎలాంటి తప్పు చేయకూడదో ఒక అమ్మాయి ఎలాంటి తప్పు చేయకూడదో తెలుసుకుంటారు. ఈ సినిమాతో దర్శకురాలిగా షగ్నకు మంచి పేరొస్తుంది. అన్నారు.

నటి నందిని మాట్లాడుతూ నటిగా నా ఫస్ట్ మూవీ ఇది. తొలి చిత్రమే నా ఫేవరేట్ హీరో వరుణ్ సందేశ్ గారితో కలిసి నటించడం హ్యాపీగా ఉంది. నాకు ఈ అవకాశం ఇచ్చిన డైరెక్టర్, హీరోయిన్ షగ్న, ప్రొడ్యూసర్స్ కు థ్యాంక్స్. అన్నారు.

డీవోపీ బ్రహ్మతేజ మరిపూడి మాట్లాడుతూ ఈ చిత్రాన్ని షగ్న అన్నీ తానై వన్ మ్యాన్ ఆర్మీలా రూపొందించింది. మనకు ఆ మధ్య విపరీతంగా చలి వాతావరణం వచ్చింది. ఆ టైమ్ లో మేము నైట్ షూటింగ్ చేశాం. ఆర్టిస్టుల పర్ ఫార్మెన్స్ ఈ సినిమాకు హైలైట్ అవుతాయి. అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ వంశీకాంత్ రేఖన మాట్లాడుతూ హలో ఇట్స్ మీ వంటి ఒక మంచి మూవీలో పార్ట్ అయినందుకు సంతోషంగా ఉంది. ఈ రోజు సమాజంలో యూత్ ఎలా ఉండాలి, ఎలా ఉండకూడదు అనే విషయాల్ని ఈ చిత్రంలో ఆకట్టుకునేలా చూపిస్తున్నారు. వరుణ్ సందేశ్ గారు ఈ ప్రాజెక్ట్ లోకి వచ్చాక మ్యూజిక్ డైరెక్టర్ గా నేను ఇంకా ఎక్కువ ఎగ్జైట్ అయ్యాను. ఆయనకు కూడా మా పాటలు అన్నీ బాగా నచ్చాయి. అన్నారు.






# హ్యాపీ రాజ్ ప్రోమో విడుదల

ఆసక్తికరమైన టైటిల్ అనౌన్స్‌మెంట్ నుంచే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించి సినీ వర్గాల్లో చర్చల్లో నిలుస్తున్న చిత్రం 'హ్యాపీ రాజ్'. ప్రమోషన్స్ పరంగా వినూత్నంగా వెళ్తున్న చిత్ర యూనిట్ తాజాగా అధికారిక ప్రోమో విడుదల చేసింది. రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ చేతుల మీదుగా విడుదలైన తెలుగు ప్రోమో.. సినిమా స్టోరీ ఎలా ఉండబోతోందో చెప్పకనే చెప్పేసింది. డిఫరెంట్ స్టైల్ మేకింగ్ తో విడుదలైన కొద్ది సమయంలోనే సోషల్ మీడియా వేదికలో ఈ వీడియో వైరల్ అయింది.

జయవర్ధన్ నిర్మిస్తున్న ఈ చిత్రం, బియాండ్ పిక్చర్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం.1గా రూపొందుతోంది. అన్ని వర్గాల ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి మారియా ఎలాంచెజియన్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ప్రతి ఫ్రేమ్ కూడా వైవిధ్యంతో కూడి ఉండి ఆకర్షిస్తోంది.

ఈ సినిమాలో జీవీ ప్రకాశ్ కుమార్ టైటిల్ పాత్రలో నటిస్తున్నారు. రిఫ్రెషింగ్ విజువల్స్, లైట్ హ్యూమర్, హాయిగా సాగే టోన్‌తో ఈ చిత్రం ప్రేక్షకులకు ఒక మంచి సినిమా అనుభూతిని అందించబోతోందనే నమ్మకాన్ని ప్రోమో బలంగా కలిగిస్తోంది. ముఖ్యంగా ఈ రోజుల్లో అవసరమైన హ్యాపీనెస్‌ను అందించే సినిమాగా ఇది నిలవబోతోందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

ఈ చిత్రంలో జీవీ ప్రకాశ్ కుమార్ టైటిల్ పాత్ర పోషిస్తున్నారు. శ్రీ గౌరి ప్రియా ప్రధాన పాత్రలో నటిస్తుండగా, చాలా కాలం తర్వాత అబ్బాస్ మళ్ళీ సినిమాల్లోకి తిరిగి రావడం విశేషంగా మారింది. ఇకపోతే ఈ చిత్రంలో జార్జ్ మరియం, ప్రార్థనా, అధిర్చ అరుణ్, మదురై ముత్తు, సోఫా బాయ్ రసూల్ తదితరులు

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sai Sree Offset Printers, # 7-17-166, 3rd line, Srinagar, Guntur - 522002 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Maria, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.